తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 26.07.2026 | సంపుటి :13 సంచిక : 06 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



పోరాటం గెలిచింది

# విద్యార్థులే విజేతలు

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ యూజీ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు. దీంతో నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై శనివారం కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. సీజేపీ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. విద్యార్థులపై పెట్టిన కేసులను క్రమంగా ఎత్తివేస్తామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. దిల్లీ, మిగతా రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఎత్తివేస్తామని, భవిష్యత్తులోనూ ఎవరినీ కేసులతో వేధించబోమని స్పష్టం చేశారు. అలాగే, బాధిత కుటుంబాలకు పరిహారంపై చర్చించామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- కేంద్రం మెడలు వంచిన జెన్‌జీ.. ఇది ఆరంభం మాత్రమే
- రాజీనామా చేయలేదు.. చేయించాం
- హిందూ ముస్లిం రాజకీయాలు ఇకనైనా మానుకోండి
- కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే
- ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం
- గాంధీ నుంచే శాంతిని నేర్చుకున్నామని వెల్లడి





న్యూఢిల్లీ,జూలై25(జనంసాక్షి): నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. శనివారం ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్రమోడీకి పంపారు. యువత, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనలకు కేంద్ర మంత్రి దిగొచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తన రాజీనామా లేఖలో ఆయన మాట్లాడుతూ.. గత నాలు దశాబ్దాలుగా మిగతా 2లో..



## జెన్ జీత్ గయా..

ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి: రాహుల్

- విద్యావ్యవస్థపై ఆర్‌ఎస్‌ఎస్ ప్రభావం
- మోదీ సర్కార్‌కు ఇదో మేలుకొలుపు
- విద్యార్థుల ఆందోళనలు దేశంలో ఉన్న సంక్షోభానికి నిదర్శనమని వెల్లడి
- ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే ప్రజల ముందు తలవంచాల్సిందే: ఖర్గే
- దేశ యువత పోరాటం అసామాన్యం.. ఇదంతా వారి విజయం
- ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమం: ప్రియాంక

2లో..

## డిమాండ్లు ఒప్పుకున్న సర్కారు



- విద్యార్థులపై భేషరతుగా కేసుల ఎత్తివేతకు అంగీకారం
- భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో వేధించమని హామీ
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వడానికీ సానుకూలం
- కేంద్రమంత్రులతో సీజేపీ ప్రతినిధుల చర్చలు సఫలం
- జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

న్యూఢిల్లీ,జూలై 25 (జనంసాక్షి): జంతర్ మంతర్ ఆందోళన ముగిసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి చేపట్టిన ఆందోళన ముగించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని మిగతా 2లో..

అధికారం కంటే ప్రజాశక్తి

## ఎప్పుడూ గొప్పదే

ధర్మేంద్ర రాజీనామాపై కేటీఆర్ పోస్ట్

2లో..

## ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యం

'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం

బండి సంజయ్

# చట్ట సభల్లోకి జెన్ జీ..

21 ఏళ్లకే శాసనసభ, లోక్‌సభ, 25 ఏళ్లకే మండలి, రాజ్యసభకు పోటీ

- జెన్ జీకి అవకాశం కల్పించాలంటూ శాసనసభలో ప్రత్యేక తీర్మానం
- లోక్‌సభలో 1 శాతం కంటే తక్కువగా జెన్ జీ ప్రాతినిధ్యం
- రాహుల్ గాంధీ మంత్రివర్గంలో జెన్ జీకే విద్యా శాఖ
- జెన్ జీ నిరసన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

హైదరాబాద్(జనంసాక్షి): అత్యున్నత చట్ట సభలైన శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ తరం ప్రాతినిధ్యం వహించాలని, అందుకు అవసరమైన తీర్మానాన్ని శాసనసభలో ఆమెదించి కేంద్రానికి పంపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అవుతున్నప్పుడు మన దేశ యువతకు ఎందుకు ఆ అవకాశం ఉండకూడదని ఆయన ప్రశ్నించారు. నీట్ ప్రశ్నా పత్రాల లీక్‌కు బాధ్యత వహిస్తూ మిగతా 2లో..



## ప్రజలందరూ ఏకమై పోరాడారు

ఇది ప్రజా విజయం : సోనమ్ వాంగ్ చుక్



న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాపై వాంగ్ చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ "ఇది ప్రజాస్వామ్య విజయం. వీధుల నుంచే నేరుగా వచ్చిన ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఇది. శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయమిది. భయాన్ని వీడి దేశంలోని నలుమూలల నుంచి కదిలి వచ్చిన పౌరులందరికీ కృతజ్ఞతలు. కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు అభినందనలు' అని అన్నారు. కాగా నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, తన దీక్ష విరమణపై వస్తున్న విమర్శలకు ఘాటుగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వంతో మిగతా 2లో..

## ప్రహ్లాద్‌జోషికి విద్యాశాఖ

కన్స్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ,జూలై25(జనంసాక్షి): ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్స్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యా శాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు. మిగతా 2లో..

ఎల్‌నినో ప్రభావం..

## రైతులకు అండగా నిలవండి

డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి

మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్,జూలై25(జనంసాక్షి): ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ మిగతా 9లో..

# రియల్ ఎస్టేట్ రంగంపై దుష్ప్రచారం నమ్మొద్దు

- రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి చెందింది
- రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత
- త్వరలోనే మూసీ సుందరీకరణకు టెండర్లు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్,జులై 25 (జనంసాక్షి): రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ఫ్లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ మిగతా 2లో..




## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు


మూడేళ్ల పాటు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన

సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ

9లో..

## ట్రంప్‌నకు మళ్లీ ఎదురుదెబ్బ

హెచ్-1బీ వీసాకు లక్ష డాలర్ల ఫీజుపై స్టే ఇచ్చేందుకు అప్పీల్స్ కోర్టు నిరాకరణ



వాషింగ్టన్(జనంసాక్షి):విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు లక్ష డాలర్ల ఫీజు విధింపు విషయంలో ట్రంప్‌నకు మళ్లీ ఎదురు దెబ్బ తగిలింది. ఈ ఫీజులు చట్టబద్ధం కాదంటూ ఇటీవల దిగువ న్యాయస్థానం తీర్పుపై స్టే ఇచ్చేందుకు అప్పీల్స్ కోర్టు నిరాకరించింది. దీనిపై స్టే ఇవ్వకపోవడం వల్ల దేశానికి వచ్చే నష్టం ఏంటో తెలియజేయడంలో ట్రంప్ యంత్రాంగం విఫలమయ్యిందని పేర్కొంది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు దీనిపై నిర్ణయం తీసుకోలేరని పేర్కొంది. విదేశాల్లో ఉండి అమెరికా తాత్కాలిక వలస వీసా అయిన హెచ్1బీకి ఎంపికైన వారు లక్ష డాలర్ల ఫీజును చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని సవాలు చేస్తూ 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. మిగతా 2లో..

## చర్చల అంశాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తోంది


అందుకే ఆ దేశంపై భీకర దాడులు చేయాలా.. వద్దా.. అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు: ట్రంప్

2లో..

## సారనాథ్‌కు యునెస్కో గుర్తింపు

ప్రధాని మోదీ హర్షం

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఉత్తరప్రదేశ్‌లోని పురాతన బౌద్ధ క్షేత్రం బుద్ధ భగవానుడు తొలిసారిగా సందేశాన్ని వెలువరించిన సారనాథ్‌కు యునెస్కోప్రపంచ వారసత్వ జాబితాలో చోటు లభించింది. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో జరుగుతున్న యునెస్కో 48వ వరల్డ్ హెరిటేజ్ కమిటీ మిగతా 9లో..



## డిమాండ్లు ఒప్పుకున్న సర్కారు

అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందని విశ్వాసంతో ఆందోళనలను విరమిస్తున్నామని అన్నారు. వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటిని నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఢిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్తులో ఎవరినీ కేసులతో వేధించబోం. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం' అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు. సీజేపీ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వారితో సుదీర్ఘంగా చర్చించామన్నారు. నీట్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనలకు లోబడి పరిహారం ఇస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన మాట్లాడుతూ బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారని అన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కూడా ఉన్నారు. తాము పెట్టిన రెండు డిమాండ్స్ ఇంకా మిగిలే ఉన్నాయని దీప్కే అన్నారు. అవి సాధించేవరకూ ముందుకు సాగుతూనే ఉంటామని అన్నారు.

## ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యం

'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. " ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది.

## పోరాటం గెలిచింది
# విద్యార్థులే విజేతలు

విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలోకి పనిచేస్తున్నామని తెలిపారు. దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడంతో తన నైతిక బాధ్యతగా భావించినట్లు లేఖలో పేర్కొన్నారు. 2026 మే 3న నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించిందని గుర్తు చేశారు. పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 20 లక్షల మందికి పైగా విద్యార్థుల కోసం తిరిగి పరీక్ష విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జూన్ 21నపరీక్ష విజయవంతంగా పూర్తయిందని అన్నారు. తాను మొదటి రోజు నుంచే బాధ్యత తీసుకున్నాని, ఎగ్జామ్ మాఫియా వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోకుండా కృషి చేశానని పేర్కొన్నారు. జూలై 16న ప్రకటించిన ఫలితాల్లో పేద, వెనకబడిన వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు విజయాన్ని సాధించడం సంతోషకరమని అన్నారు. ఇదే సమయంలో బాధ్యతయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థుల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను బాధించిందని చెప్పారు. గత 10 రోజులుగా జరిగిన పరిణామాలు కలిచివేశాయని, ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని స్పష్టం చేసింది. జంతర్ మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, దేశవ్యతిరేక శక్తులు దీనిని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, జాతీయ ఐక్యత కాపాడేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా ఉండేందుకు, వారు చదువులపై దృష్టి సారించేలా చేయడానే ఉద్దేశంతోనే ప్రధాన మంత్రికి రాజీనామా లేఖ సమర్పించినట్లు వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచిన ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు, విద్యాశాఖ అధికారులకు థాంక్స్ చెప్పారు. దేశ సేవే తన జీవిత లక్ష్యమని, భవిష్యత్తులోనూ ఒడిశా ప్రజలు, దేశ యువత కోసం సేవ చేస్తూనే ఉంటానని పేర్కొన్నారు.

**ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం: అభిజీత్ దీప్కే**

నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

## అధికారం కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

హైదరాబాద్,జులై 25 (జనంసాక్షి):యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజేపీ కాంక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజేపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం సీజేపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనసు్స చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను ఖండించారు

## జెన్ 'జీత్' గయా..

న్యూఢిల్లీ,జులై 25 (జనంసాక్షి):కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మన దేశ విద్యా వ్యవస్థ ఎంతో గొప్పదని ప్రపంచమంతా పేరుందని.. కానీ, క్రమంగా ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగం పెరగడంతో యువత ఆగ్రహంతో ఉన్నారన్నారు. విద్యా వ్యవస్థను మార్చాలని యువత కోరుకుంటున్నారన్నారు. శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మన విద్యా వ్యవస్థను ఆరెస్సెస్ దొడ్డిదారిన చొరబడి నాశనం చేసిందని ఆరోపించారు. దిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై హింసకు, పెల్లెట్ గన్‌ల ప్రయోగం వంటి ఘటనలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షానే బాధ్యులని ఆరోపించారు. విద్యార్థులపై అణిచివేతను పార్లమెంటులో ప్రశ్నిస్తామని, అమిత్ షా వైఖరిని పార్లమెంటులో ప్రశ్నిస్తామని తెలిపారు. భారతీయ విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇకనైనా నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని రాహుల్ కోరారు. దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉందన్న రాహుల్.. దేశాన్ని, వ్యవస్థలను నడిపే తీరు ఇది కాదన్నారు. విద్యార్థుల ఆందోళనలు దేశంలో ఉన్న తీవ్ర సంక్షోభానికి నిదర్శనమన్నారు. మోదీ సర్కార్‌కు ఈ ఉద్యమం ఓ మేలుకొలుపు అన్నారు. కాగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనలతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను స్వాగతించారు. విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల పోరాటం చూసి గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. వీధుల్లోకి వచ్చి పోరాడిన యువత, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మరో రెండు డిమాండ్లు మిగిలి ఉన్నాయని..వాటిని కూడా త్వరగా తీర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళనకారులపై జరిగిన లాఠీఛార్జిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 'విద్యా వ్యవస్థను సరిదిద్దడం కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత ధైర్యంగా పోరాడారు. ప్రధాన్ రాజీనామాతో విద్యార్థులు, అవినీతి ప్రభుత్వం కారణంగా తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలు, యువత తరపున పార్లమెంట్‌లో గళం విప్పిన ప్రతిపక్షాలు విజయం సాధించాయి' ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే ప్రజల ముందు తలవంచాల్సిందేనని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. 'యువత పోరాటం అసామాన్యం.. ఇదంతా వారి విజయం. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమం. పోరాడి సాధించిన విద్యార్థి లోకానికి శుభాకాంక్షలు' అని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తెలిపారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారన్న వార్త ఇప్పుడే విన్నాను. ఈ రాజీనామాను నేను స్వాగతిస్తున్నాను. ఈ చర్య దేశంలోని పరిస్థితిని చక్కదిద్ది.. పార్లమెంటులోనూ, వెలుపలా మౌలిక సమస్యలపై చర్చలకు మార్గం సుగమం చేస్తుందని ఆశిస్తున్నాను'- కాంగ్రెస్ నేత చిదంబరం 'అభినందనలు.. ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. విద్యార్థులు లాఠీ దెబ్బలు తిని.. గాయాలపాలయ్యారు. కొందరు 23 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరసనలతోనే కేంద్రం దిగి వచ్చింది'- రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ 'ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేమనే విషయాన్ని విద్యాశాఖ మంత్రి అంగీకరించారు. దేశవ్యాప్తంగా ఉన్న పౌరులు వారాల తరబడి పోరాటం చేస్తే ఇది జరిగింది. శాంతియుతంగా నిరసన తెలిపే తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నందుకు.. ఎంతో మంది విద్యార్థులు పోలీసుల క్రూరత్వానికి, బలప్రయోగానికి గురయ్యారు. కానీ విద్యాశాఖ మంత్రి రాజీనామాతో జవాబుదారీతనం ముగిసిపోదు. మనల్ని ఈ దుస్థితికి తీసుకువచ్చిన ప్రభుత్వ వైఫల్యాలను సరిచేయడానికి ప్రభుత్వం సంస్కరణలు చేపట్టాలి. మళ్లీ ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. ఈ నిరసనలు సంస్కరణలకు ఆరంభం మాత్రమే.. ముగింపు కాదు' -కాంగ్రెస్ నేత శశి థరూర్. 'ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయం. వ్యవస్థలో జరిగిన తప్పులకు వ్యతిరేకంగా పోరాడి..విజయం సాధించిన యువతకు అభినందనలు'-అరవింద్ కేజ్రీవాల్

## ప్రజలందరూ ఏకమై పోరాడారు

**ఇది ప్రజా విజయం : వాంగ్ చుక్**

తెరవెనుక ఒప్పందం చేసుకున్నానంటూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలు తనను తీవ్రంగా కలిచివేశాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రాణాలను పణంగా పెట్టి దీక్ష చేస్తే, ఇప్పుడు తన నిజాయితీని నిరూపించుకోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియో సందేశంలో వాంగ్‌చుక్ భావోద్వేగంగా మాట్లాడారు. "26 రోజుల పాటు ఆహారం తీసుకోకుండా దిల్లీలోని మండుటెండల్లో దీక్ష చేశాను. ఈ క్రమంలో నేను 11 కిలోల బరువు కోల్పోయాను. కండరాల శక్తి తగ్గిపోయింది. శరీర అవయవాలు, మెదడు కూడా కోలుకోలేని స్థాయిలో దెబ్బతినే పరిస్థితి వచ్చింది. అయినప్పటికీ నేను ఎవరితో దీక్ష విరమించాను? ఎందుకు వారి చేతుల మీదుగానే విరమించాను? నేను ఏదైనా డీల్ చేసుకున్నానా? అనే విషయాలపై ఎవరికైనా సమాధానం చెప్పాలా?" అని ప్రశ్నించారు.

## రియల్ ఎస్టేట్ రంగంపై దుష్ప్రచారం నమ్మొద్దు

విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఫ్లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చట్ట సభల్లోకి జెన్ జీ...




కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు డిమాండ్, జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీఛార్జీకి నిరసనగా పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు వరకు పీసీసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తు ర్యాలీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన జెన్ జీని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సింగపూర్, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అయ్యే అవకాశం ఉందని, మన దేశంలోనూ ఆ అవకాశం జెన్ జీకి ఇవ్వాల్సి ఉందన్నారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 61వ రాజ్యాంగ సవరణ చేసి ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని సీఎం తెలిపారు. నాడు రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయంతోనే నూనుగు మీసాల యువకులు, సోదరీమణులు ఓటు హక్కు పొందగలిగారని చెప్పారు. అలాగే పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు వంటి పోస్టులకు ఎన్నికయ్యే వయస్సును 25 నుంచి 21 ఏళ్లకే తగ్గించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్ ప్రధానమంత్రులు తీసుకున్న నిర్ణయంతోనే యువత 18 ఏళ్లకే ఓటు వేయగలుగుతున్నారని, 21 ఏళ్లకే స్థానిక సంస్థల్లో పదవులు సాధించగలుగుతున్నారని తెలిపారు. 21 ఏళ్లకే ఒక సోదరీమణి తిరువనంతపురం మేయర్‌గా ఎంపిక కావడానికి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అవకాశమే కారణమన్నారు. లోక్‌సభలో 543 మంది ఎంపీలు ఉంటే 1 శాతానికి లోపే జెన్ జీ ప్రాతినిధ్యం ఉందన్నారు. 30 శాతంగా ఉన్న జెన్ జీకి లోక్‌సభలో 1 శాతం కన్నా తక్కువ ప్రాతినిధ్యం ఉండడం సరికాదన్నారు. 21 ఏళ్లకే లోక్‌సభకు, శాసనసభకు పంపించే బాధ్యత తాము తీసుకుంటామని... అందుకు మీరు సిద్ధంగా ఉన్నారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించగా.. తాము సిద్ధమని జెన్ జీ స్పందించింది. జెన్ జీ సమస్యలు పరిష్కారం కావాలంటే చట్ట సభల్లోనూ వాళ్ల ప్రాతినిధ్యం ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం శాసనసభ, లోక్‌సభలకు 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభకు 25 ఏళ్లకే పోటీ చేసే అవకాశం కల్పించాలని తాము డిమాండ్ చేస్తున్నామని సీఎం అన్నారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో శాసనసభ, శాసనమండలిని ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చట్టసభల్లో పోటీ చేసే వయస్సు తగ్గింపు తీర్మానం పెట్టి ఆమోదిస్తామని సీఎం తెలిపారు. ఆ తీర్మానాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని సీఎం వెల్లడించారు. దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసుకు 21 ఏళ్లకే ఎంపికయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 21 ఏళ్ల వయస్సుకే శ్రీలక్ష్మి, 22 ఏళ్లకే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య, 22 ఏళ్లకే ప్రస్తుత డీజీపీ సి.వి.ఆనంద్ ఐపీఎస్‌లుగా ఎంపికైన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ కు ప్రదర్శనగా కాదని, రోడ్లపై నుంచి నేరుగా పార్లమెంట్‌లోకి (సడక్ సే సంసద్) వెళ్లేలా యువత ఉండాలన్నారు. 21 ఏళ్లకే లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఉంటే సభలోనే జెన్ జీ గళాన్ని వినిపించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ గళం వినిపించడం ద్వారా యువతకు దేశాన్నిపాలించే అవకాశం ఇవ్వాలని శాసనసభలో తీర్మానం చేస్తామని సీఎం పునరుద్ఘాటించారు. కేంద్రంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వం విద్యా శాఖ జెన్ జీ నేతకు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ అంశంలో రాహుల్ గాంధీని, ఇండియా కూటమి నేతలను ఒప్పిస్తానని సీఎం తెలిపారు. విద్యా శాఖ, ఐటీ శాఖ వంటి కీలకమైన శాఖలు.. 60, 70, 90 ఏళ్ల వాళ్లకు కాదు 21 వాళ్లకే ఇవ్వాలని, వాళ్లకేం కావాలో వాళ్లకే తెలుసని సీఎం అన్నారు. జెన్ జీ పోరాట పటిమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. జెన్ జీ సాధించిన విజయాలను కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రాసుకునే ఉద్దేశం తమకు లేదని సీఎం స్పష్టం చేశారు. లాఠీలు, తూటాలకు తలవంచకుండా పోరాడి 56 అడుగుల ఛాతీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెడలు వంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించగలిగారని ప్రశంసించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదని సీఎం అన్నారు. పరీక్ష పేపర్ల లీక్‌తో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు, ఉద్యమం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులపై కేసులు సోమవారం లోపు ఎత్తివేయకపోతే పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పోరాడుతుందని సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, వల్లాల నవీన్ యాదవ్, శ్రీగణేష్, మల్ రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ నేత పల్లా

## దేశం గర్వించేలా ఝుండూ కుమార్ విజయం: మోదీ

**న్యూఢిల్లీ:**కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత్‌కు తొలి పతకం అందించిన పారా అథ్లెట్ ఝుండూ కుమార్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు. హెవీవెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్‌లో కాంస్య పతకం గెలిచి యావత్ దేశం గర్వించేలా నిలిచాడని కొనియాడారు. అతడి విజయం అపారమైన శక్తికి, సంకల్పానికి నిదర్శనమన్నారు. ఎన్నో ఏళ్ల కఠిన సాధనకు ఫలితమని.. ప్రతి సవాల్‌ను అధిగమించి అంతర్జాతీయ వేదికపై రాణించాడని అభినందించారు. ఝుండూ కుమార్ విజయం ఎంతో మంది భారతీయులకు స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గ్లాస్గోలో జరిగిన హెవీవెయిట్ పారా పవర్..లిఫ్టింగ్ ఫైనల్లో భారత పారా అథ్లెట్ ఝుండూ కుమార్ 190 కిలోల బరువును ఎత్తి మూడో స్థానంలో నిలిచాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ పతకాల పట్టికలో భారత్ బోణీ కొట్టింది.

## గుజరాత్‌లో వరదల బీభత్సం

**గాంధీనగర్,జూలై25(జనంసాక్షి):**

గుజరాత్‌లోని వల్సాద్‌లో భారీ వర్షాలకు నివాస సముదాయాలు నీట మునిగాయి. ఓ వ్యక్తి తన ఇంటి బయట వరద నీటిలో నిలబడి ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా వీధులు, రోడ్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో, సదరు యువకుడు తన ఇంటి బయట మెడలోతు వరద నీటిలో నిలబడి పరిస్థితిని వివరించాడు. పార్క్ చేసిన వాహనాలు, ప్రహరీలు, భవనాల పైభాగాలు మాత్రమే బయటకు కనిపిస్తున్న ఈ దృశ్యాలు వరద తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ వీడియోలో సదరు వ్యక్తి మునిగిపోయే స్థాయిలో నీరు చేరడం చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల మధ్య తేడా తెలియకుండా అంతా జలమయం కావడంతో అక్కడి నివాసితుల దైనందిన జీవితం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణాల్లో అరకొరగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఈ తరహా ముంపునకు ప్రధాన కారణమని ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన పలువురు నెటిజన్లు శివమ్ సింగ్, ఇతర నివాసితులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. మరోవైపు అధికారులు, రెస్క్యూ టీమ్ ఇప్పటికే పలువురిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు సమాచారం.

## చర్చల అంశాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తోంది

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఇలాంటి సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో కొత్త ప్రకటన చేస్తున్నారు. చర్చల అంశాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తోందని తాజాగా పేర్కొన్నారు. అందుకే ఆ దేశంపై భీకర దాడులు చేయాలా.. వద్దా.. అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. భీకర దాడుల అంశంపై ఉన్నతస్థాయి అధికారులతో ట్రంప్ చర్చలు జరుపుతున్నారని వార్తలు వస్తోన్న నేపథ్యంలో ఈ స్పందన వచ్చింది. "ప్రస్తుతం మేం వారితో చర్చలు జరుపుతున్నాం. చర్చలను వారు సీరియస్‌గా తీసుకుంటున్నారు. అందుకు కారణం ఉండొచ్చు. వారు లొంగిపోవచ్చు.. లేదా ఏదైనా గుహలోకి వెళ్లి దాక్కోవచ్చు. మా వైపు నుంచి క్షిపణులు లోడ్ చేసే ఉన్నాయి. యుద్ధం ముగించడానికి రెండు అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు చేస్తోన్న దాడుల తీవ్రత పెంచి, వాళ్ల దగ్గర ఉన్నదంతా నాశనం చేయొచ్చు. లేకపోతే ఒప్పందం చేసుకోవచ్చు. డీల్ చేసుకోవడమనేది తెలివైన వ్యూహం. చర్చల విషయంలో వారు సీరియస్‌గా ఉన్నంతమాత్రాన ఒప్పందం కుదురుతుందని చెప్పలేం. చివరకు ఏం జరుగుతుందో వేచి చూడాలి" అని పేర్కొన్నారు. ఇరాన్‌పై భీకరదాడుల్ని పరిశీలిస్తున్నామని, దానిపై నిర్ణయం తీసుకుంటామని ముందు రోజు ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. వాటికి ఇరాన్ నుంచి కౌంటర్ వచ్చింది. అమెరికా బెదిరింపులకు తలొగ్గబోమని.. బలప్రయోగం, ఒత్తిడికి ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇరాన్‌కు ఆయుధాలు అమ్మవద్దని చైనా, రష్యాకు ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు.

**ఇరాన్‌పై గల్ఫ్ దేశాల సీక్రెట్ ఆపరేషన్..?**

పశ్చిమాసియాలో యుద్ధం మొదలైందేమో.. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య. కానీ విలవిల్లాడుతున్నాయేమో గల్ఫ్ దేశాలు. అమెరికా దాడులకు ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని యూఎస్ స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోన్న సంగతి తెలిసిందే. అమెరికా బేస్‌లనే టార్గెట్ చేస్తున్నామని చెప్తున్నప్పటికీ.. సౌదీ, యూఏఈ వంటి దేశాలకు అంతర్జాతీయంగా ఉన్న పేరు దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో బహ్రెయిన్, కువైట్ యుద్ధ విమానాలతో ఇరాన్‌పై తొలిసారి ప్రత్యక్ష దాడి చేసినట్లు అమెరికా మీడియా కథనం వెల్లడించింది.గల్ఫ్ దేశాలు తమ సైనిక అవసరాల కోసం ప్రధానంగా అమెరికా మీద ఆధారపడతాయి. బహ్రెయిన్, కువైట్ వైమానిక దళం పరిమాణం పరంగా చాలా చిన్నదే. అందులో ఉండే యుద్ధ విమానాలు అమెరికా, ఐరోపా దేశాలకు చెందినవి. అలాంటి ఈ రెండు దేశాలు ఇరాన్ నుంచి తరచుగా ఎదురవుతోన్న దాడులకు స్పందించాలని నిర్ణయించుకున్నాయి. అందుకు యూఏఈ సహకరించింది. ఇరాన్‌లోని లక్ష్యాలకు సంబంధించిన నిఘా సమాచారం ఇచ్చింది. ఈ క్రమంలోనే జులై ప్రారంభంలో ఇరాన్‌లోని డ్రోన్, క్షిపణి నిల్వలపై బహ్రెయిన్, కువైట్ యుద్ధ విమానాలతో దాడి చేసినట్లు ఆ మీడియా కథనం పేర్కొంది. ఆరంభంలో సౌదీ అరేబియా కూడా యూఈఏతో చేతులు కలిపింది కానీ.. తర్వాత తన వైఖరిపై పునరాలోచన చేసిందని పేర్కొంది. రహస్యంగా జరిగిన ఈ ఆపరేషన్ యుద్ధం విస్తరణకు ఓ సూచన అంటూ ఆందోళన వ్యక్తమవుతోంది.రెండువారాల క్రితం హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడి చేయడంతో పశ్చిమాసియా మళ్లీ దద్దరిల్లుతోంది. ఈ క్రమంలోనే ఇరాన్ నుంచి బహ్రెయిన్, కువైట్ దాడులను ఎదుర్కొంటున్నాయి. యూఎస్ బేస్‌ల లక్ష్యంగా ఈ రెండు దేశాలతో పాటు జోర్డాన్‌పై ఇరాన్ దాడులు చేసింది. అమెరికా-ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియా పరిస్థితులు దిగజారుతుంటే.. సౌదీ అరేబియా-హూతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులు ప్రపంచాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇరాన్ మద్దతు గల హూతీలు ఎర్రసముద్రంలో దిగ్బంధనాన్ని ప్రకటించి.. సౌదీ నౌకలపై దాడులు చేశాయి దాంతో సౌదీ అరేబియా యెమెన్‌లోని హూతీ నియంత్రణలో ఉన్న ప్రాంతాలపై తాజాగా వైమానిక దాడులు చేసింది.

## ట్రంప్‌నకు మళ్లీ ఎదురుదెబ్బ

వాటిని విచారించిన యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్.. లక్ష డాలర్ల ఫీజు చట్ట విరుద్ధమని ప్రకటించారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకపోవడంతో దానిని చట్ట విరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని తీర్పు చెప్పారు. దీంతో ట్రంప్ యంత్రాంగం అప్పీల్స్ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ సర్కార్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసింది.

# 150 మంది దివ్యాంగ విద్యార్థుల నాట్యార్చన

▫ 15 ఏళ్ల అక్షర దేవళ్ల సాహసోపేత కార్యక్రమం







హైదరాబాద్ (జనంసాక్షి) : "వాళ్లకు జాలి అవసరం లేదు... అవకాశం చాలు." ఈ ఒక్క ఆలోచనతో 15 ఏళ్ల కూచిపూడి నృత్య కళాకారిణి అక్షర దేవళ్ల ప్రారంభించిన ప్రయాణం రవీంద్రభారతి వేదికపైకి వందలాది మంది దివ్యాంగ విద్యార్థులను నడిపించింది. చూపులేని పిల్లలు...వినలేని పిల్లలు... మాట్లాడలేని పిల్లలు... ఆటిజం, మేధో వైకల్యం ఉన్న చిన్నారులు... వీళ్లందరినీ ఒకే వేదికపై నిలబెట్టి, భారత జాతీయ గేయం వందేమాతరం పూర్తి ఆరు చరణాలకు భారతీయ శాస్త్రీయ నృత్య రూపంలో ప్రదర్శన చేయించడం అసాధ్యమనిపించినా... ఆ అసాధ్యాన్ని 15 ఏళ్ల అక్షర దేవళ్ల సుసాధ్యం చేసింది. ఒకరూ ఇద్దరు కాదు 150 మంది బ్లైండ్, డెఫ్, ఆటిజం పిల్లలతో వందేమాతరం నృత్యాన్ని రవీంద్ర భారతి వేదికపై ప్రదర్శన ఇప్పించి అందరి ప్రశంసలు అందుకుంది. బేగంపేట లేని దేవనార్ స్కూల్ ఫర్ ద బ్లైండ్ , మలక్ పేట లోని ఫిన్ డెఫ్ స్కూల్, కవాడిగూడ లోని సుమన్ ఆటిజం సెంటర్, ఆదిలాబాద్‌కు చెందిన విజ్ఞాన్ స్పెషల్ స్కూల్ ఫర్ ఇంటలెక్చువల్ చిల్డ్రన్ పిల్లలు ఈ అరుదైన ప్రదర్శనలో నృత్యం చేశారు. వీరందర్నీ ఇలా ఒక వేదిక పైకి తీసుకువచ్చి, వారితో వందేమాతరం పూర్తి పాటకు నృత్యం చేయించడం వెనుక అక్షర దేవళ్ల చేసిన కృషి ఎంతో ఉంది.

## 15 ఏళ్ల వయస్సులో దేశవ్యాప్త లక్ష్యం

సాధారణంగా టీనేజర్లు తమ చదువు, తమ అభిరుచుల గురించే ఆలోచిస్తారు. కానీ అక్షర దేవళ్ల మాత్రం "వందేమాతరం ఏ150" పేరుతో దేశవ్యాప్తంగా వందేమాతరం పూర్తి అధికారిక గీతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యాన్ని ఎంచుకుంది. కార్గిల్ మంచు కొండల్లో చెప్పులు లేకుండా వందేమాతరం పూర్తి గేయానికి నృత్యం చేయడం నుంచి, బంకిమ్ చంద్ర ఛటర్జీ నివాసాన్ని సందర్శించి యువతకు వందేమాతరం చరిత్రను పరిచయం చేయడం వరకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. ప్రదర్శనకు గుర్తింపు రావాలన్న లక్ష్యంతో, వారికి ఓ పెద్ద వేదికపై ప్రదర్శన చేసే అవకాశం కల్పించడం కోసం రవీంద్ర భారతి వేదికగా "వందేమాతరం 150 - యాన్ ఇన్ క్లూజివ్ డ్యాన్స్ ట్రిబ్యూట్ టు ద నేషన్ బై అక్షర దేవళ్ల" పేరుతో తన సొంత ఖర్చులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది.

## లోపం శరీరానికే.. తెలివికి కాదు

అక్షర ఓపికగా ప్రతీ ఒక్కరికీ టచ్ ద్వారా వారికి ఈ నృత్యాన్ని నేర్పించింది. కేవలం వందేమాతరమే కాదు, దేవనార్ బ్లైండ్ స్కూల్ విద్యార్థులకు శ్రీనివాస కల్యాణం ను కూచిపూడి నృత్య శైలిలో నేర్పించి రవీంద్రభారతిలో ప్రదర్శనను ఇప్పించి వారికి జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాన్ని అందించింది. ఇక వినికిడి లోపంతో బాధపడుతున్న విద్యార్థులది మరో సమస్య. వారికి కనిపిస్తుంది కానీ, వినిపించదు. పాట ఎలా వస్తుందో తెలియదు. కానీ మనకు వినిపించే పాటకు తగ్గట్లుగా నృత్యం చేయడం ఎలా.. దీన్ని కూడా అక్షర దేవళ్ల సవాల్ గా తీసుకుంది. కౌంట్ ద్వారా ఎప్పుడెప్పుడు ఏ ఏ అడుగులు వేయాలన్నది నేర్పించింది. ఫిన్ డెఫ్ విద్యార్థులు కూడా ఎంతో అద్భుతంగా అక్షర దగ్గర తీసుకుని రవీంద్ర భారతిలో అత్యద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. వీరికి కూడా కూచిపూడిలో పుష్పాంజలి పాటను అక్షర నేర్పించింది. వందేమాతరం 150 కార్యక్రమంలో దాన్ని కూడా ఫిన్ డెఫ్ విద్యార్థులు ప్రదర్శించి అందరి ప్రశంసలు పొందారు.

అత్యంత సాహసోపేతమైన ఈ ప్రయాణంలో తనకు ఎన్నో అనుభవాలున్నాయంటుంది అక్షర. ఈ మూడు రకాల లోపాలున్న విద్యార్థులను చూసినప్పుడు, వారికి శిక్షణ ఇస్తున్నప్పుడు వారు ఎంత టాలెంటెడో తనకు తెలిసిందంటోంది. లోపం కేవలం శరీరానికే గానీ, తెలివికి కాదని, సాధారణ విద్యార్థులకన్నా వీళ్లు ఇంకా తెలివైన వారంటోంది అక్షర. వారికి చెప్పగలిగేలా ఓపికతో చెబితే ఎన్నో అద్భుతాలు చేయగలరంటోంది. కేవలం వందేమాతరం పాటను నేర్పించడంతో తన ప్రయాణం ఆగిపోలేదని, ఈ పిల్లలకు తాను నృత్య శిక్షణను కొనసాగిస్తానంటూ హామీ ఇచ్చింది. రవీంద్రభారతిలో నిర్వహించిన ఈ వందేమాతరం 150 ఇన్ క్లూజివ్ డ్యాన్ ట్రిబ్యూట్ కార్యక్రమానికి సీఎస్ బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ మల్లవరపు బాలలత, దేవనార్ ఫౌండేషన్ ఫర్ ద బ్లైండ్ ఫౌండర్ పద్మశ్రీ డా.సాయిబాబా గౌడ్, ఫిన్ డెఫ్ స్కూల్ ప్రెసిడెంట్ వి.జానకి, మాధవ్ ఆటిజం ఫౌండేషన్ ఫౌండర్ సుమన్ షరాఫ్, భారత బీడీసీఏ క్రికెట్ జట్టు కెప్టెన్ ధీరావత్ మహేశ్ నాయక్ హాజరై ఈ అద్భుత నృత్య ప్రదర్శన చేయించిన అక్షర దేవళ్లను, నృత్యాన్ని చేసిన విద్యార్థులను అభినందించారు.

## మున్ముందు మరిన్ని కార్యక్రమాలు : బాలలత, డైరెక్టర్ సీబీఎస్ ఐఏఎస్ అకాడమి

వందేమాతరం 150 వేడుకలు దేశవ్యాప్తంగా ఎన్నో జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలు నిర్వహించారు. కానీ, ఇలా దివ్యాంగ విద్యార్థులతో వందేమాతరం నృత్యం చేయించడం మాత్రం ఇదే మొదటి సారి. వందేమాతరానికి ఎంతో అద్భుతంగా ఈ పిల్లలకు నృత్యం నేర్పించిన అక్షరను చూస్తుంటే గర్వంగా ఉంది. ఇంత చిన్న వయస్సులో ఇంత సాహసాన్ని చేసినందుకు అభినందనలు. ఇలాంటి కార్యక్రమాలు ముందు ముందు మరిన్ని చేయాలి.

## వారం రోజుల్లో నేర్పించడం అభినందనీయం : పద్మశ్రీ డా.సాయిబాబా గౌడ్, దేవనార్ స్కూల్ ఫౌండర్

వైకల్యం ఉన్న వారిలో ఇంత టాలెంట్ ఉందన్న విషయాన్ని గుర్తించి వారికి శిక్షణకు ఇచ్చిన అక్షర దేవళ్లకు అభినందనలు. మన దేశంపై మనకున్న భక్తిని చాటి చెప్పుకునే గీతం వందేమాతరం. మా అంచనాలకు మించి మా పిల్లలతో అక్షర దేవళ్ల మమేకమై నేర్పించిన విధానం అద్భుతం. మా పిల్లలకు శ్రీనివాస కల్యాణాన్ని ఛాలెంజ్ గా తీసుకుని వారం రోజుల్లో నేర్పించి ప్రదర్శన ఇప్పించడం నిజంగా అభినందనీయం.

## నిజంగా గొప్ప విషయం : వి.జానకి, ఫిన్ డెఫ్ స్కూల్ ఫౌండర్




మా సంస్థకు వందేమాతరం నేర్పిస్తామంటూ అక్షర దేవళ్ల వచ్చినప్పుడు ఎవరో ఎలా నేర్పిస్తుందో అనుకున్నాం. కానీ, వందేమాతరం అనేసరికి అంగీకరించాం. కానీ ఎంతో దూరం నుంచి ప్రతీరోజూ ఎంతో పట్టుదలతో నేర్పించింది. దివ్యాంగులకు వందేమాతరం నేర్పించాలన్న ఆలోచన రావడం నిజంగా గొప్ప విషయం. భగవంతుడు ఆమెకు ఆయురారోగ్యాలను అందించాలి. ముందు ముందు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలి.

## అక్షర భవిష్యత్‌లో గొప్ప కూచిపూడి కళాకారిణి అవుతుంది : సుమన్ షరాఫ్, మాధవ్ ఆటిజం ఫౌండేషన్ ఫౌండర్

అక్షర దేవళ్ల ఇలాంటి చాలా కష్టపడి మా పిల్లలకు నేర్పించింది. ఇంతమందిని ఒక్క వేదికపైకి చేర్చి నృత్యం చేయించడం అభినందించాల్సిన విషయం. భవిష్యత్తులో ఆమె గొప్ప కూచిపూడి కళాకారిణి అవుతుంది.

## ఆమె తల్లిదండ్రులకు అభినందనలు : ధీరావత్ మహేశ్ నాయక్, భారత బీడీసీఏ క్రికెట్ టీమ్ కెప్టెన్

వందేమాతరం 150 కార్యక్రమాన్ని ఇంత చిన్న వయస్సులో చేయడం చాలా గొప్ప విషయం. అక్షర దేవళ్ల కూచిపూడి నృత్యకారిణే కాదు సినిమా యాక్టర్ కూడా. చాలామంది తాము ఎప్పుడూ స్క్రీన్ పై కనపడాలనుకుంటారు కానీ అక్షర తాను కాకుండా దివ్యాంగులతో ప్రదర్శన ఇప్పించడం నిజంగా గొప్ప విషయం. పిల్లలు చదువుకుంటానంటే తల్లిదండ్రులు ఎంతో ఖర్చుపెడుతుంటారు కానీ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి అక్షరకు ప్రోత్సాహం అందిస్తున్న ఆమె తల్లిదండ్రులకు అభినందనలు.

## లోపం శరీరానికే... ప్రతిభకు కాదు : అక్షర దేవళ్ల



"ఈ పిల్లలకు జాలి అవసరం లేదు. అవకాశం ఇస్తే వారు అద్భుతాలు చేయగలరు. వాళ్లలో ఉన్న ప్రతిభను ప్రపంచం చూడాలని నా కోరిక. వారికి శిక్షణ ఇవ్వడం మొదట్లో కష్టంగా ఉండేది. ఎందుకంటే చూపులేని విద్యార్థులకు మనం ఏం చేస్తున్నామో కనిపించదు. వారికి చేతులు, కాళ్లు పట్టుకుని ఎలా పెట్టాలో చేయించాలి. ఇక వినికిడి లోపం ఉన్న వాళ్లకు పాటలో ఏం వస్తుందో తెలియదు. వారికి కౌంట్ ద్వారా స్టెప్స్ నేర్పించాలి. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలను ఒక్క చోట కుదురుగా కూర్చోబెట్టడమే కష్టం. ముందు వారితో కలిసిపోవాలి. వారికి మనపై నమ్మకం కల్పించాలి. అప్పుడే మనం చెప్పింది వింటారు. కానీ, ఈ మూడు రకాల భిన్నమైన పిల్లలకు నృత్య శిక్షణ ఇవ్వడం నిజంగా నా జీవితంలో ఓ గొప్ప అనుభూతి. వైకల్యం వారి శరీరానికే గానీ, మనసుకు కాదు. వాళ్లెంతో స్వచ్ఛంగా ఉంటారు. వారిలో చాలామందికి అద్భుతమైన తెలివితేటలు ఉన్నాయి. వాటిని వెలుగులోకి తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరం. దాన్ని చాటిచెప్పాలన్న ఉద్దేశంతోనే ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఈ "వందేమాతరం 150 - యాన్ ఇన్ క్లూజివ్ డ్యాన్స్ ట్రిబ్యూట్ టు ద నేషన్ బై అక్షర దేవళ్ల" ను నిర్వహించాం.

# కాంగ్రెస్‌లో ముస్లిం మైనారిటీలకు న్యాయం చేయాలి

▫ పార్టీ కోసం పనిచేసిన సీనియర్ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

▫ సేవలను గుర్తించి ప్రాధాన్యం కల్పించాలని మాజీ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహేమాన్ డిమాండ్




కరీంనగర్, జనంసాక్షి ప్రతినిధి:

కాంగ్రెస్ పార్టీ కోసం దశాబ్దాలుగా సేవలందిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని మాజీ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహేమాన్ డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టకాలంలోనూ అంకితభావంతో పనిచేసిన సీనియర్ కార్యకర్తల సేవలను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తయినా ముస్లిం మైనారిటీలకు ఆశించిన స్థాయిలో నామినేటెడ్ పదవులు లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు 70 వేల ముస్లిం ఓటర్లు ఉన్నప్పటికీ వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడంలో పార్టీ విఫలమైందన్నారు. సుడా, లైబ్రరీ, మార్కెట్ కమిటీలు, రాష్ట్ర కార్పొరేషన్ల వంటి నామినేటెడ్ పదవుల్లో సీనియారిటీ, సేవలను పరిగణనలోకి తీసుకుని అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం 15 నుంచి 40 ఏళ్లుగా పూర్తికాలం కార్యకర్తలుగా పనిచేస్తున్న అనేక మంది నాయకులు ఇతర పార్టీల ఆహ్వానాలను తిరస్కరించి కాంగ్రెస్‌లోనే కొనసాగారని, వారి సేవలను గుర్తించడం పార్టీ బాధ్యత అని అన్నారు. ఇప్పటికే పదవులు నిర్వహించిన వారిని పునర్నియమించకుండా పార్టీ కోసం కష్టపడ్డ సీనియర్ కార్యకర్తలకు అవకాశం ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఎం.డి. చాంద్, ఎం.డి. కలీమొద్దీన్, ఆమేర్, ఎం.డి. సలీం, బషీర్, అబ్దుల్ బారి, సయ్యద్ కరీం, జమీలొద్దీన్, అజీం, ముజాహిద్, ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి శీల శక్తులకు బాసటగా నిలుద్దాం




▫ డీఎస్‌వో పూర్వ విప్లవ విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో వక్తల పిలుపు

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రగతి శీల శక్తులకు బాసటగా నిలుద్దామని డీఎస్‌వో వ్యవస్థాపక సభ్యులు కామ్రేడ్ గుండా సత్య నారాయణ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దొడ్డి కొమరయ్య హల్ లో ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ (డీఎస్‌వో) పూర్వ విప్లవ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఎస్‌వో పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు అధ్యక్షత వహించగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ డీఎస్‌వో నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి డీఎస్‌వో వ్యవస్థపాక సభ్యులు కామ్రేడ్ గుండా సత్య నారాయణ ముఖ్య అతిధి గా హాజరై మాట్లాడారు. 1972 హైదరాబాద్ లో హైదరాబాద్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో అధిక ధరలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు, ఈ పోరాటంలో ఒక మేర విజయం సాధించిన తర్వాత, డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ గా ఏర్పడి, శాస్త్రీయ, స్వాతంత్ర, ప్రజాతంత్ర విద్యా విధానం కావాలని, విద్యా వ్యాపారం నశించాలని కోరుతూ 1973 అక్టోబర్ లో ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ (డీఎస్‌వో) ఆవిర్భావించింది అని, సుమారు 5 దశబ్దలకు పైగా విద్యా రంగా సమస్యల పరిష్కారం లో ఋూ విద్యార్థులు అలుపెరుగనిపోరాటం చేసారని అన్నారు. ఈ విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణం లో పాల్గొని కొన్ని కారణాల వలన 1982 లో రెండుగా చీలిన డీఎస్‌వో విప్లవ విద్యార్థి సంస్థ, 1982 లో రెండు గా చీలిన ఋూ ప్రతినిధులు సైతం జరిగిన డీఎస్‌వో పూర్వ విప్లవ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఐక్యత కోరుతూ పాల్గొని, నాటి ఋూ విద్యా రంగా సమస్యలపై చేసిన పోరాటాలు, ఉద్యమా స్మృతులను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తు లో ప్రగతి శీల శక్తుల ప్రజా ఉద్యమాలకి అండగా నిలుద్దామని ఈ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశామన్నారు. మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెరిపోతుల ఉపేందర్, జంట నగరాల మాజీ కార్యదర్శి కర్రే సత్యనారాయణ, మాజీ రాష్ట్ర కార్యదర్శి గునుగుంట్ల శ్రీనివాస్ రావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి శీలం స్వామి, మాజీ రాష్ట్ర కార్యదర్శి టీవీ నరసింహ రావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ గంగ భవాని, సదానందం, సామ శ్రీనివాస్, యడ్ల భాస్కర్, సునీల్, చంద్ పాషా, రాములు అజయ్,శశంకర్, సుదీప్, గోలి కృష్ణ, శ్రీను, సంపత్ కుమార్, రమేష్, సుధాకర్, యాది రెడ్డి, శ్యాం, గోపి, రహమాత్ పాషా,సంతోష్ రెడ్డి, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత పోరాట ఫలితమే కేంద్ర మంత్రి రాజీనామా

▫ దేశ భవిష్యత్తుకు మంచి పరిణామం

▫ ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం




హైదరాబాద్ (జనంసాక్షి) : దేశ యువత పోరాటానికి దిగొచ్చి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా పరిణామమని ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం అన్నారు. ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం, నైతిక బాధ్యత, ప్రజల అభిప్రాయానికి ఇచ్చే గౌరవానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇది వ్యక్తులపై విజయం కాదు; ప్రజాస్వామ్య విలువలపై ప్రజల విశ్వాసానికి లభించిన గౌరవంగా చూడాలన్నారు. దేశ భవిష్యత్తును నిర్మించేది యువశక్తే. అన్యాయం, అవినీతి లేదా ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన అంశాలపై యువత రాజ్యాంగబద్ధంగా స్పందించడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతం. ప్రజల ఆకాంక్షలను పాలకులు గౌరవించాల్సిన అవసరాన్ని ఈ పరిణామం మరోసారి గుర్తు చేసిందని, ఈ పోరాటం దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అనిల్ కూర్మాచలం పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు, రాజ్యాంగబద్ధంగా పోరాడే సంకల్పం ఉంటే ఎంతటి ప్రభుత్వాన్నైనా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్పందించేలా చేయవచ్చని నేటి యువత దేశానికి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా వ్యవహరిస్తూ, ప్రజల సమస్యలు, అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవిస్తూ పారదర్శకత, జవాబుదారీతనంతో పాలన సాగించి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలని ఆయన హితవు పలికారు. పదవులు శాశ్వతం కావు. కానీ ప్రజల విశ్వాసం, రాజ్యాంగ విలువలు, నైతిక బాధ్యతలు శాశ్వతమైనవి. ప్రజాస్వామ్యంలో ప్రతి ప్రజాప్రతినిధి ఈ సూత్రాలను గౌరవిస్తూ వ్యవహరించడం దేశ రాజకీయ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని, యువత పోరాటం కేవలం ఒక నిర్ణయాన్ని మార్చడానికే కాదు; జవాబుదారీతనం, పారదర్శకత, నైతిక రాజకీయాలకు మార్గం చూపడానికీ ఉపయోగపడాలి. దేశ నిర్మాణంలో యువత మరింత చురుకైన పాత్ర పోషించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు రావాలని ఆశిస్తున్నామని తెలిపారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోట్లాది విద్యార్థుల విజయం

▫ అడ్వకేట్ జేఏసీ నేత, మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర



హైదరాబాద్ (జనంసాక్షి) : ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోట్లాది విద్యార్థుల విజయమని అడ్వకేట్ జేఏసీ నేత, మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో ఈ దేశంలో అనేకమంది విద్యార్థుల జీవితం అగమ్య గోచరంగా మారిపోయి ఎంతో కష్టపడి చదువుకున్న విద్యార్థులు జీవితాలు తలకిందులై 25 మందికి పైగా చనిపోవడానికి కారణమైన ఈ వ్యవస్థను ప్రశ్నించిన కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు గత 20 రోజులకు పైగా జంతర్ మంతర్లు ధర్నా చేస్తూ కేంద్రమంత్రి రాజీనామా చేయాలని చనిపోయిన విద్యార్థులకు నష్టపరిహారం ఇవ్వాలని అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని పారదర్శకతతో కూడిన విద్యావ్యవస్థను తీసుకురావాలని పేపర్ లీక్ కారణమైన ఉద్యోగస్తులను అరెస్టు చేసి జైలుకు పంపించాలని అనే డిమాండ్లతో లక్షలాది విద్యార్థులు ఢిల్లీ పురవీధులలో ఉద్యమాలు చేశారని తెలిపారు. మొండిగా ప్రవర్తించిన ప్రభుత్వం విద్యార్థులపై దమనకాండ లాఠీ జార్జి తప్పుడు కేసులు వాటర్ క్యాన్లు రబ్బర్ బుల్లెట్లు పొగ బాంబులు విసిరి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయాలని అనేక రకాలుగా ప్రయత్నిం చినప్పటికీ ప్రజాస్వామ్య స్ఫూర్తితో రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించి మెడలు వంచి కేంద్ర మంత్రి పదవి నుండి రాజీనామా చేసే విధంగా పోరాటం చేసిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేయడమే కాకుండా రాబోయే కాలంలో అన్యాయంపై ఇదేవిధంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఏది ఏమైనా కేంద్రంలో ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు ఆలోచనలను అర్థం చేసుకొని పాలన సాగించాలని నియంతృత్వ పోకడలతో తప్పుడు కేసులతో దాడులతో బెదిరింపులతో ఏమీ సాధించలేరని గుర్తించాలని ఇప్పటికైనా ప్రజాస్వామ్య స్ఫూర్తిని రాజ్యాంగం ఆశయాలను గుర్తెరిగి పాలన సాగించాలని ఆయన అన్నారు చనిపోయిన విద్యార్థులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# బెల్జియంలో 54వ బీఆర్ఎస్ శాఖ ప్రారంభం

▫ కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



బెల్జియం (జనంసాక్షి) : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గ్లోబల్ విస్తరణలో మరో కీలక అడుగు పడింది. బెల్జియంలో బీఆర్ఎస్ 54వ శాఖను బీఆర్ఎస్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదిన వేడుకలను బెల్జియంలోని పార్టీ అభిమానులు, తెలంగాణ ప్రవాసులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ అభివృద్ధికి, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న కేటీఆర్ నాయకత్వాన్ని కొనియాడుతూ సభ్యులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, బీఆర్ఎస్ సిద్ధాంతాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల మాట్లాడుతూ, బెల్జియం బీఆర్ఎస్ శాఖను బలోపేతం చేసేందుకు తాత్కాలిక అడహాక్ కమిటీని జగన్నాథ్ ప్రసాద్ రామానుజం నాయకత్వంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయిన అనంతరం పూర్తి స్థాయి కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. బెల్జియంలో తెలంగాణ ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేలా ఈ కమిటీ పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సహాయం చేసిన ప్రవీణ్ జారుగుమల్లికి మహేష్ బిగాల కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బెల్జియంలో బీఆర్ఎస్ శాఖ ఏర్పాటుకు మొదటి నుంచి విశేష కృషి చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన శ్యామ్ అకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, బీఆర్ఎస్ సిద్ధాంతాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించే దిశగా విదేశీ శాఖలు కీలక పాత్ర పోషిస్తాయని, బెల్జియం శాఖను కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగుతుందని మహేష్ బిగాల ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్జియంలోని తెలంగాణ ప్రవాసులు, బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రారంభాన్ని మరియు కేటీఆర్ జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, మనోజ్, మంజునాథ్, విజయ్, రాజశేఖర్, ఫణి, హరీష్, నాగరాజు జగిని, శ్రీకాంత్, అఖిల్ రెడ్డి, భాను, చన్నా రెడ్డి, రమణ్ పాల్గొన్నారు.

# అసంతృప్తి అగ్నిపర్వతం బద్దలైంది

సంపాదకీయం

దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు ఒక విషయాన్ని స్పష్టంగా తెలియజేశాయి. ఇది కేవలం ఒక పరీక్షా పత్రం వివాదంపై వచ్చిన ప్రతిస్పందన మాత్రమే కాదు. చాలా కాలంగా యువతలో, మధ్యతరగతిలో, సామాన్య ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తి ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగసిపడిన సందర్భం.

నీట్ వివాదం ఆ అసంతృప్తికి చిచ్చు పెట్టిన నిప్పురవ్వ మాత్రమే. అసలు సమస్య మరింత లోతైనది. భవిష్యత్తుపై పెరుగుతున్న అనిశ్చితి, పరీక్షల విశ్వసనీయతపై సందేహాలు, అవకాశాల విషయంలో అసమానతల భావన, ప్రజల ప్రశ్నలకు ఆలస్యంగా స్పందించే పాలనా ధోరణి–ఇవన్నీ కలిసి ఈ పరిస్థితికి దారితీశాయి. ప్రెజర్ కుక్కర్‌లో ఆవిరి ఎంతసేపూ బంధించి ఉంచలేమో, ప్రజల మనసుల్లో పేరుకుపోయిన అసంతృప్తిని కూడా నిరంతరం అణచివేయలేం. ఒక దశలో అది విస్ఫోటనం చెందుతుంది. నేడు దేశంలో కనిపిస్తున్న పరిణామాలు అదే సంకేతాన్ని ఇస్తున్నాయి. ప్రజల ఆవేదనకు సమాధానంగా కేవలం రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు సరిపోవు. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు కావాలి.

ప్రజాస్వామ్యంలో ప్రజల నమ్మకమే ప్రభుత్వానికి అసలైన బలం. ఆ నమ్మకం దెబ్బతిన్నప్పుడు అధికార బలం కూడా క్రమంగా బలహీనపడుతుంది. ప్రజల గొంతును వినకుండా, ప్రతి నిరసనను కుట్రగా లేదా రాజకీయ ప్రేరేపిత చర్యగా కొట్టిపారేస్తే సమస్య మరింత తీవ్రమవుతుంది. అసంతృప్తిని అణచివేయడం ద్వారా కొంతకాలం నిశ్శబ్దం తీసుకురావచ్చు; కానీ విశ్వాసాన్ని మాత్రం తిరిగి పొందలేరు. ప్రతి ఉద్యమం ప్రభుత్వాలను కూల్చదు. కానీ ప్రతి ఉద్యమం ఒక హెచ్చరికను మాత్రం ఇస్తుంది. ప్రజల ఆకాంక్షలు, యువత ఆశలు, విద్యార్థుల భవిష్యత్తు వంటి అంశాలను నిర్లక్ష్యం చేసే పాలనపై సమాజం ప్రశ్నలు లేవనెత్తుతుందని గుర్తుచేస్తుంది.

అసంతృప్తి అగ్నిపర్వతం ఒక్కరోజులో బద్దలుకాదు. అది ఎన్నో రోజులుగా పేరుకుపోయిన వేడి, ఆవేదన, నిరాశ, అనుమానాల ఫలితం. ఆ వేడిని చల్లార్చేది ప్రచారం కాదు; పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయం, ప్రజలతో నిజాయితీతో కూడిన సంభాషణ మాత్రమే. ప్రజాస్వామ్యంలో చివరి మాట ఎప్పుడూ ప్రజలదే. వారి విశ్వాసాన్ని గెలుచుకున్న పాలన నిలుస్తుంది. వారి మనసును కోల్పోయిన పాలన మాత్రం ప్రతి ఉద్యమంలో, ప్రతి నిరసనలో, ప్రతి ప్రశ్నలో తన ప్రతిబింబాన్ని చూసుకోవాల్సిందే.

## రాజీనామా

జనంసాక్షి

నవతరం ఉగ్రరూపం మెత్తింది
కాక్రోచులై సమరానికి సిద్ధమైంది
నీట్ పై ఫైట్ కు నడుం బిగించింది
పీఠాలు కదిలే పరిస్థితి ఏర్పడింది
ప్రకంపనలతో హస్తిన అదిరింది
జంతర్ మంతర్ ఆశీర్వదించింది
భరతమాత అండగా నిలిచింది
ప్రజా స్వామ్యం నిలిచి గెలిచింది
కుర్చీలు కూలకుండా చూసుకోమన్నది
మహారాజులైన తలవంచి
తప్పదన్నదిచింంచచించ

ప్రజలచే నిర్మించిన ప్రభత్వమని నొక్కింది
చట్టాలు మీ చుట్టాలు కాదని వాత పెట్టింది
నేతల అహంకార మణిచింది
పదవులు శాశ్వతం కావని చాటింది
భవిత యువతరానిదని తేట పరిచింది
రాజీనామా నే శరణ్యమని నుడివింది
లాఠీలను ఉసి గొలిపి పతనమైనది
ఉద్యమకారుల చర్చలకు పిలిచింది
అమరుల శాపం తగిలింది
కేంద్రం ఉభయతారకం గ్రహించింది
విద్యార్థుల సంబరం అంబరం తాకింది

**నమిలి కొండ నాగేశ్వర్ రావు**
**8688553470, మేడ్చల్**

# "మోదీ ప్రభుత్వం మెడలు వంచిన కాక్రోచ్ జనతా పార్టీ"



భారత రాజకీయ చరిత్రలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఎన్నికల్లో ఓటమి చెందడం, ప్రతిపక్షాల ఒత్తిడికి తలవంచడం, న్యాయస్థానాల జోక్యంతో నిర్ణయాలు మార్చుకోవడం వంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. కానీ సోషల్ మీడియాలో వ్యంగ్యంగా ప్రారంభమైన ఒక యువజన ఉద్యమం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులను, నిరుద్యోగ యువతను ఏకం చేసి, చివరకు కేంద్ర ప్రభుత్వాన్ని చర్చల బల్లపైకి తీసుకురావడం, తమ ప్రధాన డిమాండ్లను అంగీకరించే పరిస్థితి తీసుకురావడం ఇటీవలి భారత రాజకీయాల్లో అత్యంత విశేషమైన పరిణామంగా నిలిచింది. "కాక్రోచ్ జనతా పార్టీ (జజీపా)" పేరుతో ప్రారంభమైన ఈ ఉద్యమం కేవలం ఒక వైరల్ ప్రచారం కాదు. యువతలో పేరుకుపోయిన అసంతృప్తి, నిరుద్యోగం, పరీక్షల అవకతవకలు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలపై వ్యక్తమైన సామూహిక రాజకీయ స్పందనగా అనేక జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలు విశ్లేషించాయి.

ఈ ఉద్యమానికి మూలం ఒక వ్యంగ్య వ్యాఖ్య. "కాక్రోచ్" అనే పదాన్ని అవమానకరంగా ఉపయోగించిన సందర్భాన్ని యువత తమ ఆత్మగౌరవ చిహ్నంగా మార్చుకుంది. అవమానాన్ని ప్రతిఘటనగా, హేళనను రాజకీయ భాషగా, మీమ్‌లను ఉద్యమ సాధనంగా మార్చడం ఈ ఉద్యమం ప్రత్యేకత. గార్డియన్, అసోసియేటెడ్ ప్రెస్, సీబీఎస్, అల్ జజీరా వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు దీనిని భారత జనరేషన్–జెడ్ రాజకీయ చైతన్యానికి కొత్త రూపంగా అభివర్ణించాయి.

ప్రారంభంలో ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కొంతమంది నేతలు దీనిని సోషల్ మీడియా హడావుడిగా కొట్టిపారేశారు. అయితే నిరంతర నిరసనలు, జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థుల సమీకరణ, దేశవ్యాప్తంగా విస్తరించిన మద్దతు, అంతర్జాతీయ మీడియా దృష్టి పరిస్థితిని మార్చేశాయి. చివరకు కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి కీలక డిమాండ్లను పరిశీలించేందుకు అంగీకరించడంతో పాటు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఈ ఉద్యమానికి అతిపెద్ద రాజకీయ విజయంగా పరిగణించబడింది. అలాగే నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం, పరీక్షల సంస్కరణలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం కూడా ఈ పరిణామంలో భాగమయ్యాయి.

ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా కథ కాదు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ నియామక పరీక్షల్లో పేపర్ లీకులు, పరీక్షల రద్దు, సాంకేతిక లోపాలు, నియామకాల ఆలస్యం వంటి సమస్యలు లక్షలాది మంది యువత భవిష్యత్తును ప్రభావితం చేశాయి. ఉద్యోగాల కొరత, నిరుద్యోగం, పరీక్షలపై నమ్మకం కోల్పోవడం వంటి అంశాలు కలిసి యువతలో తీవ్ర అసంతృప్తిని పెంచాయి. అదే అసంతృప్తికి కాక్రోచ్ ఉద్యమం రాజకీయ రూపం ఇచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ ఉద్యమం మరో ముఖ్యమైన అంశాన్ని బయటపెట్టింది. 2014 తర్వాత సోషల్ మీడియాను రాజకీయ ప్రచారానికి అత్యంత సమర్థవంతంగా ఉపయోగించిన పార్టీగా బీజేపీ గుర్తింపు పొందింది. కానీ ఇప్పుడు అదే డిజిటల్ వేదికలు ప్రభుత్వంపై విమర్శలకు, వ్యంగ్యానికి, యువత ఐక్యతకు ఆయుధాలయ్యాయి. మీమ్‌లు, చిన్న వీడియోలు, వ్యంగ్య పోస్టులు కోట్లాది మంది యువతను ఆకర్షించాయి. ఒకప్పుడు అధికారానికి బలాన్నిచ్చిన డిజిటల్ ప్రపంచమే ఇప్పుడు అధికారాన్ని ప్రశ్నించే వేదికగా మారిందని అనేక విశ్లేషణలు పేర్కొన్నాయి.

ఈ ఉద్యమం భారత ప్రజాస్వామ్యానికి మరో సందేశాన్ని కూడా ఇచ్చింది. యువత రాజకీయాల పట్ల నిరాసక్తంగా ఉందనే అభిప్రాయాన్ని ఇది సవాలు చేసింది. ఉద్యోగం, విద్య, పరీక్షలు, భవిష్యత్తు వంటి ప్రత్యక్ష సమస్యలు తలెత్తినప్పుడు యువత ఎంత వేగంగా సంఘటితమవుతుందో ఈ ఉద్యమం చూపించింది. సంప్రదాయ రాజకీయ పార్టీలకు వెలుపల కూడా భారీ ప్రజా చైతన్యం ఏర్పడగలదని ఇది నిరూపించింది.

అయితే ఈ ఉద్యమాన్ని విమర్శించినవారూ ఉన్నారు. సోషల్ మీడియా ఉత్సాహం దీర్ఘకాల రాజకీయ ప్రత్యామ్నాయంగా మారుతుందా? ఉద్యమం తర్వాత సంస్థాగత నిర్మాణం ఎలా ఉంటుంది? వ్యంగ్యం మాత్రమే సరిపోతుందా? వంటి ప్రశ్నలు కూడా లేవనెత్తబడ్డాయి. ప్రభుత్వంతో చర్చల అనంతరం నిరసనలు విరమించడాన్ని కొందరు వ్యూహాత్మక విజయంగా చూస్తే, మరికొందరు ఉద్యమ ఉత్సాహం తగ్గే ప్రమాదంగా అభివర్ణించారు. ఈ ఉద్యమంలో మరో ఆసక్తికర అంశం ప్రముఖుల మౌనం. అనేక సినీ, క్రీడా ప్రముఖులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రజల మద్దతుతో ఎదిగిన ప్రముఖులు ప్రజా సమస్యలపై ఎందుకు మాట్లాడటం లేదనే ప్రశ్నలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఇది భారత ప్రజా జీవితంలో సెలబ్రిటీల సామాజిక బాధ్యతపై కొత్త చర్చకు నాంది పలికింది.

మొత్తానికి, కాక్రోచ్ జనతా పార్టీ కథను కేవలం ఒక వ్యంగ్య ఉద్యమంగా చూడడం సరైంది కాదు. అది భారత యువతలో పెరుగుతున్న అసహనం, అవకాశాల కోసం పోరాటం, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది. ప్రభుత్వం చివరకు చర్చలకు రావడం, కొన్ని కీలక డిమాండ్లను అంగీకరించడం ప్రజాస్వామ్యంలో ప్రజా ఒత్తిడికి ఉన్న శక్తిని గుర్తు చేసింది. అదే సమయంలో ఉద్యమాల విజయాన్ని కేవలం తక్షణ రాజకీయ ఫలితాలతో కాకుండా, దీర్ఘకాలిక విధాన మార్పులు, పరీక్షల పారదర్శకత, ఉద్యోగాల సృష్టి, యువత విశ్వాస పునరుద్ధరణ వంటి అంశాల ద్వారా మాత్రమే కొలవాలి. ఈ సంఘటన భారత రాజకీయాలకు ఒక హెచ్చరిక కూడా, ఒక పాఠం కూడా–ప్రజల ఆవేదనను, ముఖ్యంగా యువత ఆవేదనను, ఎంతకాలం విస్మరించినా ఒక దశలో అది అధికారాన్నే చర్చల బల్లపైకి తీసుకువచ్చే శక్తిగా మారుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# ప్రజాస్వామ్య ఊపిరి - కాక్రోచ్ జనతా పార్టీ


పేరుకే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశంగా వర్ధిల్లుతున్న ఈ భారతదేశంలో పాలకులు అప్రజాస్వామికంగా ఈ వ్యవహరిస్తున్న ఘటనలు అనేకంగా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ముఖ్యంగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి నైతిక బాధ్యత వహిస్తూ 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అంటూ కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో 2026 జూన్ 21 నాడు ప్రారంభమై నెల రోజులకు పైగా నిరవధిక నిరసనలు కొనసాగిస్తున్న తరుణంలో ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం శుభపరిణామం. ముఖ్యంగా ప్రజాస్వామికంగా వ్యవహరించాల్సిన పాలకులు పౌరులు నినదించకముందే సిగ్గుతో తలదించుకొని స్వచ్ఛందంగా దిగిపోవాల్సిన అవసరం ఉన్ననూ వారు ఆ విధంగా వైదొలగిపోవడం లేదు. ముఖ్యంగా చెప్పాలంటే నిజానికి నీట్ పేపర్ లీక్ అయినప్పుడే 'నైతిక బాధ్యత'గా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి ఉండాల్సింది. కాని ఆయన యువతరం ఆందోళనలకు తలొగ్గి ఆలస్యంగా అయిననూ అంతిమంగా రాజీనామా చేయడం తద్వారా 'యువతరం గెలిచి నిలవడమే కాకుండా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ప్రజాస్వామ్యానికి ఊపిరిపోసింది' అని చెప్పవచ్చు. ఈ గెలుపు ప్రజాస్వామిక రాజకీయాలలో సరికొత్త దశ – దిశను నిర్దేశించింది' అని చెప్పడంలో ఏమాత్రం ఔచిత్యం లేదు. 'కాక్రోచ్ జనతా పార్టీ (సి.జె.పి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే నేతృత్వంలో యువతరం విద్యార్థుల సమష్టి పోరాటాలు మరియు ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ త్యాగం ఫలితంగానే మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు' అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ముఖ్యంగా సోనమ్ వాంగ్ చుక్ 'దీక్షని విరమించండి' అని పౌర సమాజం కోరిననూ, అలాగే పోలీసులు భగ్నం చేసిననూ కుడా ఆయన ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఆసుపత్రి నుండి కూడా దీక్షని కొనసాగించి మొత్తంగా ఇరవై ఆరు రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షని కొనసాగించడం ఈ ఉద్యమంలో మైలురాయిగా నిలిచిపోయింది. సోనమ్ వాంగ్ చుక్ దీక్ష భగ్నం అనంతరం జంతర్ మంతర్‌లో శాంతియుతంగా దీక్షను కొనసాగిస్తున్న అభిజిత్ దీప్కే సైతం ఒక మహిళ చేత ఏకంగా సిరా దాడికి గురి కాబడిననూ ఆయన ఏమాత్రం బెదరకుండా 'నీలం నా రంగు ... జై భీమ్' అంటూ ముందుకు సాగి పోరాటాన్ని కొనసాగించడాన్ని యువతరం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది. పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో ఆందోళనకారులు లాఠీచార్జీ సహా అనేక పోలీసు దాష్టీకాలను అధిగమించి పోరాటాన్ని ముందుకు సాగించడం గొప్ప ముందడుగుగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం ఆందోళనకారులపై అనేక విష ప్రచారాలు వ్యాప్తి చేసిననూ వాటన్నింటిని అధిగమించి ప్రజాస్వామిక బాటలో ఉద్యమిస్తుండడం భావి తరాలకు మార్గదర్శిగా నిలుస్తుంది. ఇకనైనను ఆయా ప్రభుత్వాలు ప్రజా ఆందోళనలను అణచివేయడం పైననే దృష్టిని కేంద్రీకరించకుండా 'ఆందోళనకారుల డిమాండ్లను పరిష్కరిద్దాం' అనే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం తప్పకుండా ఉంది. కాక్రోచ్ జనతా పార్టీ లేవనెత్తిన అన్ని డిమాండ్లను పరిష్కరించేంతవరకు యువతరంతో పాటు ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు మరింతగా ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది. ఈ సందర్భంగా 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అంటూ ఉద్యమించి గెలిచి నిలిచిన 'యువతరానికి జేజేలు' తెలియజేస్తున్నాను.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# సనాతన ధర్మం -ఆధునిక రాజకీయం

## ఆశ్రమ ధర్మాలు, యువ నాయకత్వం



భారతీయ సనాతన ధర్మం కేవలం పూజా విధానాలకే పరిమితమైనది కాదు; అది మానవ జీవన గమనాన్ని, సామాజిక సమతుల్యతను శాసించే ఒక అద్భుతమైన జీవన సూత్రం. సమాజ శ్రేయస్సు కోసం, నిరంతర నాయకత్వ మార్పు కోసం నాటి మహర్షులు 'చతురాశ్రమ ధర్మాలు' (బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం) రూపొందించారు. ఆధునిక కాలంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు 60 నుండి 65 ఏళ్లకు పదవీ విరమణ (రిటైర్మెంట్) సూత్రాన్ని అమలు చేస్తూ యువతకు అవకాశాలు ఇస్తున్నాయి. కానీ, దేశ భవిష్యత్తును శాసించే రాజకీయ రంగంలో మాత్రం ఈ సూత్రం ఎక్కడా కనిపించడం లేదు. వయసు పైబడిన నాయకులు అధికారాన్ని వదులుకోకపోవడం వల్లే దేశంలో యువ నాయకత్వం వెనుకబడుతోందనే చర్చ ప్రస్తుతం పత్రికా ముఖంగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### వానప్రస్థం, సన్యాసం: సనాతన ధర్మ విధి

సనాతన ధర్మం ప్రకారం, 50 నుండి 60 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత మనిషి భౌతిక సుఖాలు, కుటుంబ వ్యామోహాల నుండి క్రమంగా తప్పుకుని 'వానప్రస్థాశ్రమం' స్వీకరించాలి. ఆ తర్వాత సుమారు 70 ఏళ్ల వయసులో 'సన్యాసాశ్రమం' ద్వారా అన్ని లౌకిక బంధాలను, అధికారాలను, పీఠాలను పూర్తిగా వదులుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థ వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం–తర్వాతి తరానికి బాధ్యతలను సజావుగా బదిలీ చేయడం మరియు సమాజంలో నిరంతరం కొత్త రక్తం, కొత్త ఆలోచనలు ఉద్భవించేలా చూడటం. సనాతన ధర్మాన్ని గౌరవించడం అంటే కేవలం సంప్రదాయాలను మాట్లాడటం కాదు, ఈ కాల ధర్మాలను శిరసావహించి అధికార వ్యామోహాన్ని త్యాగం చేయడమే నిజమైన ధర్మాచరణ.

### రాజకీయాల్లో వయోపరిమితి అవశ్యకత

ప్రస్తుత భారత రాజకీయాలను పరిశీలిస్తే నరేంద్ర మోడీతో సహా అనేక మంది అగ్రశ్రేణి నాయకులు 70 ఏళ్లు పైబడిన వారే ఉన్నారు. సనాతన ధర్మ సూత్రాలను ఆచరణాత్మకంగా వర్తింపజేస్తే, వయసు పైబడిన నాయకులు క్రియాశీల అధికార రాజకీయాల నుండి తప్పుకుని, యువ తరానికి మార్గదర్శకులుగా (వీవత్‌శీతీం) వ్యవహరించాలి. ఉద్యోగాలలో రిటైర్మెంట్ ఉన్నట్లే, రాజకీయాలలో కూడా నిర్దిష్ట వయోపరిమితి ఉండాలి. దీనివల్ల చట్టసభలలో కొత్త ఆలోచనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉన్న యువ నాయకత్వానికి దారులు సుగమం అవుతాయి.

### అంతర్జాతీయ పాఠాలు: స్థిరమైన వ్యవస్థలు

రాజకీయాల్లో నాయకత్వం మారితే వ్యవస్థలు కూలిపోతాయనేది కేవలం ఒక అపోహ మాత్రమేనని అంతర్జాతీయ ఉదాహరణలు నిరూపిస్తున్నాయి. బ్రిటన్ (ఇంగ్లాండ్), జపాన్ వంటి దేశాలలో కేవలం రెండు, మూడేళ్ల లోపే దేశ అత్యున్నత నాయకత్వాలు (ప్రధానమంత్రులు) మారిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ, అక్కడ పరిపాలనా వ్యవస్థలు లేదా ప్రజాస్వామ్య పునాదులు ఏమాత్రం చెక్కుచెదరలేదు. అలాగే న్యూజిలాండ్, ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో కూడా 40 ఏళ్ల లోపు యువ నాయకులు దేశాలను విజయవంతంగా నడిపించి చూపించారు. బలమైన రాజ్యాంగ వ్యవస్థలు, పారదర్శకమైన విధానాలు ఉన్నప్పుడు నాయకులు మారినా దేశ ప్రగతి నిరంతరాయంగా సాగుతుందని ఈ అంతర్జాతీయ ఉదాహరణలు స్పష్టం చేస్తున్నాయి.

### వయసు పైబడిన నాయకత్వం - నిలకడలేని నిర్ణయాలు

సాధారణంగా వయసు పెరిగే కొద్దీ నాయకులలో పరిణతి, సహనం పెరుగుతాయని భావిస్తారు. కానీ కొన్నిసార్లు వయసు పైబడిన నాయకత్వం వల్ల దేశాలు తీవ్రమైన అంతర్గత, అంతర్జాతీయ అస్థిరతను ఎదుర్కొంటాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రవర్తనే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. వయసు నిండినప్పటికీ ఆయన వ్యవహార శైలిలో పరిణతి కనిపించకపోగా, పాత పగలను తీర్చుకుంటున్నట్లుగా ప్రవర్తించడం, నిలకడ లేని నిర్ణయాలు తీసుకోవడం ప్రపంచం చూస్తూనే ఉంది. ఇటువంటి వ్యక్తిగత ఈగోలు దేశాల ఆర్థిక వ్యవస్థలను, అంతర్జాతీయ సంబంధాలను ప్రమాదంలోకి నెడతాయి. అందుకే వయోపరిమితి అనేది వ్యవస్థల రక్షణకు రక్షణ కవచం లాంటిది.

### 40 శాతం యువత భాగస్వామ్యం: ఒక విప్లవాత్మక డిమాండ్


భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. దేశ జనాభాలో సగానికి పైగా 35 ఏళ్ల లోపు వారే ఉన్నారు. ఈ నేపథ్యంలో, పార్లమెంటు మరియు అసెంబ్లీలలో 40 ఏళ్ల లోపు యువతకు కనీసం 40 శాతం స్థానాలను (దామాషా ప్రకారం) కేటాయించాలనే ప్రతిపాదన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అన్ని రాజకీయ పార్టీలు తమ అంతర్గత కమిటీల నుండి చట్టసభల టిక్కెట్ల వరకు ఈ 40 శాతం దామాషాను పాటిస్తే, యువతకు సరైన ప్రాతినిధ్యం లభిస్తుంది. కేవలం రాజకీయాలనే కాకుండా, అన్ని రంగాలలోనూ యువతకు కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా దేశ పురోగతి వేగవంతం అవుతుంది.

### జెన్ జీ తరం పరిపాలన

ప్రస్తుత డిజిటల్ యుగంలో 'జెన్ జీ' తరం వినూత్నమైన ఆలోచనా సరళితో ముందుకు సాగుతోంది. గ్లోబల్ వార్మింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , నిరుద్యోగం, మరియు ఆధునిక ఆర్థిక సవాళ్లపై ఈ తరానికి స్పష్టమైన అవగాహన మరియు పరిష్కారాలు ఉన్నాయి. వయసు పైబడిన వారు సకాలంలో తప్పుకుని బాధ్యతలను అప్పగిస్తే, జెన్ జీ తరం దేశ పరిపాలనను మరింత పారదర్శకంగా, వేగంగా మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నడపగలుగుతుంది.

### రాజకీయ సన్యాసం తీసుకోవాలి

చివరగా, సనాతన ధర్మాన్ని నిశితంగా పరిశీలిస్తే.. 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ సర్వసంగ పరిత్యాగులై సన్యాసం తీసుకోవాలని, అన్ని లౌకిక బాధ్యతల నుండి తప్పుకోవాలని స్పష్టంగా నిర్దేశిస్తోంది. అధికారం, పదవి అనేవి ఎవరికీ శాశ్వతం కావు. వయసు నిండిన మన దేశ రాజకీయ నాయకులు కూడా ఈ సనాతన ధర్మ సత్యాన్ని గ్రహించి, స్వచ్ఛందంగా రాజకీయ సన్యాసం స్వీకరించాలి. పాత తరం అనుభవాన్ని కేవలం సలహాలకే పరిమితం చేస్తూ, కొత్త తరం ఉత్సాహానికి పగ్గాలు అప్పగించాలి. అన్ని రంగాలలో తగిన సమయంలో యువతకు బాధ్యతలు అప్పగించి, పెద్దలు సన్యాస మార్గాన్ని ఎంచుకున్నప్పుడే, నిజమైన అర్థంలో సనాతన ధర్మాన్ని ఆచరించినట్లవుతుంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# ర్యాంకుల వేటలో రక్తమోడుతున్న బాల్యం

## కార్పొరేట్ చదువుల వెనుక దాగున్న విషాదం



ఆధునిక సమాజంలో ప్రగతికి ప్రతీకగా నిలవాల్సిన విద్యావ్యవస్థ, నేడు అభ్యాసకుల ఆశయాలను అణచివేసే ఒక బలిపీఠంగా మారుతోందనే ఆందోళన తీవ్రమవుతోంది. రాజస్థాన్‌లోని కోచింగ్ రాజధాని కోటా నుంచి ప్రారంభమై, తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని కార్పొరేట్ విద్యా కేంద్రాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వరకు ప్రస్తుతం దేశమంతటా ఒకే దృశ్యం పునరావృతమవుతోంది. ఐఐటీ, నీట్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడమే పరమావధిగా సాగుతున్న వేలాది మంది విద్యార్థుల అన్వేషణ, చివరికి వారిని తీరని మానసిక ఒత్తిడిలోకి నెడుతోంది. గమ్యాన్ని చేరుకునే క్రమంలో కొందరు పసిమొగ్గలు తమ అమూల్యమైన జీవితాలనే త్యాగం చేస్తున్న దుర్ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. ఈ ప్రమాదకర ధోరణి హఠాత్తుగా ఊడిపడింది కాదు. గత రెండు దశాబ్దాలుగా విద్యా వ్యవస్థలో రాజ్యమేలుతున్న వాణిజ్య సంస్కృతి ఫలితమే ఇది. అభ్యాసం అనేది కేవలం ఒక సర్వీసుగా కాకుండా, బహుళ కోట్ల రూపాయల వార్షిక టర్నోవర్ కలిగిన ఒక పక్కా వ్యాపార పరిశ్రమగా రూపాంతరం చెందిన నేపథ్యంలో, ఈ వ్యవస్థాగత వైఫల్యం వెనుక ఉన్న మర్మాన్ని నిష్పాక్షికంగా విశ్లేషించాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉంది.నేడు ఏ నగరాన్ని చూసినా, ప్రధాన రహదారుల పొడవునా భారీ హోర్డింగులు, డిజిటల్ ప్రకటనలు దర్శనమిస్తాయి. మా సంస్థ నుంచే 150 మంది ఐఐటీకి ఎంపికయ్యారు, నీట్‌లో ఆల్ ఇండియా టాప్ ర్యాంకులు మావే అంటూ విద్యా సంస్థలు హోరెత్తించే ఆకర్షణీయ ప్రచారాలు తల్లిదండ్రులను అమితంగా ఆకట్టుకుంటాయి. ఆ ప్రచార భ్రమల్లో పడి తమ పిల్లల భవిష్యత్తును ఆయా సంస్థల చేతుల్లో పెడుతుంటారు. కానీ, ఆ రంగురంగుల పోస్టర్ల వెనుక ఎంతమంది విద్యార్థులు తీవ్ర మానసిక వైకల్యానికి గురయ్యారో, ఎంతమంది చదువును సగంలోనే వదిలేసి వెళ్లిపోయారో, ఎంతమంది నరకయాతన అనుభవిస్తున్నారో తెలిపే గణాంకాలు మాత్రం బయటకు రావు. ర్యాంకుల జాబితాలు వాణిజ్య ప్రచారానికి పనికొస్తాయి తప్ప, విద్యార్థి మానసిక ఆరోగ్యం గురించి బహిరంగంగా మాట్లాడే సంస్కృతి కోచింగ్ రంగానికి ఇంకా అలవడలేదు. క్యాంపస్‌లలో కౌన్సెలింగ్ కేంద్రాలు ఉన్నాయని బోర్డులు పెడుతున్నప్పటికీ, అవి నామమాత్రపు నాటకాలేనని బాధితులు, విద్యావేత్తలు స్పష్టం చేస్తున్నారు. విద్యాసంస్థల నైతిక విలువల కంటే లాభాపేక్షే నిర్ణయాత్మక శక్తిగా మారినప్పుడు, విద్యార్థుల మానసిక క్షేమం అనుబంధ అంశంగా మూలనపడిపోవడం ఖాయం. కోచింగ్ సెంటర్లలో బోధనా పద్ధతి ప్రస్తుతం నిరంతర పరీక్షలు, గంటల వ్యవధి రేటింగ్ల చుట్టూనే తిరుగుతోంది. వారానికి రెండుమూడు సార్లు నిర్వహించే తీవ్రమైన మాక్ టెస్టులు, ఆ వెంటనే విడుదల చేసే ఓపెన్ ర్యాంకుల జాబితాలు, హాస్టల్ గోడలపై అంటించే ‘టాప్ 10’ విలేజ్ బోర్డులు ఇవన్నీ విద్యార్థులలో ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించకపోగా, వారిలో నిరంతర భయాన్ని, ఆందోళనను సృష్టిస్తున్నాయని మానసిక వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏదేని టెస్టులో ర్యాంకు కాస్త తగ్గితే, ఆ విద్యార్థిని తరగతి గదిలో తోటి వారి ముందే కించపరచడం, మానసికంగా కుంగదీసేలా మాట్లాడటం, తల్లిదండ్రులకు హెచ్చరిక మేసేజ్ పంపడం వంటి క్రూరమైన పద్ధతులు కొన్ని కార్పొరేట్ సంస్థలలో నిత్యకృత్యమయ్యాయి. ఇది కేవలం విద్యాపరమైన మూల్యాంకనం కాదని, ఒక రకమైన చట్టబద్ధమైన మానసిక వేధింపుల స్థాయికి చేరుకుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సంక్షోభంలో కార్పొరేట్ యాజమాన్యాల పాత్ర ఎంత ఉందో, తల్లిదండ్రుల అపరిమిత అంచనాల పాత్ర కూడా అంతే ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. తమ కుటుంబ ఆర్థిక స్థితిగతులను సైతం పక్కనబెట్టి, అప్పులు చేసి మరీ లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో చెల్లిస్తున్న తల్లిదండ్రులు, ఆ బరువును అప్రయత్నంగానే పిల్లలపైకి నెడుతున్నారు. మేము నీ కోసమే కష్టపడుతున్నాం, నువ్వు ఎలాగైనా ర్యాంకు సాధించాలి అనే ప్రత్యక్ష, పరోక్ష హెచ్చరికలు పిల్లల మనస్సుపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతాయి. ఇక్కడ తల్లిదండ్రుల ఉద్దేశాన్ని తప్పుపట్టలేము, వారి ఆశలు స్వాభావికమైనవే. కానీ తమ ఆకాంక్షలను వ్యక్తపరిచే విధానంలో సున్నితత్వ ం లోపించడం, పిల్లల సామర్థ్యాన్ని అర్థం చేసుకోకపోవడమే అసలు సమస్యగా మారుతోంది.నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించిన అధికారిక గణాంకాల ప్రకారం, దేశంలో విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య ఏటేటా ఆందోళనకర రీతిలో పెరుగుతోంది. కోటా నగరంలో ఒకే ఏడాదిలో పదుల సంఖ్యలో విద్యార్థులు ప్రాణాలు తీసుకోవడం, రాజస్థాన్ ప్రభుత్వం ప్రత్యేకం గా స్టూడెంట్ సేఫ మార్గదర్శకాలను విడుదల చేయాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని రెసిడెన్షియల్ క్యాంపస్‌లలో కూడా తరచూ ఇలాంటి విషాదాలు చోటుచేసుకుంటున్నా, అవి కొన్నిరోజుల పాటు పత్రికల ముఖ్యాంశాలుగా నిలిచి, ఆ తర్వాత కాలగర్భంలో కలిసిపోతు న్నాయి. ప్రభుత్వాల ఈ ఉదాసీనత, పర్యవేక్షణ లోపమే ఈ వ్యవస్థాత్మక దోపిడీ నిరాటంకంగా కొనసాగడానికి కారణమవుతోంది.అయితే, ఈ విమర్శల తుఫాను మధ్య కోచింగ్ సంస్థల ప్రతినిధుల వాదనలను కూడా విశ్లేషించాల్సి ఉంది. సమాజంలో పెరిగిన తీవ్ర పోటీ వాతావరణం, ప్రభుత్వం సరిపడా నాణ్యమైన ఐఐటీ, ఎయిమ్స్ సీట్లను అందుబాటులోకి తేకపోవడమే ఈ పరిస్థితికి మూలకారణమని వారు వాదిస్తున్నారు. అంతేకాక, ఇటీవలి కాలంలో కొన్ని ప్రముఖ సంస్థలు క్యాంపస్‌లలో ప్రొఫెషనల్ సైకియాట్రిస్టులను నియమించడం, ఫలితాలను బహిరంగంగా ప్రదర్శించకపోవడం, హాస్టల్ గదుల్లో భద్రతా చర్యలు చేపట్టడం వంటి సానుకూల మార్పులకు శ్రీకారం చుట్టాయి. కానీ, ఇవి కేవలం కొన్ని పెద్ద బ్రాండ్లకే పరిమితమయ్యాయి. చిన్న, స్థానిక సంస్థల్లో ఇవి ఇంకా అమలుకు నోచుకోలేదు.ఈ మానవీయ సంక్షోభానికి కేవలం ఒకే రంగాన్ని బాధ్యులను చేయడం సరికాదు. వాణిజ్యీకరణ చెందిన విద్యా వ్యవస్థ, తల్లిదండ్రుల మితిమీరిన ఆశలు, ర్యాంకుల ఆధారంగా వ్యక్తిత్వాన్ని అంచనా వేసే సామాజిక రుగ్మత, ప్రభుత్వాల నియంత్రణ రాహిత్యం ఇవన్నీ కలిసి ఈ విష సంస్కృతిని పోషిస్తున్నాయి. దీనికి పరిపూర్ణ పరిష్కారం లభించాలంటే, ప్రైవేటు సంస్థలకు కఠినమైన మానసిక ఆరోగ్య నిబంధనలు విధించాలి, అబద్ధపు ప్రచారాలను అడ్డుకోవాలి, అలాగే పాఠశాల దశలోనే శాస్త్రీయ కెరీర్ కౌన్సెలింగ్‌ను అందుబాటులోకి తేవాలి. అన్నింటికంటే ముఖ్యం, ప్రవేశ పరీక్షల ర్యాంకు అనేది జీవితంలో ఒక చిన్న ఘట్టం మాత్రమే తప్ప, అదే పూర్తి జీవితం కాదని సమాజం, తల్లిదండ్రులు గుర్తించిననాడే ఈ కన్నీటి గాథలకు శాశ్వత విరామం లభిస్తుంది. కోచింగ్ తరగతుల్లో నేర్పే సూత్రాలు పరీక్షా సమస్యలను మాత్రమే పరిష్కరించగలవు, కానీ జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలను తట్టుకునే నైతిక ధైర్యాన్ని నేర్పే పాఠాలు నేడు మరుగునపడ్డాయి. ఆ లోటును పూడ్చడమే నేటి సమాజం ముందున్న తక్షణ బాధ్యత.

సూర్యదేవర రామకృష్ణ,
9490754169



## ఎన్నికల్లో గెలవడం చేతకాకా నీట్ లీకేజిని అడ్డం పెట్టుకొని దేశద్రోహుల కుట్రలు

**సోషల్ మీడియా విదేశాల కంట్రోల్లో ఉంది : చేవెళ్ల ఎంపీ**

**వికారాబాద్ జులై 25, (జనంసాక్షి):** వికారాబాద్ పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మోదీ వ్యతిరేక శక్తులన్నీ మోడీని దింపాలని కుట్రతో నీట్ పేపర్ లీకేజి అడ్డం పెట్టుకొని అబద్రత వాతావరణం చూపెట్టారన్నారు, ప్రజాస్వామ్య బద్దంగా జరిగే ఎన్నికల్లో గెలవడం చేతకాని విచ్చిన్నకర దేశద్రోహ శక్తులు ఈ పని చేశాయన్నారు, ఎలక్షన్ ద్వారా మోడీని గెలవలేమనే... ఇలాంటి సంఘటలు క్రియేట్ చేస్తున్నారు, విదేశీ ఏన్జీఓలతో ఆ ఉద్యమాన్ని నడిపారు, విదేశాల సోషల్ మీడియాలు ఎక్కువగా చూపించాయి, సీజెపి పార్టీకి 23 మిలియన్ల ఫాలోవర్స్ ఎలా పెరిగింది శత్రుదేశాల ప్రబోత్బలమే కారణమన్నారు, తెలంగాణలో కూడా గతంలో లీకులు జరగలేదా అని ప్రశ్నించారు, స్వయంగా ప్రియాంక గాంధీనే లీకులు జరుగుతాయని సమర్దించారన్నారు గతంలో కూడా తెలంగాణ ప్రభుత్వంలో లీకేజీలు జరిగాయని అందరిలా కాకుండా మోడీ ప్రభుత్వంలో బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేయడం గొప్ప విషయం అన్నారు, నిన్న వికారాబాద్ లో బీజేపీ నాయకులపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తున్నానని దేశ ప్రధాని బొమ్మకు ఊరివేసి దహనం చేయడం బీజేపీ నాయకులపై పెట్రోల్ పోసి మంటలు తగిలించారని జిల్లా ఎస్పీతో మాట్లాడిన కాంగ్రెస్ నాయకులపై అటెమ్ట్ మర్డర్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ ప్రహలాద్ రావు, మాజీ అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి, వికారాబాద్ నియోజకవర్గ బీజేపీ కోఆర్డినేటర్ జిల్లా దిశా కమిటీ సభ్యులు వడ్ల నందు, మిట్టపరమేశ్వర్, వికారాబాద్ మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ అనిల్ యాదవ్, వివేకానంద రెడ్డి, బద్రేశ్వర్ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మెడికల్ విద్యార్థిపై 70 లక్షల ఖర్చు

**పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి**

**ఆర్థిక సమస్య ఉన్న అభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తున్నాము**

**ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి**

**తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**




**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 25 (జనం సాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఒక్కొక్క మెడికల్ విద్యార్థి విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం డెబ్బై లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వ నియామకాల వల్ల ప్రభుత్వ ఉద్యోగం కల్పించడం జరిగిందని, ఇంత చేసిన ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే వైద్య అధికారులు అంకితభావంతో పని చేయాలని సభాపతి తెలిపారు. విభాగాల అధిపతులు హైదరాబాద్ నుండి రోజు వచ్చి పోవడం కాకుండా స్థానికంగా ఉంటే ఎక్కువ సమయం వైద్య సేవలు అందించవచ్చని ఆయన అన్నారు. మెడికల్ కాలేజీ అందుబాటులో ఉందని, కాలేజీ అధ్యాపకులతో పాటుగా హాస్పిటల్ హెచ్ఓడి లు కూడా తమ అనుభవాలను విద్యార్థులకు నేర్పాలని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వలన నిధులను పెద్ద ఎత్తున మంజూరు చేయలేకపోతున్నామని అయినప్పటికీ ఉన్నంతలో అవసరమైన మేరకు నిధులను మంజూరు చేస్తున్నామని ఆయన తెలిపారు. వికారాబాద్ చుట్టూ గ్రామాలు ఎక్కువ, ఇక్కడ వైద్యం అందకపోతే హైదరాబాద్ పోవాల్సిన పరిస్థితీ ఉందని ఆయన అన్నారు. పెద్దపెద్ద జబ్బులకు పేదలు ప్రవేటు ఆసుపత్రులకు వెళ్తే ఖర్చులు తట్టుకోలేక ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఉంటాయని ఆయన అన్నారు. ప్రభుత్వం వందలు, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి బిల్డింగ్ లు, పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు ఇతర వసతులు కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. వికారాబాద్ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న వంద బెడ్ల వికారాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ను 30 కోట్ల రూపాయలతో 330 బెడ్లుగా అభివృద్ధి చేయడం జరిగిందని, 50 బెడ్ల క్రిటికల్ కేర్ యూనిట్ కూడా త్వరలోనే అందుబాటులోకి రాబోతుందని ఆయన తెలిపారు. వైద్య విద్యార్థులు అందుబాటులో ఉంటారు కాబట్టి ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని ఆయన అన్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ పోకుండా మన ఆసుపత్రిలోనే వైద్య సేవలు అందే విదంగా చూడాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా యాక్సిడెంట్లు అయినప్పుడు మొదటి గంట చాలా ముఖ్యమని గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తే బతికించే అవకాశం ఉంటుందని కాబట్టి డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇందుకు 24 గంటలు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని ఆయన సూచించారు.

అంబులెన్స్ ఎప్పుడు కూడా వర్కింగ్ కండీషన్ లో ఉంచాలని, సమాచారం రాగానే నిమిషంలో బయల్దేరే విదంగా చూసుకోవాలని ఆయన తెలిపారు. హాస్పిటల్ కు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని, రోగులు హాస్పిటల్ కు బాధతో రావాలి, తిరిగి వెళ్ళేటప్పుడు నవ్వుతూ వెళ్ళే విదంగా అందరూ సేవలను అందించాలని ఆయన కాంక్షించారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు విశ్వాసం కలిగే విధంగా వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో మంచి ఫలితాలు సాధించే దిశగా వైద్యాధికారులు అంకితభావంతో పని చేయాలని ఎంపీ సూచించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా కొడంగల్, వికారాబాద్ లలో జిల్లా ఆసుపత్రులు ఉన్నాయి కాబట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఆసుపత్రిలో ఏవైనా అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అదేవిధంగా సిబ్బంది కొరత ఉంటే కారుణ్య నియామకాల ద్వారా ఖాళీగా ఉన్న పోస్టులను నియమించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సుధాకర్ లాల్ మాట్లాడుతూ.. సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా మాతా శిశు సంరక్షణసేవలు అందిస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో 100 శాతం ప్రసవాలు చేపడుతూ, నవజాత శిశువుల మరణాలు తగ్గే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.సుబోద్ కుమార్, డిసిహెచ్ఓ కోఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్, ఐఎంఎ జిల్లా డాక్టర్ల అసోసియేషన్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి టి.సాయి చౌదరి, వివిధ విభాగాల డాక్టర్లు పాల్గొన్నారు.

## ప్యాడ్ బ్యాండ్‌కు అనుమతి ఇవ్వాలి

**తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం**

**బోనాల సందర్భంగా వాహనాలు సీజ్ చేయొద్దని పోలీసులకు విజ్ఞప్తి**

**హైదరాబాద్, జులై 25 (జనం సాక్షి):** బోనాల పండుగ సందర్భంగా ప్యాడ్ బ్యాండ్ ల నిర్వహణకు అనుమతి ఇవ్వడంతో పాటు బ్యాండ్ వాయిద్య కళాకారుల ఉపాధికి భంగం కలగకుండా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం డిమాండ్ చేసింది. శనివారం భాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హనుమంతు అధ్యక్షతన నిర్వహించిన హైదరాబాద్ నగర కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగే బోనాల ఉత్సవాల్లో రెండు బాక్సులతో కూడిన ప్యాడ్ బ్యాండ్ వాహనాలకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ, సెంట్రల్ జోన్ సీపీ సజ్జనార్‌లకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. నగరంలోని వివిధ పోలీసు కమిషనరేట్ల పరిధిలో బ్యాండ్ కళాకారుల వాహనాలను సీజ్ చేయకుండా, వారి జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆయన కోరారు. పోలీసు శాఖ నిర్దేశించిన శబ్ద పరిమితులను పాటించేందుకు కళాకారులు పూర్తిగా సహకరిస్తారని తెలిపారు. అయితే రాత్రి 10 గంటల తర్వాత కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులు, కస్టమర్లను కూడా బాధ్యులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి వేముల శ్రీనివాస్‌తో పాటు నాగేష్, ప్రవీణ్, అనిల్, దేవేందర్, హుస్సేన్, మురళి, నరసింహ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవాలి

**మంఖాల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన డీఈవో వెంకటేశ్వర్లు**



**మహేశ్వరం, జూలై 25 (జనంసాక్షి) :** విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చుకొని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని రంగారెడ్డి జిల్లా డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మంఖాల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం లైబ్రరీ నిర్వహణ,విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, పాఠశాల పరిశు భ్రత,బోధన విధానాలు, తదితర అంశాలను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు విద్యార్థి కేంద్రీత బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థి అభ్యాస పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. లైబ్రరీ వినియోగాన్ని మరింత పెంపొందించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు పలు సూచనలు చేశారు. తనిఖీ చేసిన వారిలో మహేశ్వరం మండలం ఎంఈవో కస్నా నాయక్,ఉపాధ్యాయులు రేణుక,వనజ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకే ప్రముఖ ప్రాధాన్యత : డీసీపీ యోగేష్



**శంకర్‌పల్లి, జూలై 25 (జనంసాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలని చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ సూచించారు. శనివారం ఆయన మోకిలా పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఇప్పటివరకు నమోదైన కేసులు, పరిష్కరించిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..నంబర్ ప్లేట్లు లేని వాహనాలు,మాదక ద్రవ్యాల సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రత దృష్ట్యా రాత్రి వేళల్లో దొంగతనాలు జరగకుండా గస్తీని పెంచాలని సీఐ శ్రీనివాస్ రెడ్డికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో రాష్టానికి 18వ స్థానం



**బొంరాస్‌పేట, జూలై 25 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఆరు రోజుల నుండి ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ టీచర్లకు నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ శనివారం ముగిసిందని మండల విద్యాధికారి హరిలాల్ వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఎఫ్ఎల్ఎన్ విధానంలో విద్యాబోధన జరుగుతుందని,విద్యా బోధన ఇంకా మెరుగుపరచడానికి విద్యార్థులకు మంచి విద్యార్థి అందించడానికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రాథమిక విద్యను ప్రతిష్ట చేయడానికి రాష్ట్ర ప్రభుత్వము సీఎం రేవంత్ రెడ్డి చేసిన కృషికి పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో రాష్ట్రానికి 18వ స్థానం రావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పిలు నవీన్ కుమార్, జీవన్ కుమార్, అన్వర్, మహేష్ కుమార్, సీఆర్పీలు, ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నారు.

## శంషాబాద్‌లో యువతి, మహిళ అదృశ్యం



**శంషాబాద్, జూలై 25 (జనంసాక్షి) :** వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 19 ఏళ్ల గాజ్జే నందిని ఈ నెల 25 ఉదయం ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. ఉదయం 8:30 గంటల సమయంలో ఇంటి సమీపంలో చివరిసారిగా కనిపించిన ఆమె, అనంతరం ఆచూకీ లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బంధువులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యం**



శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 40 ఏళ్ల చెగూరి అనిత ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. కుటుంబంలో ఇంటి పత్రాలకు సంబంధించిన వివాదంతో మనస్తాపానికి గురైన ఆమె, తన కుమార్తెను జాగ్రత్తగా చూసుకోవాలని తోబుట్టువులకు వాట్సాప్ సందేశాలు పంపి ఇంటి నుంచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంట్లో ఆమె మొబైల్ ఫోన్ లభించగా, గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


## పోచారం పరిధిలో 9 భవనాలు సీజ్

**సెలవు దినాల్లోనూ అక్రమ నిర్మాణాలు..**

**పోలీసుల సహకారంతో టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు**

**ఘట్‌కేసర్, జూలై 25 (జనంసాక్షి) :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం వార్డులో యన్నంపేట్-- నారాపల్లి ప్రాంతంలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న తొమ్మిది భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం సీజ్ చేశారు. పోలీసు శాఖ సహకారంతో ఈ చర్యలు చేపట్టారు. అధికారుల వివరాల ప్రకారం, సంబంధిత భవన యజమానులకు గతంలోనే పలుమార్లు నోటీసులు జారీ చేసి నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశించారు. అయినప్పటికీ సెలవు దినాలను ఆసరాగా చేసుకుని అక్రమ నిర్మాణాలు కొనసాగించడంతో ఇప్పటికే పలుమార్లు కూల్చివేత చర్యలు చేపట్టినా, యజమానులు నిబంధనలను ఉల్లంఘిస్తూ పనులు కొనసాగించినట్లు అధికారులు తెలిపారు. దీంతో చట్టపరమైన అధికారాలను వినియోగించి తొమ్మిది నిర్మాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఏ. శ్రీధర్ మాట్లాడుతూ, భవన నిర్మాణదారులు తప్పనిసరిగా మంజూరైన అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలు, సీజ్ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఏ. శ్రీధర్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ బి. శ్రీదేవి, పోచారం ఐటీ కారిడార్ పోలీసు సిబ్బంది, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.








## ప్రజా సమస్యల పరిష్కారంలో సంక్షేమ సంఘాలు కీలక పాత్ర పోషించాలి

**బిఆర్ఎస్ఎల్పి విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద**



**నిజాంపేట్ (జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 278వ వార్డు, గాజులరామారం పరిధిలోని వీనస్ రాక్ హైట్స్ కాలనీ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం (వెల్ఫేర్ అసోసియేషన్) కమిటీ సభ్యులు శనివారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని శాలువా, పుష్పగుచంతో సన్మానించి తమ కాలనీలోని మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, నివాసితుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతర ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, కాలనీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీనస్ రాక్ హైట్స్ కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమా రెడ్డి, ఉపాధ్యక్షుడు అరవింద్, రాజేష్, ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఇతర కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే

**నీట్ విద్యార్థులకు అండగా, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ నిరసన**

**సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ**




**సూర్యాపేట (జనంసాక్షి) :** నీట్ పేపర్ లీక్ పై విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా శనివారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుండి మహాత్మాగాంధీ విగ్రహం వరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, పారదర్శకత లోపం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని అన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వాలకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని తెలిపారు. విద్యార్థులు ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదివి పరీక్షలకు హాజరవుతుంటే,వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడటం బాధాకరమన్నారు. విద్యార్థుల శ్రమ, ప్రతిభ, ఆశయాలను కాపాడే బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకతను తీసుకురావాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని, విద్యార్థుల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ఎల్లప్పుడూ వారి పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య మాట్లాడుతూ విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే సంఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ఆదిభట్ల సీఐపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

**మహేశ్వరం, జూలై 25(జనంసాక్షి) :** విద్యార్థులు,తల్లిదండ్రులు పట్ల అమానుషంగా మాట్లాడిన ఆదిభట్ల సీఐ రవిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మధుమోహన్ శనివారం మానవ హక్కుల కమిషన్ లో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్ మధుమోహన్ మాట్లాడుతూ... తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని న్యూ శ్రీ చైతన్య కాలేజీలో చదువుతున్న డీఆర్డీఓ ద్వారా ఎంపికైన 38 మంది ట్రైబల్ విద్యార్థులకు విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న సర్టిఫికెట్లు ఇవ్వలేదు. దీంతో ఎబీబీపీ నాయకులు గణేష్,మోడీ విశాల్ నాయక్, విద్యార్థినిల పట్ల ,తల్లిదండ్రుల పట్ల అమానుషంగా మాట్లాడిన ఆదిభట్ల సీఐ రవిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నెల రోజుల క్రితం హైదారాబాద్ సీపీ సజ్జనార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ గణేష్,మోడీ విశాల్ నాయక్,పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో స్పాపై పోలీసుల దాడి

**మేనేజర్, యజమాని అదుపులోకి.. కేసు నమోదు**




**హయత్ నగర్, జూలై 25 (జనంసాక్షి) :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధి,ఓంకార్ నగర్‌లోని ఓ స్పాలో అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం రాత్రి దాడి నిర్వహించారు. పోలీసుల వివరాల ప్రకారం, జూలై 24న సాయంత్రం సుమారు 7.30 గంటలకు ఓంకార్ నగర్‌లోని రిలీట్ వెల్ బ్యూటీ ఒ స్పా లో అనుమతులకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్ఐ జి. గిరీష్ కుమార్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా స్పా లో ఓ మహిళా థెరపిస్ట్ ఓ పురుష కస్టమర్‌కు క్రాస్ మసాజ్ అందిస్తున్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో స్పా మేనేజర్ సాయి సంతోష్, యజమాని బండావత్ శివదుర్గా ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వనస్థలిపురం ఎస్హెచ్ఓ రవిబాబు తెలిపారు.

## మత మార్పిడి ఒత్తిడి ఆరోపణలు.. పోలీసులకు విద్యార్థుల ఫిర్యాదు

**హాస్టల్ వార్డెన్,నన్స్‌పై ఆరోపణలు..**

**విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కురుమూర్తి హామీ**



**కల్వకుర్తి,జూలై 25,(జనంసాక్షి) :** కల్వకుర్తి పట్టణంలోని నిర్మల విద్యాలయం మిషనరీ పాఠశాల హాస్టల్‌లో విద్యార్థులపై మత మార్పిడికి ఒత్తిడి తెస్తున్నారని ఆరోపిస్తూ పలువురు విద్యార్థులు శనివారం కల్వకుర్తి పోలీసులను ఆశ్రయించారు. హాస్టల్ వార్డెన్ జయశ్రీ,నన్స్ గత కొన్నేళ్లుగా ప్రతిరోజూ ప్రార్థనలు చేయాలని,ప్రతి ఆదివారం చర్చికి తప్పనిసరిగా రావాలని,బొట్టు పెట్టుకోవద్దని ఒత్తిడి చేస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి మాట వినకపోతే నాసిరకం ఆహారం అందించడం,మోకాళ్లపై కూర్చోబెట్టి శారీరకంగా వేధిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల నుంచి సమాచారం అందుకున్న ఏబీవీపీ,బీజేపీ నాయకులు నిర్మల విద్యాలయానికి వెళ్లి ప్రిన్సిపాల్ జురీల్‌ను నిలదీశారు. అనంతరం ప్రిన్సిపాల్,హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్‌హెచ్‌వో,ఎస్ఐ కురుమూర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తమపై జరిగిన వేధింపులను వివరిస్తూ కొందరు విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. విద్యార్థులకు ధైర్యం చెప్పిన ఎస్ఐ కురుమూర్తి, ఫిర్యాదుపై సమగ్ర విచారణ నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ బీజేపీ అధ్యక్షుడు గన్నోజు బాబీదేవ్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్,జిల్లా ఉపాధ్యక్షుడు, 13వ వార్డు కౌన్సిలర్ బోడ నరసింహ, 1వ వార్డు కౌన్సిలర్ వడ్డే శ్రీరాములు, 11వ వార్డు కౌన్సిలర్ ఎనుగొండ రామకృష్ణ, హనుమంత్ గౌడ్, దేరంగుల శివ, లక్ష్మీనరసింహ, శ్రీకాంత్,బీజేవైఎం నాయకులుమాయని రాజశేఖర్, రఘుచారి,సాయి,ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ప్రశాంత్ యాదవ్, ఏబీవీపీ నాయకులు శివరాం, చరణ్, భరద్వాజ్, ప్రణీత్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
26 జూలై 2026

# రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

• అదనపు కలెక్టర్ నగేష్



**మాసాయిపేట్, జూలై 25 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం జిల్లాలోని మాసాయిపేట మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,మండల తహసిల్దార్ తో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల సర్వే, రీ సర్వే తో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో భూమి వివాదాలు లేకుండా రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భూములకు సంబంధించి స్పష్టమైన వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. అనంతరం పోతంశెట్టిపల్లి గ్రామంలో చెరువు సి ఖశీ భూమిని అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించి ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని తగు చర్యలు తీసుకోవాలని తాసిల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, మాసాయిపేట తాసిల్దార్ రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ-కేవైసీ పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలి

• రేషన్ డీలర్ల సమావేశంలో తహసీల్దార్ అద్దంకి సునీత సూచనలు



**ఉప్పునుంతల, జూలై 25 (జనం సాక్షి) :** ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుదారుల ఈ-కేవైసీని తక్షణమే పూర్తి చేయాలని మండల తహసీల్దార్ శ్రీమతి అద్దంకి సునీత రేషన్ డీలర్లకు సూచించారు. శుక్రవారం ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మండల రేషన్ డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రతి డీలర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో సమయపాలన పాటిస్తూ రేషన్ దుకాణాలను నిర్వహించాలని, కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రతి డీలర్ బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్, కార్యాలయ సిబ్బంది, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## ఏకలవ్య ఆశయాలతో యువత ముందుకు సాగాలి

• ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**తెలకపల్లి, జూలై 25 (జనంసాక్షి) :** ఏకలవ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని స్థానిక ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివాసి ఎరుకల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏకలవ్య జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, ఏకలవ్య జీవితం క్రమశిక్షణ, గురుభక్తి, పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచ్, ఉప సర్పంచ్, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ఆదివాసి ఎరుకల సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

• మంత్రి సీతక్క



**మెదక్ బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో శనివారం సాయంత్రం జలసిరి కార్యక్రమం, విబిజి రామ్ జి పనులు, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట, కానీ నినాదంతో భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు ప్రారంభించామని అన్నారు. ప్రతి రైతు తమ పొలాలలో ఫామ్ పాండ్ నిర్మించుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలన్నారు. రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. విబిజి రామ్ జి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులలో దేశంలోనే ముందువరుసలో ఉన్నామని అన్నారు. అర్హులైన ప్రతి పేద కూలీలందరికీ పని దినాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈవో ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఎస్ఐఆర్ నిర్వహించాలి



**ధరూర్, జూలై 25 (జనం సాక్షి) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని డి.కె. స్నిగ్ధ రెడ్డి సూచించారు. శుక్రవారం ధరూర్ మండలంలోని అల్లపాడు గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె తెలిపారు. అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.

## పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుంది



**మెదక్ బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ శాఖలో ఏ ఎస్సైగా విధులు నిర్వహించి ఎస్సైగా పదోన్నతి పొందిన పలువురికి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఎస్పీ డివి శ్రీనివాసరావు ర్యాంకు చిహ్నాలను అందజేశారు. అల్లాదుర్గ్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గాలయ్య ఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు గాలయ్యకు ఎస్ఐ ర్యాంక్ చిహ్నాలను అలంకరించి అభినందించారు. అదేవిధంగా నర్సాపూర్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆర్. తుకారాం, ఈ. వీరన్నలు ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారు జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ వారికి ఏఎస్సై ర్యాంక్ చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు. పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని, విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

## ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

• ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**అమీన్పూర్, జూలై 25 (జనం సాక్షి) :** అమీన్పూర్ పరిధిలోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం అమీన్పూర్ డివిజన్‌లోని ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్ అపార్ట్‌మెంట్, దుర్గా హోమ్స్ కాలనీలలో రూ.80లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అమీన్పూర్‌లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పైప్‌లైన్ విస్తరణ పనులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతులను కల్పించి, అమీన్పూర్‌ను ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, నాయకులు గోపాల్, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, జగదీష్, రాజు, చంద్రశేఖర్, రుశ్వంత్ రెడ్డి, దాసు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## విద్య, క్రీడలకు పెద్దపీట వేయాలి



**తెలకపల్లి, జూలై 25 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో పాలిటెక్నిక్, ప్రభుత్వ జూనియర్ (ఇంటర్మీడియట్), డిగ్రీ కళాశాలలతో పాటు ఆధునిక క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డికి మండల యువత, విద్యార్థులు, వివిధ యువజన, కార్మిక, ఉద్యోగ, నిరుద్యోగ సంఘాల ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల కేంద్రంలో ఉన్నత విద్యా సంస్థలు లేకపోవడంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పలువురు విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో క్రీడా మైదానం లేకపోవడం వల్ల పోలీసు, కేంద్ర బలగాలు, భారత సైన్యంలో చేరాలనే లక్ష్యంతో ఉన్న యువతకు సరైన శిక్షణ అవకాశాలు లేక వారి కలలు నెరవేరడం లేదన్నారు. క్రీడలకు దూరమవుతున్న యువత మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్‌లకు బానిసై మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు భారీగారి పరమేష్, బతికే మల్లేష్, దర్శనం సురేష్, ఎండి బాబా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, జూలై 25 (జనంసాక్షి) :** ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. జడ్చర్ల పట్టణంలోని ఎర్రగట్ట డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో రాత్రి వేళల్లో కాలనీవాసులకు మెరుగైన వెలుతురు, సంపూర్ణ భద్రత కల్పించే ఉద్దేశంతో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ దీపాలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మెరుగైన సౌకర్యాలు అందించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని, కాలనీవాసులు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, మరింత మెరుగైన వసతులు కల్పిస్తామని హామీనిచ్చారు. ప్రజలందరి సహకారంతో జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలోనూ ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎర్రగట్ట డబుల్ బెడ్‌రూమ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** నారాయణపేట మండలంలోని లింగంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన దారిలో రూ.200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను శనివారం జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు.అగ్రిమెంట్ ప్రకారం 2027 జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మింప చేయిస్తోందని,అందులో భాగంగానే నారాయణపేట నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియాఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ఇక్కడి లింగంపల్లి గ్రామ సమీపములో నిర్మించడం జరుగుతోందని తెలిపారు. స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆమె అధికారులను ఆదేశించారు.స్కూల్ నిర్మాణంలో 4 అకాడమిక్ బ్లాక్‌లు, ఒక సీనియర్ డార్మిటరీ ,ఒక జూనియర్ డార్మిట్, ఒక వంటగది,భోజనశాల, ప్రధాన నివాస గృహం, రెండు సింగిల్ క్వార్టర్లు,6డబుల్,సంప్ లు, తల్లిదండ్రుల లాంచ్ ఉంటాయని టీజీ ఈ డబ్ల్యూ ఐ డీ సీ డీ.ఈ.ఈ వెంకట్ రెడ్డి మ్యాప్ ద్వారా కలెక్టర్ కు వివరించారు.పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# తెలకపల్లి పీహెచ్‌సీ ఆకస్మిక కలెక్టర్ తనిఖీ



**తెలకపల్లి, జూలై 25 (జనం సాక్షి) :** ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ వైద్యులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రభుత్వ వైద్యులను ఆదేశించారు. శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ (పీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల తీరును, వైద్యులు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య అధికారులకు కలెక్టర్ సూచించారు. తనిఖీలో భాగంగా ముందుగా పీహెచ్‌సీలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించిన కలెక్టర్, విధుల్లో అందరూ సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల వివరాలు, నమూనాల సేకరణ, పరీక్షల నమోదు, ఫలితాల విడుదల ప్రక్రియపై ఆరా తీశారు. పరీక్షల నివేదికలు సకాలంలో రోగులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజిస్టర్ ను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందుల నిల్వలను కూడా కలెక్టర్ పరిశీలించారు. సాధారణ రోగాలకు అవసరమైన మందులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే కుక్క కాటు, పాము కాటు చికిత్సకు సంబంధించిన మందులు తగినంత నిల్వలో ఉన్నాయా లేదా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అత్యంతవసర పరిస్థితుల్లో అవసరమయ్యే ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, మందుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. చికిత్సతో పాటు రోగుల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరిశీలించి అవసరమైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స, మందులు అందేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి సంతృప్తిగా తిరిగి వెళ్లేలా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రజలకు అందుబాటులో ఉండి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట తెలకపల్లి మండల స్థాయి అధికారులు వైద్యులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ధర్నా చౌక్ ఎత్తేసిన చరిత్ర బీఆర్ఎస్‌దే..

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వర్ధన్నపేట, జూలై 25 (జనంసాక్షి) :** ధర్నా చౌక్ ఎత్తేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనని, ఇప్పుడు అదే అంశంపై ధర్నాలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల తరపున పోరాటం చేస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యమాలు చేస్తోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో పలు పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, గ్రూప్-1 వంటి నియామక పరీక్షల్లోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన బీఆర్ఎస్‌కు ఇప్పుడు విద్యార్థుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పారని, ఇప్పుడు నల్ల చొక్కాలు ధరించి ధర్నాలు చేసినా విద్యార్థులు, ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే నాగరాజు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ చేపడుతున్న కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీపాది సతీష్, ఎస్సీ విభాగం మండల నాయకుడు మరుపట్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప చెరువు నీరు విడుదల

- ఆనందంలో ఆయకట్టు రైతులు



**వెంకటాపూర్ (రామప్ప), జూలై 25(జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామ శివారులోని రామప్ప చెరువు నీటిని అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఎల్ ని నో ప్రభావం మూలంగా తాగునీటికి ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా ఈనెల 19వ తేదీన రామప్ప చెరువు కింది ఆయకట్టు రైతులకు సాగునీటిని నిలిపివేసిన విషయం తెలిసింది. ఈ క్రమంలో ఒకింత ఆందోళనకు గురైన రామప్ప చెరువు ఆయకట్టు రైతులు సంఘటితమై సమావేశాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు జిల్లా కలెక్టర్ ను కలిసి తమ పంటలకు సాగునీరు అందించాలని వినతిపత్రం సైతం అందజేసారు. బీఆర్ఎస్ నాయకులు రైతుల పక్షాన నిలబడి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేయగా, మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి రామప్ప ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ నాయకులు సైతం రైతులకుహామీ ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం అధికారులు రామప్ప చెరువు వద్దకు చేరుకొని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు గాను కాలువలకు రామప్ప చెరువు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రామప్ప ఆయక రైతులకు సాగునీటిని విడుదల చేయడం జరిగిందని, సాగునీటి విడుదల కోసం సహకరించిన మంత్రి సీతక్కకు రైతులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డిఈ రవీందర్,ఏఈ శివ, పంచాయతీ రాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తాడ్వాయి పోలీస్ స్టేషన్ తనిఖీ




**ములుగు ప్రతినిధి, జూలై25(జనం సాక్షి):** ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ వార్షిక తనిఖీల్లో భాగంగా తాడ్వాయి పోలీస్ స్టేషన్ ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్శనలో ఎస్పీ మొదటగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ చుట్టూ కలియ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత ను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులలో ఉన్న వాహనాల యొక్క పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిసెప్షన్ అధికారి తో మాట్లాడుతూ ఫిర్యాదారులతో మర్యాదగా వ్యవహరించాలని దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో పొందుపరచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులలో పురోగతిని సమీక్షించారు. ఎప్పటికప్పుడు కేసులలోని దర్యాప్తును వినవెంటనే ఆన్లైన్లో పొందుపరచాలని ఆదేశించారు. అనంతరం రికార్డుల నిర్వహణ విధానం,సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించారు. కేస్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు. రౌడీ శీటర్ల పైన తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులను మరియు సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీలు ములుగు డిఎస్పి రవీందర్, పస్ర సీఐ దయాకర్ పాల్గొన్నారు.

# అండగా నిలిచిన గ్రామం..

- అనాథ కుటుంబానికి ఆర్థిక భరోసా
- గ్రామ పెద్దలు,ఉద్యోగుల మానవత్వానికి నిదర్శనం
- కన్నీటి కుటుంబంలో ఆశాకిరణం



**నేరడిగొండ, జూలై 25 (జనంసాక్షి) :** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఒకే పేద కుటుంబంలో వరుస విషాదాలుచోటుచేసుకోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి వెంకటాపూర్ గ్రామ పెద్దలు,ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద మనసుతో అండగా నిలిచారు. శనివారం రోజున గ్రామంలో మానవత్వం ఇంకా సజీవంగా ఉందని నిరూపిస్తూ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదర్శంగా నిలిచారు. గత ఏడాది కుటుంబానికి ఆధారంగా ఉన్న కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి అతని భార్య ముగ్గురు చిన్నారులను పోషిస్తూ అత్తతో కలిసి కుటుంబాన్నినెట్టుకొస్తోంది. అయితే ఇటీవల ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న అత్త అడెల్లి కూడా ఇటీవల మృతి చెందడంతో కోడలు ముగ్గురు చిన్నారులతో తీవ్రఆవేదనలో మిగిలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు,ప్రభుత్వ ఉద్యోగులు స్పందించి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయం అందజేస్తూ చిన్నారుల చదువు, కుటుంబ భవిష్యత్తుకు అందరూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత మహిళ భావోద్వేగానికి లోనై, కష్టకాలంలో తన కుటుంబాన్ని ఆదుకున్న గ్రామ పెద్దలు, ఉద్యోగులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి మానవత్వం జీవితాంతం మరువలేనిదని, ఈసహాయం తమ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్థులు కూడా గ్రామ పెద్దలు,ఉద్యోగులు చూపిన సేవాభావాన్ని అభినందిస్తూ,సమాజంలో ఇలాంటి మానవత్వం మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రూపావత్ వెంకట్రామ్ ఉప సర్పంచ్ ఆడే మురళి కృష్ణ తోపాటు గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

# ఆకాశం మౌనం... నేల దాహం.. రైతన్న కన్నీటి గాథ

- వాన కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూపులు
- ఎండలతో ఎండిపోతున్న ఆశలు
- అప్పుల భారంతో అన్నదాత ఆవేదన





**దేవరుప్పుల, జూలై 25 (జనం సాక్షి):** దేవరుప్పుల మండలంలో ప్రకృతి రైతును మరోసారి తీవ్ర నిరాశలోకి నెట్టింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఆశగా విత్తనాలు చల్లిన రైతులకు వర్షాభావం పెద్ద దెబ్బగా మారింది. ఆకాశం మేఘాలతో కనిపించినా ఒక్క చినుకు కూడా కురవకపోవడంతో పంట పొలాలు బీటలు వారుతున్నాయి. నేలలో తేమ లేక మొలకెత్తిన పత్తి, పెసర, కంది తదితర పంటలు రోజురోజుకూ వాడిపోతుండగా రైతుల కళ్లల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో బ్యాంకులు, ప్రైవేట్ అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి సాగు ప్రారంభించిన రైతులు ఇప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. ఇప్పటికే వేసిన పెట్టుబడులు నేలపాలు అవుతాయనే భయంతో అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. కొన్ని గ్రామాల్లో బోర్లు ఎండిపోవడంతో సాగునీటి పరిస్థితి కూడా దయనీయంగా మారింది. మండలంలోని అనేక గ్రామాల్లో పొలాలు పచ్చదనం కోల్పోయి ఎడారిని తలపిస్తున్నాయి. . రైతులు ప్రతి రోజు వాతావరణ సూచనలను గమనిస్తూ, ఎప్పుడు వర్షం కురుస్తుందా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కానీ ప్రకృతి మాత్రం కరుణించకపోవడంతో రైతు గుండెల్లో ఆవేదన పెరుగుతోంది. వాన లేదు. పంట లేదు రైతన్నకు కల లేదు అనే పరిస్థితి ప్రస్తుతం మండల వ్యాప్తంగా కనిపిస్తోంది. ఒకవైపు అప్పుల ఒత్తిడి, మరోవైపు ఎండల తీవ్రత రైతులను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తోంది. పంటలు పూర్తిగా దెబ్బతింటే కుటుంబ పోషణ ఎలా, అప్పులు ఎలా తీర్చాలనే ఆందోళన వారిని వెంటాడుతోంది. రైతులను ఈ క్లిష్ట పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ సాగు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతి కరుణించి త్వరలోనే మంచి వర్షాలు కురవాలని, అన్నదాతల ఆశలు మరోసారి చిగురించాలని మండల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



# ఆరుతడి పంటలతోనే అధిక ఆదాయం సాధ్యం

- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి
- ఐనవోలు మండలంలో పెసర, ఆయిల్‌పామ్, మామిడి తోటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ/ ఐనవోలు, జూలై 25 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. శనివారం ఐనవోలు మండలం సింగారం, పున్నేలు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్, రైతులు సాగు చేస్తున్న పెసర, ఆయిల్‌పామ్ పంటలతో పాటు మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగారం గ్రామానికి చెందిన రైతు ఆకారపు పురుషోత్తం రెడ్డి మూడు ఎకరాల్లో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి వినియోగంతో పెసర పంటను సాగు చేయడాన్ని కలెక్టర్ అభినందించారు. అనంతరం రైతులతో మాట్లాడి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వరికి బదులుగా ఏయే పంటలు అనుకూలంగా ఉంటాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెసర, మినుములు, కందులు వంటి పంటలకు తక్కువ నీరు అవసరమవుతుందని, 60--70 రోజుల్లో దిగుబడి రావడంతో పాటు మార్కెట్లో మంచి ధర కూడా లభిస్తోందని తెలిపారు. అనంతరం పున్నేలు గ్రామంలో రైతు వేల్పుల రమేష్ ఆరున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను కలెక్టర్ పరిశీలించారు. పంట సాగు కాలం, దిగుబడి, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన రైతు రాజారపు బాలరాజు కూడా ఆయిల్‌పామ్ మొక్కలు నాటినట్లు కలెక్టర్‌కు తెలిపారు. అలాగే రైతు రవికిరణ్ రెడ్డి మూడు ఎకరాల్లో సాగు చేస్తున్న మామిడి తోటను సందర్శించి తోట నిర్వహణ, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వరి, పత్తి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమయ్యే పంటల కంటే పెసర, మినుములు, కందులు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు, పచ్చజొన్న వంటి ఆరుతడి పంటలు రైతులకు మరింత ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఇప్పటికే పెసర, ఆయిల్‌పామ్ సాగు ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న రైతులను అభినందిస్తూ, ఇతర రైతులు కూడా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కూడా పెసర, మినుములు, కందుల విత్తనాలను సబ్సిడీపై అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో వ్యవసాయ శాఖ ఏడీ ఆదిరెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ, ప్రతినిధి జూలై 25 (జనంసాక్షి) :** హనుమకొండ నగరానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తిని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శనివారం హన్మకొండ లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్ సేన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

# ముస్సిపల్ కౌన్సిల్‌లో వాగ్వివాదం

- ఎమ్మెల్యే వైఖరిపై సభ్యుల ఆగ్రహం



**నిర్మల్ బ్యూరో, జూలై 25 (జనంసాక్షి) :** నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం వాగ్వా దాల మధ్య కొన సాగింది. మున్సిపల్ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరును పలువురు కౌన్సిలర్లు తీవ్రంగా తప్పుబట్టారు. రివ్యూ సమావేశాల పేరుతో మున్సిపల్ అధికారులను పార్టీ కార్యకర్తల సమక్షంలో అవమానించడం తగదని అభిప్రాయపడ్డారు. అధికారులు ఎస్సీ, బీసీ వర్గాలకు చెందినవారే కావడం వల్లే ఈ విధంగా వ్యవహరిస్తున్నారా? అగ్రవర్ణాలకు చెందిన అధికారులు ఉంటే కూడా ఇదే తీరు ఉండేదా? అని సభ్యులు ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడేలా వ్యవహరించాలని సూచించారు. సమావేశం అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్‌ను కౌన్సిలర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు.

# బీరన్న బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బీరన్న స్వామి గొల్ల, కురుమల ఆరాధ్య దైవమని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీరన్న బోనాల మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గొల్ల, కురుమ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఊరేగింపులో ఆయన భక్తులతో కలిసి బోనం ఎత్తుకొని కొంత దూరం ర్యాలీగా నడిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలు సమాజంలో ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని, యువతకు మన సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని బీరన్న స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్లాల బావిలో పడి చనిపోయిన కుక్క!

- తాగునీరంతా కలుషితం....
- నల్లాల ద్వారా నీటిని సరఫరా చేయడంతో గంగిరెద్దుల కాలనీవాసుల ఆగ్రహం



**చెన్నారావుపేట, జూలై 25( జనం సాక్షి):** గ్రామ పంచాయతీకి సంబంధించిన నల్లాల బావిలో పడి కుక్క చనిపోయిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని అక్కల్ చెడ గ్రామంలోని కట్టయ్య పల్లెలో ఉన్న గ్రామ పంచాయతీకి సంబంధించిన నల్లాల బావిలో గత మూడు రోజుల క్రితం కుక్క పడి చనిపోయింది. మూడు రోజులుగా నల్లాల బావిలో కుక్క కళేబరం కుళ్లిపోయి తాగునీరు మొత్తం కలుషితమైంది. గత మూడు రోజులుగా నల్లాల ద్వారా త్రాగునీటిని గ్రామపంచాయతీ సిబ్బంది సరఫరా చేస్తున్నారు. శనివారం ఉదయం నల్లాల ద్వారా నీటిని వదలడంతో త్రాగునీళ్లు దుర్వాసన వచ్చాయి. దీంతో అనుమానం వచ్చిన స్థానికులు గమనించి నల్లాల బావి వద్దకు వెళ్లి చూశారు. నల్లాల బావిలో కుక్క కళేబరాన్ని గమనించి గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ కు సమాచారం అందించారు. వెంటనే గ్రామపంచాయతీ సిబ్బందితో కుళ్లిపోయిన కుక్క కళేబరాన్ని బయటకి తీయించారు. కలుషితమైన తాగునీటిని నల్లాల ద్వారా సరఫరా చేయడంతో గంగిరెద్దుల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషితమైన తాగునీటిని సరఫరా చేయడంతో రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక నల్లాల ద్వారా సరఫరా అయ్యే మెయిన్ పైప్ లైన్ ను గంగిరెద్దుల కాలనీ సమీపంలో తాగునీరు నల్లాల ద్వారా సరఫరా కాకుండా ధ్వంసం చేశారు. కలుషితమైన నల్లాల బావిలోని నీటిని మోటార్ల ద్వారా మొత్తం బయటికి పంపించాలన్నారు. అనంతరం స్వచ్ఛమైన తాగునీటిని నల్లాల ద్వారా సరఫరా చేయాలని గంగిరెద్దుల కాలనీవాసులు జిడ్డి కుమారస్వామి, ప్రవీణ్, రమేష్, రాజు, తదితరులు డిమాండ్ చేశారు.

# చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



**బజార్‌హత్నూర్, జూలై 25 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చేపల వేట కోసం వెళ్లారు అందులో చౌరే అరుణ్ (45) అనే వ్యక్తి చేపల వేట కోసం చెరువు గట్టు నుండి అవతలి గట్టుకు దాటే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు బోథ్ సీఐ గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం దేగామ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన అరుణ్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు ఆయనతో వెళ్లిన వ్యక్తులకు కూడా ఈత రాకపోవడంతో ఎవరు అతణ్ణి కాపాడే ప్రయత్నం చేయలేక మునిగి చనిపోయినాడు. నిన్న అనగా శు క్రవారం రోజునా సాయంత్రం నుండి పోలీసు సిబ్బంధి, అగ్ని మాపక సిబ్బంధి, స్థానిక మరియు కుంతల గజ ఈతగాళ్లు కలిసి గాలించగా శనివారం రోజునా మధ్యాహ్నం 2:45 గం.లకు మృతదేహం లభ్యం కాగ కేసునమోదు చేసి మృతదేహం ని పోస్ట్ మార్టం నిమిత్తం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనైనది. వర్షాలు పడుతుండటంతో మస్త్యకారులు ఇతరులు ఎవరు వాగులు చెరువులలో చేపలు పట్టడానికి వెల్లకూడధని హెచ్చరిస్తు ఇట్టి విషయంలో పోలీసులకు సహకరించాలని బోత్ సీఐ గురుస్వామి కోరారు.

# కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసిన సీపీఓ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు నూతన సీపీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించిన కిష్టయ్య శనివారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ప్రస్తుత సీపీఓ జవహర్‌లాల్ ములుగు జిల్లాకు బదిలీపై వెళ్లిన నేపథ్యంలో, స్టాటిస్టికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిష్టయ్యకు సీపీఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన సీపీఓ జవహర్ లాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రాణ, ఆస్తుల రక్షణలో ఫైర్ సర్వీసులు కీలకం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, జూలై 25 (జనంసాక్షి) :** ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో ఫైర్ సర్వీసుల పాత్ర ఎంతో కీలకమని, పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో ఫైర్ స్టేషన్ నిర్మాణం చేపట్టడం వల్ల అగ్నిప్రమాదాలు మరియు అత్యవసర పరిస్థితుల్లో సత్వర స్పందనకు అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణ ప్రజలకు అత్యవసర అగ్నిమాపక సేవలను మరింత వేగవంతంగా అందించాలనే లక్ష్యంతో శనివారం కావేరమ్మపేట శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించనున్న ఫైర్ స్టేషన్ భవన నిర్మాణానికి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని సమయానికి పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గిరీష్, సంబంధిత శాఖ అధికారులు డీఎఫ్ఓ గిరిధర్ రెడ్డి, ఎస్ఎఫ్ఓ లు రాజేందర్, మల్లికార్జున్, ఎల్ఎఫ్ లు రాఘవేంద్ర, సంజీవ రెడ్డి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జడ్చర్ల మున్సిపాలిటీలోని గుట్టపై శ్రీ రంగానాయక స్వామిని, గంగాపూర్‌లోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామిని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వేర్వేరుగా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించారు.

## బీసీ సాధికారత సదస్సును విజయవంతం చేయాలి

- తెలంగాణ రక్షణ సేన నాయకుల పిలుపు



**నారాయణపేట, జూలై 25 (జనం సాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఆగస్టు 6న టి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ బిసి సాధికారత సదస్సును విజయవంతం చేయాలని టి ఆర్ ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గావినోళ్ల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని టి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 6న ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న బీసీ సాధికారత సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మక్తల్ నియోజకవర్గ టి ఆర్ ఎస్ ఇంచార్జి డి.కె.సి.హెచ్.వెంకటన్న మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ సోదర సోదరీమణులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మాట్లాడుతూ టి ఆర్ ఎస్ ప్రకటించిన పంచ జన్యం"లో భాగంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతే రాజు, ఉద్యోగాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణ, మహిళా సాధికారతతో పాటు సామాజిక న్యాయం అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని సామాజిక న్యాయ సాధన దినోత్స వంగా నిర్వహించాలని పార్టీ అధినేత్రి కవిత నిర్ణయించిన నేపథ్యంలో,నారాయణపేట జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు.జిల్లా మహిళా నాయకురాలు సంధ్యారాణి మాట్లాడుతూ, తెలంగాణలో సామాజిక న్యాయం సాధించాలంటే కవిత అక్క నాయకత్వమే సరైన దిశ అని అన్నారు.ఈ కార్యక్రమంలో దామ రగిద్ద మండల పార్టీ అధ్య క్షులు నర్సింహారెడ్డి, నాయకులు డాక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశా నుంచి గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- రూ.10 లక్షల విలువైన గంజాయి, వీడ్ ఆయిల్ స్వాధీనం
- డీఎస్పీ.శివరాం రెడ్డి



**నల్గొండ, జూలై 25 (జనం సాక్షి) :** ఒడిశా నుంచి గంజాయి, వీడ్ (హాష్) ఆయిల్‌ను తీసుకొచ్చి నల్గొండలో విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో 8 మంది నిందితులు, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకోగా,మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన 5.6 కిలోల గంజాయి, 100 ఎంఎల్ వీడ్ (హాష్) ఆయిల్, 5 బైక్‌లు, 4 మొబైల్ ఫోన్లు, ఒక డమ్మీ తుపాకీ, ఒక బటన్ చాకు స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్,ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో,వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందం ఈ ఆపరేషన్ నిర్వహించింది.పోలీసుల విచారణలో వెల్లడైన వివరాలు నిందితులు చెడు వ్యసనాలకు బానిసలై, దొంగిలించిన బైక్‌లను అమ్మి వచ్చిన డబ్బుతో ఒడిశా నుంచి గంజాయి,వీడ్ ఆయిల్ కొనుగోలు చేసి నల్గొండకు తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి కళాశాల విద్యార్థులు,యువతను లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది.ప్రధాన నిందితులు గతంలో కూడా పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఖమ్మం,నకిరేకల్, నల్గొండ ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడి,వాటిని గంజాయి కొనుగోలుకు వినియోగించినట్లు గుర్తించారు.అలాగే తమ అక్రమ వ్యాపారానికి అడ్డొచ్చే వారిని బెదిరించేందుకు ఒక డమ్మీ తుపాకీ, అవసరమైతే దాడి చేసేందుకు బటన్ చాకును వెంట తీసుకెళ్లేవారని పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనపై నల్గొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.కింద చీఫూరా చట్టంలోని సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.ఈ కేసును ఛేదించిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు ముత్తయ్య, సంపత్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు గడువులోగా పూర్తి చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 25 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ఎలాంటి కఠిన పరిస్థితులనైనా తట్టుకుని నిలబడగల సామర్థ్యం ఉన్న పంటల్లో ఆయిల్‌పామ్ ఒకటని, దానిని సాగు విస్తరణను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని, ఆయిల్‌పామ్ తాజా గెలలకు మార్కెట్లో మంచి ధర లభిస్తోందన్నారు తెలంగాణ స్టేట్ ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గుచూపుతున్నారని, ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకునేలా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. రైతులు నర్సరీలకు వెళ్లినప్పుడు మొక్కలు అందుబాటులో లేవని చెప్పే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని, రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి, అవసరమైన మేరకు నాణ్యమైన పామాయిల్ మొక్కలను నర్సరీలలో సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాలో, ప్రతి ఆయిల్‌పామ్ విస్తరణ ప్రాంతంలో రైతుల డిమాండ్‌కు అనుగుణంగా మొక్కల ఉత్పత్తి చేపట్టాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ ఎత్తు పెరిగే, తక్కువ నిడివి గల ఆకులు కలిగి, అధిక దిగుబడులు ఇచ్చే మొలకలను దిగుమతి చేసుకోవాలని సూచించారు. ఈ రకాల మొక్కలు రైతులకు నిర్వహణ సులభతరం చేయడమే కాకుండా అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని అందిస్తాయని తెలిపారు. అదేవిధంగా ఆయిల్‌పామ్ సాగులో కీలకమైన డ్రిప్ ఇరిగేషన్ విషయంలో కూడా ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు సకాలంలో పరికరాలు అందేలా డ్రిప్ కంపెనీలతో సమన్వయం చేసుకోవాలన్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, ఒకే చోట అవసరమైన సేవలు అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ విస్తరణ కార్యక్రమాన్ని కేవలం లక్ష్యాల సాధనగా కాకుండా రైతుల ఆదాయాన్ని పెంచే ఉద్యమంగా అధికారులు భావించాలని పేర్కొన్నారు. నర్సరీల నుంచి క్షేత్రస్థాయి వరకు ప్రతి దశలో నాణ్యత, పారదర్శకత, వేగం ఉండాలని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లా కల్లూరు గూడెంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు సంబంధించిన మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. టీజీ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మెగా ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను కూడా వేగవంతం చేయాలన్నారు. విజయ హైదరాబాద్ బ్రాండ్ వంటనూనెల విక్రయాలను పెంపొందించే దిశగా మార్కెట్ విస్తరణ, విస్తృత ప్రచార కార్యక్రమాలు, విక్రయ ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని సూచించారు. ఆన్ లైన్ పోర్టల్ ద్వారానే అమ్మకాలు, కొనుగోలు నిర్వహించాలని, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినేస్ వారితో సంప్రదించి మార్కెటింగ్ విభాగాన్ని బలోపేతం చేయాలని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 25 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోహెన్స్ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ విద్య, నైపుణ్యాభివృద్ధి కూడా ఎంతో అవసరమని అన్నారు.భవిష్యత్తులో పోటీ ప్రపంచానికి తగిన విధంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల అంకితభావం వల్ల ఈ విద్యా సంవత్సరంలో ఒక్క ఈ పాఠశాలలోనే 121 మంది కొత్త విద్యార్థులు చేరగా, జిల్లా వ్యాప్తంగా సుమారు 10113 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని తెలిపారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, బయట ఆహారం తినకుండా ఇంటి భోజనం లేదా పాఠశాలలో అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు.ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువులోనూ రాణించగలరని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కోసం రూ.10 లక్షల నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కోహెన్స్ సిఎస్ఆర్ ఆధ్వర్యంలో కుడకుడ జడ్పీ హైస్కూల్, చివ్వెంల సోషల్ వెల్ఫేర్ పాఠశాల, పెన్ పహాడ్ జెడ్పిహెచ్ఎస్, ఆత్మకూర్ (ఎస్) జెడ్పిహెచ్ఎస్ తదితర పాఠశాలలకు కంప్యూటర్ ల్యాబ్ లను అందించారు.ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, పాఠశాల జీహెచ్ఎం గోలి పద్మ, ఎంఈవో శేషగాని శ్రీనివాస్, కోహెన్స్ ప్రతినిధులు వెంకటరమణ, దుస్సా సైదులు, వలి, రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్

**రాజాపూర్, జూలై 25 (జనంసా) :** రాజాపూర్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కలెక్టర్ కుష్బూ గుప్తా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావిధానంపై, పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్ వసతులు కల్పించి, ప్రతి ఒక్కరు బీదా, ధనిక తేడా లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో నే చదువుకునే విధంగా విద్యాలయాలు ఏర్పాటు అవుతాయని



అన్నారు. హైదరాబాద్ లో చదువుతున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కుమారుడు హితేష్ రెడ్డి,అతని స్నేహితులు కలిసి కంప్యూటర్లను తమ పాకెట్ మనీ తో అందజేసినందుకు, ఆ చిన్నారులను కలెక్టర్ కుష్బూ గుప్తా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ, తహసీల్దార్ రాధాకృష్ణ, స్థానిక సర్పంచ్ రామాకృష్ణ, శశికళా రెడ్డి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు బాధ్యతతో విధులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 25 (జనంసాక్షి) :** వైద్యులు బాధ్యతతో విధులు నిర్వహిస్తూ సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.శనివారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఆర్ఎంఓ డాక్టర్ ఉపేందర్‌తో కలిసి గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జెవిడిఎస్.ప్రసాద్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, సూర్యాపేట సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, ఆర్ఎంఓలతో వెబ్ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో శస్త్రచికిత్సలు, వైద్య సేవలు మెరుగ్గా జరుగుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. పైథాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల అభివృద్ధి, అత్యవసర ఖర్చుల నిమిత్తం రూ.10 లక్షల చెక్కును అందజేశారు.డాక్టర్లు, సిబ్బంది అందరూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు.రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓర్పుతో విని సకాలంలో చికిత్స అందించాలని ఆదేశించారు.ప్రతి విభాగాధిపతి తమ విభాగాల్లో సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన పరీక్షలు, చికిత్సలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మరింత మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు.ఈ వెబెక్స్ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాల హెచ్‌వోడీలు, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

## నల్గొండను సూపర్ సిటీగా తీర్చిదిద్దుతాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్గొండ, జూలై 25 (జనం సాక్షి) :** నల్గొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సూపర్ సిటీగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని మర్రిగూడ జంక్షన్ వద్ద నామ్ రోడ్డుపై రూ.65 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ ఫ్లైఓవర్ల తరహాలో మర్రిగూడ ఫ్లైఓవర్‌ను ఆకర్షణీయంగా పెయింటింగ్స్, ఆర్ట్స్, ప్రముఖుల చిత్రాలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఫ్లైఓవర్ వద్ద పేర్లు, దిశలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.ఫ్లైఓవర్ నిర్మాణంతో రోడ్డు ప్రమాదాలు తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యం కూడా తగ్గుతాయని మంత్రి పేర్కొన్నారు. నల్గొండ పట్టణ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.750 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డుకు ఆమోదం లభించిందని గుర్తు చేశారు. చర్లపల్లి, మర్రిగూడెం తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధికి రూ.300 కోట్ల ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు.రైల్వే ట్రాక్ వద్ద మరో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా నష్టపరిహారం చెల్లించినట్లు చెప్పారు. ఇటీవల తాగునీటి పథకానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని, అదనంగా రూ.290 కోట్ల మంజూరుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.నల్గొండ నియోజకవర్గంలో డబుల్ రోడ్ల నిర్మాణంతో పాటు అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, బ్రాహ్మణ వెల్లెముల వద్ద మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధి, బక్కతాయికుంట పనులకు రూ.7 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పట్టణానికి అవసరమైన అదనపు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా హ్యాం రోడ్లను డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని, నల్గొండ--దేవరకొండ నాలుగు లైన్ల హ్యాం రోడ్డుకు ఇప్పటికే శంకుస్థాపన జరిగిందని మంత్రి పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో కూడా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, కార్పొరేటర్ పెరిక స్వాతి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడిని తట్టుకునే పంటల వైపు రైతులు ఆలోచన చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జూలై 25 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి ఏకకాలంలో జిల్లా పోలీసు సిబ్బంది 1500 మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై, మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ చెట్లు, అడవులు పెంచడం వల్ల పర్యావరణ రక్షణకు, సమృద్ధిగా వర్షాలు కురవడానికి ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్కను మహా వృక్షంలా ఎదిగేలా బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతల విధులతో పాటు సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా నమోదు అవుతుందని, నీటి ఎద్దడిని తట్టుకొని పండే పంటలవైపు రైతులు ఆలోచన చేయాలని అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అనేక ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి శాంతి భద్రతల రక్షణలో నిరంతరంగా కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా ఎస్పీ కృషి చేస్తున్నారని, జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ క్యాంటీన్, పరేడ్ గ్రౌండ్, జిమ్ లాంటి వసతులు ఏర్పాటు చేశారని, ఆహ్లాదకరమైన వాతావరణ కల్పన కోసం మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు.అనంతరంజిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒకేసారి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం జరిగిందని అన్నారు.జిల్లా పోలీసు శాఖ అధ్వర్యంలో అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో పోలీస్ వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతున్నారని అన్నారు.శాంతి భద్రతల పరరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో



అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, రవి, నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డీసీఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, సిఐలు రాజశేఖర్, వెంకటయ్య ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, సాయిరాం, రాజశేఖర్, కె.అశోక్, అన్వర్, అఖిల్, ఎస్ఐలు యాదవేందర్, మహేష్, మౌనిక,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# స్మార్ట్‌ఫోన్లు మరింత భారం

## ప్రాసెసర్ ధరలు పెంచనున్న క్వాల్‌కామ్!

ప్రముఖ కంపెనీలు ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతుండటంతో సెమికండక్టర్ విభాగానికి డిమాండ్ పెరుగుతోంది. అదే స్థాయిలో మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో ప్రపంచ టెక్ కంపెనీలు తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. యాపిల్, శాంసంగ్ వంటి పలు కంపెనీలు ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలను పెంచేశాయి. ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ తైవాన్ సెమికండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్ఎంసీ) కూడా చిప్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కస్టమర్‌గా ఉన్న శాన్‌డియోగో కంపెనీ క్వాల్‌కామ్ కూడా తన ప్రాసెసర్ ధరలను రెండంకెల శాతానికి పెంచుతుండటం గమనార్హం దీంతో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల ధరలు మరింత ప్రియమయ్యే అవకాశం ఉంది. వ్యయ ధరల పెరుగుదల కారణంగా క్వాల్‌కామ్ తన ప్రాసెసర్ ధరలను పెంచనున్నట్లు కొన్ని అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఖర్చుల భారాన్ని ఇకపై మోయలేమని కంపెనీ పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై క్వాల్‌కామ్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ ధరలు మండిపోతున్నాయి. క్రమంగా టీఎస్ఎంసీ, క్వాల్‌కామ్ కూడా తమ ఉత్పత్తుల ధరలను పెంచితే ఫోన్లు, ల్యాప్‌టాప్ ధరలు మరింత భారంగా మారనున్నాయి. కాగా, శాంసంగ్, షావోమి, వన్‌ప్లస్, మోటోరోలా వంటి పలు కంపెనీలకు తన ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.

## మారుతీ బ్రెజాలో కొత్త వెర్షన్

దిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా తన ఎస్‌యూవీ మోడల్ బ్రెజాలో కొత్త వెర్షన్‌ను తీసుకొచ్చింది. దీని పరిచయ ధర రూ.7.4 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. సరికొత్త 1.0 లీటర్ డైరెక్ట్ ఇంజెక్షన్ టర్బో పెట్రోల్ ఇంజిన్, ప్రాచుర్యం పొందిన 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌లతో 6 స్పీడ్ మ్యాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు 6 స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తోనూ ఈ కారు లభ్యమవుతుంది. సీఎన్‌జీ వెర్షన్‌కూ ఇదే ఇంజిన్ ఉంటుంది. 16 అంగుళాల డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్, 360 డిగ్రీల కెమెరా వంటి ఫీచర్లు ఈ కారుకు ఉన్నాయి. తమ అమ్మకాలు పెరిగేందుకు ఈ ఎస్‌యూవీ దోహదపడుతుందని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి తెలిపారు.

# నష్టాల్లోనే సూచీలు

**5 రోజుల్లో సెన్సెక్స్‌కు 2092 పాయింట్ల నష్టం**

**ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,893 కోట్లు**

**డీఐఐ కొనుగోళ్లు: రూ.5,454 కోట్లు**



సూచీల నష్టాలు వరుసగా అయిదో రోజుకు చేరాయి. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతలకు తోడు అమెరికా తాజా వాణిజ్య సుంకాలపై ఆందోళనలు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. శుక్రవారం నాడు సెన్సెక్స్ 332 పాయింట్లు, నిఫ్టీ 102 పాయింట్లు నష్టపోయాయి. గత 5 ట్రేడింగ్ రోజుల్లో కలిపి సెన్సెక్స్ 2091.68 పాయింట్లు, నిఫ్టీ 566.85 పాయింట్ల చొప్పున కుదేలయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 20 పైసలు పెరిగి 96.53 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 4.32% నష్టంతో 96.30 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ శుక్రవారం రూ.1.04 లక్షల కోట్లు తగ్గి రూ.475.69 లక్షల కోట్ల (4.93 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సోమ, మంగళవారాల్లో సూచీలు తగ్గినా, కంపెనీల మార్కెట్ విలువ పెరిగింది. మిగతా 3 రోజుల్లో తగ్గింది. గత శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీల మార్కెట్ విలువ రూ.480.92 లక్షల కోట్లు కాగా.. ఈ 5 రోజుల్లో కలిపి రూ.5.23 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. సెన్సెక్స్ ఉదయం 683 పాయింట్ల నష్టంతో (క్రితం ముగింపు 76,391.39తో పోల్చితే) 75,708.19 వద్ద ప్రారంభమైంది. ప్రారంభ ట్రేడింగ్‌లో 75,474.43 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిన సూచీ, అనంతరం స్వల్పంగా కోలుకుంది. చివరకు 331.62 పాయింట్ల నష్టంతో 76,059.77 దగ్గర ముగిసింది. నిఫ్టీ 102.15 పాయింట్లు తగ్గి 23,767.45 దగ్గర స్థిరపడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టాలు నమోదుచేశాయి. బజాజ్ ఫైనాన్స్ 2.58%, ఎటర్నల్ 2.34%, ఎం అండ్ ఎం 2.10%, భారతీ ఎయిర్‌టెల్ 1.66%, ఏషియన్ పెయింట్స్ 1.15% డీలాపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్ 2.08%, ఐటీసీ 0.78%, ట్రెంట్ 0.60%, టీసీఎస్ 0.52% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. వాహన, టెలికాం, విద్యుత్, వినియోగ, చమురు-గ్యాస్, స్థిరాస్తి, లోహ 0.96% వరకు పడ్డాయి. ఫోకస్డ్ ఐటీ 1.30, ఐటీ 0.66%, పీఎస్‌యూ బ్యాంక్ 0.65% పెరిగాయి. జూన్ త్రైమాసికంలో రూ.238 కోట్ల నష్టం నమోదు చేయడంతో ఇండిగో షేరు 0.78% తగ్గి రూ.4,984.95 వద్ద ముగిసింది. త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడంతో ఇన్ఫోసిస్ షేరు 1.03% నష్టంతో రూ.1,040.95 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,402.47 కోట్లు తగ్గి రూ.4.22 లక్షల కోట్లకు చేరింది. అమెరికా సంస్థ ఆర్గానన్‌ను 11.75 బి.డాలర్ల (రూ.11,000 కోట్లు)తో కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనకు, ఆ కంపెనీ వాటాదార్లు అనుమతి ఇచ్చినట్లు సన్‌ఫార్మా తెలిపింది. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించేందుకు నిత్యా జెమ్స్ అండ్ జువెలరీ, ఇంటెలియస్ రీకోడ్‌లకు సెబీ అనుమతి ఇచ్చింది. జునిపెర్ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ జులై 30న ప్రారంభమై ఆగస్టు 3న ముగియనుంది. పూర్తి తాజా షేర్ల జారీ ద్వారా రానున్న ఈ ఐపీఓతో కంపెనీ రూ.1800 కోట్లు సమీకరించనుంది. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ గేమ్స్‌క్రాఫ్ట్‌కు సంబంధించి రూ.1906 కోట్ల విలువైన ఆస్తులను తాజాగా అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది.

క్యాలిబర్ మైనింగ్ షేర్ల శుభారంభం: క్యాలిబర్ మైనింగ్ అండ్ లాజిస్టిక్స్ షేరు ఇష్యూ ధర రూ.424తో పోలిస్తే బీఎస్ఈలో ట్రేడింగ్ 18.86% లాభంతో రూ.504 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.538.15 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 24.64% లాభంతో రూ.528.50 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,455.11 కోట్లుగా నమోదైంది. మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు జులై 17తో ముగిసిన వారానికి 1.08 బి.డాలర్లు (దాదాపు రూ.10,500 కోట్లు) పెరిగి 676.237 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.64.91 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 964 మి.డాలర్లు పెరిగి 675.157 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 4.549 బి.డాలర్లు పెరిగి 551.057 బి.డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 3.48 బి.డాలర్లు తగ్గి 101.749 బి.డాలర్లుగా ఉన్నాయి.


## ఏఐ రంగంపై ప్రజలకు నమ్మకం పోతోంది: సత్యనాదెళ్ల

**న్యూఢిల్లీ:** ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకతకు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

# బ్యాంకులు, బీమా, ఫండ్‌లకూ ఒకే కస్టమర్ ఐడీ!

**న్యూఢిల్లీ:** వినియోగదార్లకు సంబంధించి దేశీయ బ్యాంకులు, బీమా సంస్థలు, మ్యూచువల్‌ఫండ్ సంస్థలు ఒకే కస్టమర్ ఐడీని వినియోగించేందుకు సిద్ధమవుతున్నాయని సమాచారం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ), బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ సంయుక్తంగా చేపట్టిన 'మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి (కేవైసీ) 2.0 నిబంధనావళి అమల్లోకి వస్తే, ఇది సాకారం కానుంది. వినియోగదారులు అనుమతి ఇస్తే చాలు.. కేంద్రీయ రిజిస్ట్రీ నుంచి వారి వివరాలను ఈ సంస్థలు పొందగలవు. అన్నింటికీ ఒకటే ఐడీ సరిపోతుంది. బ్యాంకులు, బీమా సంస్థలు ఆగస్టు నుంచే ఈ నూతన విధానాన్ని అనుసరించనున్నాయని, ఫండ్ సంస్థలు ఈ పద్ధతిలో కాస్త ఆలస్యంగా చేరతాయని చెబుతున్నారు. దేశీయ క్యాపిటల్ మార్కెట్లలోని బ్రోకరేజీ సంస్థలు, ఫండ్‌లు కూడా ఈ ఏడాది చివరికల్లా నూతన విధానాన్ని అందిపుచ్చుకుంటాయని సమాచారం.




# గగనతలం నుంచే నిఘా నేత్రం

## అదానీ-డీఆర్‌డీఓ ఒప్పందం




**న్యూఢిల్లీ:** దేశీయ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ కీలక అడుగు వేసింది. శత్రువుల కదలికలను గగనతలం నుంచే పసిగట్టే అత్యాధునిక 'ఎయిర్ బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్' మార్క్-2 వ్యవస్థల సంయుక్త అభివృద్ధి కోసం అదానీ డిఫెన్స్, రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా 6 ఎయిర్‌బస్ ఏ321 విమానాలను అత్యాధునిక మిషన్ వ్యవస్థలతో తీర్చిదిద్దుతారు. వీటికి దాదాపు 30 ఏళ్లపాటు సమగ్ర లాజిస్టిక్స్, మరమ్మతులు, సాంకేతిక తోడ్పాటును ఈ భాగస్వామ్య సంస్థలే అందిస్తాయి. వీటిని 2032-33 నాటికి వాయుసేనలో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. గగనతల నిఘా పరిధి పెంచడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఈ వ్యవస్థ దోహదం చేయనుంది. బెంగళూరులోని సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్ (సీఏబీఎస్) అభివృద్ధి చేసిన 'నేత్ర' నిఘా వ్యవస్థ విజయవంతం కావడంతో, తయారీకి గత నెలలో తుది అనుమతులు లభించాయి. ఈ స్ఫూర్తితోనే తదుపరి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గగనతలంలో వేల మీటర్ల ఎత్తు నుంచి పర్యవేక్షించే ఈ వ్యవస్థల వల్ల 'సరిహద్దుల్లో తక్కువ ఎత్తులో వచ్చే ముప్పులనూ ముందే పసిగట్టడం' వీలవుతుంది. ఈ సాంకేతికతతో అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, చైనా, స్వీడన్ సరసన భారత్ చేరనుంది.

**స్వదేశీ టర్బోజెట్ ఇంజిన్:**

రక్షణ రంగంలోని హైదరాబాద్ సంస్థ ఆజాద్ ఇంజినీరింగ్, డీఆర్‌డీఓ భాగస్వామ్యంతో కలిసి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఎక్స్‌పెండబుల్ టర్బోజెట్ ఇంజిన్ తయా రు చేసింది. 350 కేజీల థ్రస్ట్ క్లాస్ సామర్థ్యం ఉన్న ఈ ఇంజిన్ డీఆర్‌డీఓ విభాగానికి చెందిన గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్ఈ) రూపకల్పన చేసిం ది. ఆజాద్ ఇంజినీరింగ్ 24 నెలల వ్యవధిలో దీనిని తయారు చేసి, అప్పగించింది. ఈ టర్బోజెట్ ఇంజిన్లను యాంటీ-షిప్ క్షిపణులు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలు, మా నవరహిత వైమానిక వాహనాల తయారీలో వినియోగించనున్నారు.

## రైతులకు అండగా నిలవండి

మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్రమాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

## సారనాథ్‌కు యునెస్కో గుర్తింపు..

సమావేశంలో చారిత్రక క్షేత్రాన్ని ఈ జాబితాలో చేర్చారు. ఈ విషయాన్ని యునెస్కో 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. ఇప్పటివరకు మన దేశంలో 44 నిర్మాణాలకు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌లుగా గుర్తింపు ఉండగా, తాజాగా సారనాథ్ ఆ జాబితాలో చేరడంతో ఆ సంఖ్య 45కి పెరగడం విశేషం. సారనాథ్‌కు యునెస్కో గుర్తింపు లభించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారతీయులందరూ గర్వించాల్సిన క్షణమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. జ్ఞానం, కరుణ, సామరస్యాలకు సంబంధించిన కాలాతీత సందేశంతో ప్రపంచానికి స్ఫూర్తినిచ్చే గౌతమ బుద్ధుడితో సారనాథ్‌కు ఎంతో గాఢమైన బంధం ఉందన్నారు. అలాంటి క్షేత్రానికి అంతర్జాతీయ గుర్తింపు రావడం మన దేశంలో అపారమైన నాగరికత, ఆధ్యాత్మిక వారసత్వాన్ని చాటిచెబుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు సారనాథ్‌ను సందర్శించి బుద్ధుడి ఆదర్శాలతో మమేకమయ్యేలా ఇది ప్రేరేపిస్తుందని పేర్కొన్నారు.




# గ్లోబల్ మార్కెట్‌ల్లో నథింగ్ మూతపడుతోందా?

## కంపెనీ క్లారిటీ

**న్యూఢిల్లీ:** కొన్ని రోజుల్లో ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ నథింగ్.. ప్రపంచవ్యాప్తంగా డజన్‌కు పైగా మార్కెట్లలో మూతపడుతున్నట్లు కొన్ని టెక్ నివేదికలు చేస్తున్న ప్రచారాన్ని కంపెనీ ఖండించింది మరోవైపు, 40 శాతం ఉద్యోగాల కోత చేపట్టనున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చింది. దీనిపై నథింగ్ సహ వ్యవస్థాపకుడు అకిస్ ఎవాంజెలిడిస్ స్పందించారు. అవన్నీ తప్పుడు కథనాలని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. "జపాన్, యూరప్ వంటి పలు గ్లోబల్ మార్కెట్ల నుంచి నథింగ్ వైదొలుగుతున్నట్లు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. అవన్నీ వదంతులే. ఏ మార్కెట్ నుంచి కంపెనీ తప్పుకోవడం లేదు. తదుపరి వృద్ధికి కంపెనీ బృందాలను పునర్నిర్మిస్తున్నాం. ప్రత్యేకంగా ఒక ఏఐ నేటివ్ వ్యాపార యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నాం. ప్రాంతీయ హబ్‌లు మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ మార్పుల్లో భాగంగా కొన్ని ఉద్యోగ స్థాయిలపై ఆ ప్రభావం పడుతుందన్న మాట వాస్తవమే. నిబంధనల ప్రకారం వాటి వివరాలను ప్రస్తుతానికి వెల్లడించలేం" అని ఆయన అన్నారు. కంపనీ తదుపరి యుగాన్ని తీర్చిదిద్దేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని అకిస్ ఎవాంజెలిడిస్ తెలిపారు. టెక్ నివేదికలు పేర్కొన్న స్థాయిలో ఉద్యోగాల తొలగింపులు ఉండబోవని స్పష్టం చేశారు. పరిమిత స్థాయిలోనే ఉద్యోగ కోతలు ఉంటాయని, ప్రభావితమైన సిబ్బందికి అన్ని విధాల అండగా ఉంటామని వెల్లడించారు. మరోవైపు నథింగ్ ఫోన్4(బీ) విక్రయాలు తగ్గినట్టు వస్తున్న వార్తలపై స్పందించారు. విడుదలైన మొదటి రోజే 29,537 యూనిట్లు విక్రయాలు జరిపి, ఆ ధరల సెగ్మెంట్‌లో నథింగ్ ఫోన్4(బీ) రికార్డు సృష్టించిందన్నారు.

## హెచ్-1బీ వీసాలు.. మూడేళ్ల పాటు ఉండవా?

**వాషింగ్టన్:** హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో.. కొత్త హెచ్-1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూడదని కోరారు. 'ఎండ్ హెచ్-1బీ వీసా యాక్ట్' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు. "కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతే గానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్-1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడు తుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుంది" అని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్-1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి.




## దేశం బయటకు టెలికాం డేటా వెళ్లొద్దు

**స్థానికంగానే నిల్వ చేయడం తప్పనిసరి**

**కమ్యూనికేషన్ మౌలిక సంస్థలకు ప్రభుత్వం ఆదేశాలు**

**దిల్లీ:** టెలికాం సేవల కోసం క్లౌడ్ ఆధారిత నెట్‌వర్క్‌లు, మొబైల్ టవర్లు, శాటిలైట్ గేట్‌వే సహా కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలు అందించే సంస్థలు తమ మొత్తం టెలికమ్యూనికేషన్ డేటాను దేశంలోనే నిల్వ చేయడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆ డేటాను దేశం వెలుపలకు పంపడాన్ని నిషేధించింది. 'ప్రతి కొత్త అధీకృత సంస్థ తన టెలికాం నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని వ్యవస్థలు, డేటా, లాగ్స్, సమాచారాన్ని భారత్‌లోనే నిల్వ ఉండేలా చేసుకోవాలి. ఈ డేటా, లాగ్స్, సమాచారం కాపీలను భారత్ వెలుపలకు పంపకూడద'ని తాజా నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023 ఆధారంగా పాత లైసెన్సింగ్ విధానం నుంచి సరళమైన అనుమతుల (ఆథరైజేషన్) వ్యవస్థకు మారింది. మౌలిక సదుపాయాల కల్పన సంస్థలు, డిజిటల్ కనెక్టివిటీ మౌలిక సదుపాయాల సంస్థలు, ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ పాయింట్ ప్రొవైడర్, శాటిలైట్ ఎర్త్ స్టేషన్



గేట్‌వే, క్లౌడ్ హోస్టెడ్ టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్ ప్రొవైడర్, మొబైల్ నంబర్ పోర్టబిలిటీ ప్రొవైడర్లు జాతీయ స్థాయిలో అనుమతుల కోసం ఈ కొత్త విధానం కింద దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనల పాటింపును పర్యవేక్షించే ఉద్దేశంతో టెలికమ్యూనికేషన్ పరికరాలు, నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసిన ప్రదేశాలను, వినియోగదారుడి ప్రాంగణాలను ప్రభుత్వం తనిఖీ చేయొచ్చు. కొత్త సంస్థలు ఏర్పాటు చేసే విధానాలు లేదా వ్యవస్థలను ఆడిట్ చేయొచ్చు. ఇందుకోసం ఒక ఏజెన్సీని నియమించొచ్చు. వినియోగదారుడు లేదా సంస్థల పోటీ స్థానానికి ముప్పు కలిగించే ఎలాంటి సమాచారాన్ని ఆ నియమిత ఏజెన్సీ సేకరించదు లేదా వెల్లడించమని అడగదని నోటిఫికేషన్ తెలిపింది. ప్రజాప్రయోజనాలు, జాతీయ భద్రతా రీత్యా, తక్షణ చర్యలు అవసరమని భావిస్తే.. ఎటువంటి ముందస్తు నోటీసులు కూడా ఆ సంస్థలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన అవసరం లేదు. నెట్‌వర్క్‌ను ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులను పొందడం మౌలిక సదుపాయాల సంస్థలదే బాధ్యత అవుతుంది.

# స్పెయిన్, ఫ్రాన్స్ సరిహద్దుల్లో కార్చిచ్చు

## 2లక్షల మందికి పైగా తరలింపు

**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు సంభవించింది శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ఈ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. ఈ క్రమంలో గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భారీగా మంటలు ఎగిసిపడుతుండటంతో చుట్టుపక్కల దట్టమైన పొగ వ్యాపించింది. ఇప్పటి వరకు దాదాపు 2లక్షల మంది స్థానిక ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఇరుదేశాల అధికారులు వెల్లడించారు. మంటలు ఆర్పడానికి వందల సంఖ్యలో అగ్నిమాపక బృందాలు కృషి చేస్తున్నాయి. రంగంలోకి దిగిన ఫ్రాన్స్ సైన్యం హెలికాప్టర్‌ల నుంచి కొన్ని వేల లీటర్ల నీటిని గుమ్మరిస్తూ.. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తోంది.

కార్చిచ్చును నియంత్రించేందుకు సాయం చేయాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ యూరోపియన్ యూనియన్‌ను కోరారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ సమీపంలో మంటలు తీవ్రంగా




ఎగసిపడుతుండడంతో వాటిని అదుపు చేయడం సాధ్యం కావట్లేదని.. వాతావరణ పరిస్థితుల కారణంగా అడ్డంకులు తప్పట్లేదని అధికారులు పేర్కొన్నారు. ఓ ట్రాక్టర్ డ్రైవర్ శుక్రవారం అటవీ ప్రాంతానికి సమీపంలో అంటించిన మంట కార్చిచ్చుగా మారిందని స్పానిష్ పోలీసులు పేర్కొన్నారు. సైన్యం కూడా సహాయక చర్యల్లో పాల్గొంది. స్పెయిన్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

## అధికారిక లోగో రూపకల్పన పోటీకి ఆహ్వానం




**శేరిలింగంపల్లి, జూలై 25 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ సహకారంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారిక లోగో రూపకల్పన పోటీకి ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. ఈ పోటీలో విద్యార్థులు, ఆర్కిటెక్టులు, గ్రాఫిక్ డిజైనర్లు, విజువల్ ఆర్టిస్టులు మరియు సృజనాత్మక రంగానికి చెందిన నిపుణులు పాల్గొనవచ్చు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అధికారిక గుర్తింపుగా నిలిచే లోగో రూపకల్పనలో భాగస్వాములు కావడానికి ఇది ఒక అరుదైన అవకాశం అని సిఎంసి అధికారులు పేర్కొన్నారు. పాల్గొనేవారు రూపొందించే లోగోలో సుపరిపాలన, సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణ, సమ్మిళిత అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, అందుబాటు మరియు ప్రజల భాగస్వామ్యంవంటి విలువలు ప్రతిబింబించేలా ఉండటంతో పాటు భవిష్యత్‌కు సిద్ధమైన సైబరాబాద్ దృక్పథాన్ని ఆవిష్కరించేలా ఉండాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. లోగో పూర్తిగా మౌలిక రూపకల్పనగా ఉండాలి. ఏఐ, ఈపిఎస్ లేదా ఎస్విజి వెక్టర్ ఫార్మాట్‌కు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అలాగే అధిక నాణ్యత గల పి.ఎన్.జి/ జెపిఈజి ఫైల్‌తో పాటు, గరిష్ఠంగా 250 పదాలలో డిజైన్ తాత్వికత (డిజైన్ ఫిలోసఫీ)ను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో అభ్యర్థి ఒక్క ఎంట్రీని మాత్రమే సమర్పించాలని, కాపీరైట్ ఉల్లంఘన లేదా ఏఐద్వారా నకలుచేసిన డిజైన్లు పరిగణనలోకి తీసుకోబడవని తెలిపారు. లోగో డిజిటల్ మరియు ప్రింట్ వినియోగానికి అనువుగా ఉండాలని, విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందజేయబడతాయని వివరించారు. ప్రథమ బహుమతి 20 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి15 వేల రూపాయలు, తృతీయ బహుమతి 10 వేల రూపాయలు బహుకరించడం జరుగుతుందన్నారు. ఎంట్రీల సమర్పణకు చివరి తేదీ 05 ఆగస్టు 2026 అని, అనంతరం జ్యూరీ మూల్యాంకనం నిర్వహించి ఆగస్టు 10, 2026న విజేతలను ప్రకటిస్తారు. ఎంపికైన అధికారిక లోగోను 15 ఆగస్టు 2026న ఆవిష్కరిస్తామని అధికారులు వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు ప్రకటనలో ఇవ్వబడిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ ఎంట్రీలను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చన్నారు.

# నిరాశ్రయ మహిళల ఆశ్రమాల్లో భద్రత, గౌరవానికి పెద్దపీట

- ఉప్పల్ మహిళా ఆశ్రమాన్ని తనిఖీ చేసిన మల్కాజిగిరి కమిషనర్
- వసతులు, పరిశుభ్రత, భద్రతపై సమగ్ర సమీక్ష
- మౌలిక సదుపాయాల్లో లోటుపాట్లు లేకుండా చర్యలకు ఆదేశం
- ఆశ్రయం అంటే ఆత్మగౌరవం, ఆప్యాయత కల్పించే నిలయమని వ్యాఖ్య



**ఉప్పల్, జూలై 25 (జనంసాక్షి):**
నిరాశ్రయ మహిళలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆశ్రయ కేంద్రాలు కేవలం తాత్కాలిక నివాసాలుగా కాకుండా, గౌరవం, భద్రత, సంరక్షణ, ఆత్మీయత కల్పించే సురక్షిత కేంద్రాలుగా తీర్చిదిద్దాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉప్పల్ మార్కెట్ సమీపంలోని పట్టణ నిరాశ్రయుల మహిళా ఆశ్రమాన్ని సందర్శించి అక్కడి వసతులు, నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆశ్రమంలోని నివాస గదులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతతో పాటు మొత్తం నిర్వహణ తీరును సమీక్షించారు. ఆశ్రమంలో నివసిస్తున్న మహిళలకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని, తాగునీరు, స్నానాల గదులు, మరుగుదొడ్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.
ఆశ్రమంలో నివసించే ప్రతి మహిళకు పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని కమిషనర్ స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అవసరమైతే భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఆహారం, తాగునీరు, ఆరోగ్య పరిరక్షణ వంటి ప్రాథమిక సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, నివాసితుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. నిరాశ్రయ మహిళలను కేవలం ఆశ్రయం పొందుతున్న వారిగా కాకుండా, సమాజంలో గౌరవంగా జీవించే హక్కు కలిగిన వ్యక్తులుగా చూడాలని కమిషనర్ పేర్కొన్నారు. వారికి ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంపొందించే వాతావరణాన్ని కల్పించాలని, మానవతా దృక్పథంతో సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఆశ్రయం అంటే కేవలం తలదాచుకునే పైకప్పు మాత్రమే కాదని, భద్రత, సంరక్షణ, ఆప్యాయత, గౌరవం అందించే నిలయంగా ఉండాలని అన్నారు. మహిళల సంక్షేమం, రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న కమిషనర్, ఆశ్రమాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు, అదనపు సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆశ్రమంలో గుర్తించిన సమస్యలను వేగంగా పరిష్కరించి, ప్రతి నిరాశ్రయ మహిళకు భద్రత, గౌరవంతో కూడిన జీవన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# నాయి బ్రాహ్మణులు అదనపు వసూల్

**నాయి బ్రాహ్మణులకు ప్రతి టిక్కటిపై రూ 30 కమిషన్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడలో స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు తమ మొక్కుబడులైన తలనీలాలు కళ్యాణ కట్టలో సమర్పించుకోవడం ఆనవాయితీ. స్వామివారికి తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చిన హారిక అనే భక్తురాలు శుక్రవారం కళ్యాణకట్ట లోని బుకింగ్ కౌంటరులో రూ 50 టిక్కెట్టు తీసుకొని కుమారుడి తలనీలాలు సమర్పించేందుకు నాయి బ్రాహ్మణులు వద్దకు రాగా అదనపు డబ్బులు డిమాండ్ చేశారని బాధితురాలు హారిక తన ఆవేదనను వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో ఈ విషయం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టికెట్ ధర రూ 50 అని బోర్డులు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ వారు మాత్రం భక్తుల వద్ద డబ్బులు డిమాండ్ ఆపడం లేదు. నాయి బ్రాహ్మణులకు ఒక టిక్కెట్ పై ఆలయం నుండి రూ 30 కమిషన్ ఇస్తున్నప్పటికీ, భక్తుల వద్ద అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారు. గతంలో అధికారులు ఎన్నిసార్లు కౌన్సిలింగ్ ఇచ్చినా నాయి బ్రాహ్మణుల తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదని స్థానికులు, భక్తులు మండిపడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులను ఈ విధంగా దోచుకోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఆలయ ఉన్నతాధికారులు స్పందించి, పై కళ్యాణకట్టలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో 70 వ్యాయామశాలలకు రెజ్లింగ్ మ్యాట్లు పంపిణీ

- జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ట్రాక్, షూస్, రవాణా ఖర్చులు భరిస్తా



**సంజీవరెడ్డినగర్, జూలై 25 (జనంసాక్షి) :** రెజ్లర్లకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. శనివారం అమీర్‌పేటలోని మున్సిపల్ స్టేడియంలో తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని 70 వ్యాయామశాలల నిర్వాహకులకు రెజ్లింగ్ మ్యాట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. రెజ్లింగ్‌ను కుస్తీ పోటీలుగా, రామాయణ, మహాభారత కాలంలో మల్లయుద్ధంగా పిలిచేవారని తెలిపారు. సుమారు 5 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కుస్తీ పోటీలను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కుస్తీపై ఉన్న అభిమానంతో అనేకమంది వారసత్వంగా ఈ క్రీడలో శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 150 మంది రెజ్లర్లు వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతున్నారని, వారికి అవసరమైన ట్రాక్‌సూట్లు, షూస్‌తో పాటు రవాణా ఖర్చులను తన జీవితకాలం పాటు అందిస్తానని తలసాని ప్రకటించారు. వ్యాయామశాలల్లో సరైన సౌకర్యాలు లేక రెజ్లర్లు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికీ పలువురు మట్టిలోనే కుస్తీ పోటీలకు ప్రాక్టీస్ చేస్తున్నారని తెలిపారు.
రెజ్లర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 70 వ్యాయామశాలలకు ఒక్కో వ్యాయామశాలకు 10 చొప్పున రెజ్లింగ్ మ్యాట్లను అందజేస్తున్నట్లు చెప్పారు. వ్యాయామశాలల అభివృద్ధితో పాటు రెజ్లర్లకు మరింత చేయూత అందించేలా భవిష్యత్‌లో అనేక కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రెజ్లర్లకు, వ్యాయామశాలలకు ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
అనంతరం కార్యక్రమానికి సహకరించిన దాతలను తలసాని శ్రీనివాస్ యాదవ్ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, దాతలు కొలన్ భూపాల్ రెడ్డి, మామిడి బాల్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ సింగ్, రంగనాథ్, రాజు, బీఆర్ఎస్ పార్టీ పద్మారావునగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, అమీర్‌పేట అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం, రమేష్ గౌడ్, వనం శ్రీనివాస్, గోపిలాల్ చౌహాన్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# హాలిడే ప్యాకేజీల పేరిట భారీ మోసం.. 15 మంది అరెస్ట్

- 19 మంది బాధితుల గుర్తింపు.. రూ.22 లక్షల మోసం వెలుగులోకి
- ఉచిత గిఫ్ట్ వోచర్లతో వల వేసి లక్షలు వసూలు చేసిన ముఠా
- రాడిసన్ హోటల్‌కు పిలిచి సభ్యత్వాల పేరుతో డబ్బుల దోపిడీ
- ఇలాంటి ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక



**శేరిలింగంపల్లి, జూలై 25 (జనంసాక్షి):** హాలిడే ట్రిప్పులు, ఉచిత గిఫ్ట్ వోచర్లు, ఆకర్షణీయ సభ్యత్వ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ముఠాను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే 19 మంది బాధితులను గుర్తించగా, రూ.22 లక్షల మేర మోసం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో సంస్థకు చెందిన 15 మందిని అదుపులోకి తీసుకుని పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సైబరాబాద్ పోలీసు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. న్యూఢిల్లీకి చెందిన 'ది పసిఫిక్ హాలిడే వరల్డ్-ఫోర్ ఆర్ సీజన్స్ హాలిడేస్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో రాకేష్ కుమార్, మహమ్మద్ రిహాన్ అక్తర్, అబ్దుల్ రషీద్, రామ్ సింగ్ ధామి డైరెక్టర్లుగా గచ్చిబౌలి ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లోని షాపింగ్ మాల్స్, కమర్షియల్ సెంటర్ల వద్దకు వెళ్లి వినియోగదారులను ఉచిత కూపన్లు, గిఫ్ట్ వోచర్లు ఇస్తామని ఆకర్షించి వారి ఫోన్ నంబర్లు సేకరించేవారు.
తర్వాత బాధితులను శేరిలింగంపల్లి పరిధిలోని రాడిసన్ హోటల్‌కు ఆహ్వానించి, రూ.1.25 లక్షలు చెల్లిస్తే ఐదేళ్లపాటు దేశంలోని పర్యాటక ప్రాంతాల్లో ఏడురాత్రులు బస సౌకర్యం, మరింత మొత్తాన్ని చెల్లిస్తే పదేళ్లపాటు దేశ, విదేశాల్లో ప్రతి ఏడాది ఏడురాత్రుల హాలిడే సౌకర్యం కల్పిస్తామని నమ్మబలికి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 24న పుట్టూరి స్వరాజ్ అనే బాధితుడు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేస్తూ, జూలై 16న రాడిసన్ హోటల్‌కు పిలిచి సంస్థ ప్రతినిధులు తన నుంచి రూ.3.40 లక్షలు వసూలు చేసి, తర్వాత ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా ఫోన్‌లకు స్పందించడం మానేశారని పేర్కొన్నారు.
తనతో పాటు మరికొందరినీ అదే విధంగా మోసం చేసినట్లు ఫిర్యాదులో వెల్లడించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సంస్థకు చెందిన 15 మందిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో షాపింగ్ మాల్స్‌కు వచ్చే వినియోగదారులను ప్రలోభాలకు గురిచేసి డబ్బులు వసూలు చేసిన విషయాన్ని వారు అంగీకరించినట్లు తెలిపారు. దర్యాప్తులో ఇప్పటివరకు 19 మంది బాధితులను గుర్తించి, రూ.22 లక్షల మేర మోసం జరిగినట్లు నిర్ధారించినట్లు వెల్లడించారు.
అరెస్టు అయిన వారిలో మహమ్మద్ ఆకిఫ్, శివం శర్మ, షాను కుమార్, సంతోష్ కుమార్, పీయూష్, జయ్ సింగాల్, అపర్ణ చౌహాన్, శుభం శుక్లా, మోహిత్ చౌహాన్, హిమాన్షి నిగమ్, ఆనక్ అగర్వాల్, ఆయుష్ బాజ్‌పాయ్, అమిత్, ప్రణవ్ పాండే, ప్రశాంత్ కుమార్ కిరణ్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు పోలీసులు పలు సూచనలు చేశారు. ఉచిత గిఫ్ట్ వోచర్లు, హాలిడే ప్యాకేజీలు, భారీ డిస్కౌంట్ల పేరుతో వచ్చే ఆఫర్లను గుడ్డిగా నమ్మవద్దని, సంస్థల విశ్వసనీయతను ముందుగానే పరిశీలించాలని సూచించారు. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# సిఎంసి పరిధిలో వాక్ ఫ్రీ స్పెషల్ డ్రైవ్

**మొత్తం14 ప్రాంతాల్లో 347 ఆక్రమణల తొలగింపు**




**శేరిలింగంపల్లి, జూలై 25 (జనంసాక్షి) :**
ప్రజల సౌకర్యార్థం రోడ్ల కిరువైపులా నిర్మించిన ఫుట్ పాతులపై అడ్డంకులు లేని స్వేచ్ఛ తో కూడిన రహదారులు మరియు ప్రజా ప్రదేశాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న "వాక్ ఫ్రీ" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 14 గుర్తించిన ప్రాంతాల్లో మొత్తం 18.8 కిలోమీటర్ల మేర చర్యలు చేపట్టి, 347 ఆక్రమణలను సిఎంసి తొలగించారు. జోన్ ల వారీగా చేపట్టిన చర్యలు శేరిలింగంపల్లి జోన్ లిమిట్స్ లో మొత్తం 8.3 కిలోమీటర్ల పరిధిలో డ్రైవ్ నిర్వహించి 123 ఆక్రమణలను తొలగించగా పటాన్‌చెరు సర్కిల్ పరిధిలో - 15, అమీన్‌పూర్ - 27, మియాపూర్ పరిధిలో - 30, శేరిలింగంపల్లి - 15, మాధాపూర్‌లో - 36 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. కాగా కూకట్‌పల్లి జోన్ పరిధిలో మొత్తం 3.5 కిలోమీటర్ల నిడివిలో 93 ఆక్రమణలను తొలగించగా అందులో మాధాపూర్ సర్కిల్‌లో - 36, ఆల్విన్ కాలనీ - 15, కూకట్‌పల్లి - 20, మూసాపేట్ సర్కిల్ పరిధిలో - 22 ఆక్రమణలను కూల్చివేసినట్లు జోన్ అధికారులు వివరించారు. ఇక కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో మొత్తం 7 కిలోమీటర్ల పరిధిలో 167 ఆక్రమణలను తొలగించగా చింతల్ - 25, జీడిమెట్ల - 28, కొంపల్లి - 34, నిజాంపేట్ - 34, దుండిగల్ - 15 తొలగించగా మేడ్చల్ సర్కిల్ పరిధిలో 31 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన మాట్లాడుతూ 'వాక్ ఫ్రీ' కార్యక్రమంద్వారా పాదచారులకు సురక్షితమైన, ఆక్రమణలులేని ఫుట్‌పాత్‌లు మరియు ప్రజా ప్రదేశాలను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలను తొలగించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పునరావృతమయ్యే ఆక్రమణలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజల సహకారంతో ప్రతి శనివారం 'వాక్ ఫ్రీ' కార్యక్రమాన్ని కార్పొరేషన్ పరిధిలోని అన్ని జోన్లలో నిరంతరం కొనసాగిస్తూ, రహదారులు, ఫుట్‌పాత్‌లు మరియు ప్రజా ప్రదేశాలను ఆక్రమణలనుంచి విముక్తంచేసి పరిశుభ్రమైన, సురక్షితమైన మరియు పాదచారులకు అనుకూలమైన నగర వాతావరణాన్ని కల్పించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# బీజేపీ నాయకులపై కాంగ్రెస్ వ్యక్తుల దాడిని ఖండిస్తున్నాం

- అధికార కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తూ పోలీస్ వ్యవస్థ వ్యవహరించిన తీరు సరికాదు
- బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి



**వికారాబాద్ జూలై 25 (జనంసాక్షి):**
వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, వికారాబాద్ జిల్లా బీజేపీ పార్టీ మాజీ అధ్యక్షులు, రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచే వికారాబాద్ జిల్లాలో బీజేపీ నాయకులను హౌస్ అరెస్టు చేసి, వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించిన పోలీసుల తీరును ఆయన తప్పుబట్టారు. అదే రోజు సాయంత్రం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను ఉరితాడుతో వేలాడదీస్తూ ఊరేగించిన ఘటనను పోలీసులు చూస్తూ ఉండడం బాధాకరమని అన్నారు. చౌరస్తాలో టీ తాగుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆ ఘటనను గమనించి, ప్రధానమంత్రి దిష్టిబొమ్మను ఉరితీయడం, దహనం చేయడాన్ని ఆపడానికి వెళ్లగా, కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తులు వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. ప్రస్తుతం గాయపడిన నాయకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి గాయపడిన వారికి ఏవైనా నష్టం జరిగితే అందుకు వికారాబాద్ పోలీస్ వ్యవస్థ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తున్నట్లు వ్యవహరిస్తున్న పోలీసుల తీరు సరికాదని విమర్శించారు. రాబోయే రెండేళ్లలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని పేర్కొంటూ, అధికారంలో ఎవరు ఉన్నారో వారికే అనుకూలంగా వ్యవహరించే ధోరణిని ప్రభుత్వ యంత్రాంగం పోలీస్ వ్యవస్థ మానుకోవాలని సూచించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దింటి నవీన్ కుమార్, బీజేపీ వికారాబాద్ జిల్లా మీడియా కన్వీనర్ మోహన్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ రాఘవేందర్, జిల్లా కోశాధికారి హన్మంతు రెడ్డి, మెడికల్ సెల్ జిల్లా నాయకురాలు డాక్టర్ స్వప్న, ధార్మిక్ సెల్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ ప్రవీణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రాములు, అనంతగిరి సేవా సమితి సభ్యులు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో విత్తన మేళాలు

## జిల్లా వ్యవసాయ అధికారి సుజాత

**రంగారెడ్డి, జూలై 25 (జనంసాక్షి) :** ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాలో రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలు, కూరగాయల సాగు వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా వ్యవసాయ అధికారి సుజాత తెలిపారు. ఈ మేరకు జిల్లా, మండల స్థాయిల్లో రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించి, కంటింజెన్సీ ప్రణాళికను రూపొందించిందన్నారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను సులభంగా కొనుగోలు చేసుకునేందుకు జూలై 27, 28, 29 తేదీల్లో అన్ని మండలాల రైతు వేదికలలో విత్తన మేళాలు నిర్వహించనున్నామని తెలిపారు. అందువల్ల జిల్లాలోని రైతులు ఈ విత్తన మేళాలకు పెద్ద సంఖ్యలో హాజరై, తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలమైన పంటల విత్తనాలను కొనుగోలు చేసి, ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# వర్షాల కోసం... వరద పాశం

**మర్పల్లి జూలై 25 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి గుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో వరద పాషాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని రైతుల కళ్ళలో సంతోషం గా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
వ్యవసాయ దారిక ప్రాంతమైన మర్పల్లి మండలం రైతుల భవిష్యత్తు వర్షాలపైనే ఆధారపడి ఉందని వారు పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పశుసంపదనకు మేత తాగునీటి కొడత లేకుండా ఉండాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని వేడుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# విద్యార్థుల ఉద్యమంతో దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం

- కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- రాజీవ్ చౌక్ నుండి కార్ఖానగడ్డ గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో కాంగ్రెస్ నాయకుల శాంతి ర్యాలీ




**కరీంనగర్ బ్యూరో, జూలై 25 (జనంసాక్షి) :**
కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేసినప్పటికిని ఆమోదం పొందే వరకు, విద్యార్థుల పెండింగ్ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అమరులైన విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ చౌక్ నుండి కార్ఖానా గడ్డలోని గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలి చాలా రాజేంద్ర రావు, సూడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉట్కూరు నరేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్య లతోపాటు పలువురు నాయకులు క్యాండిల్స్ తో ర్యాలీ చేయడం జరిగింది. వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థుల ఉద్యమానికి దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలు, విద్యార్థుల ప్రజాస్వామ్య ఉద్యమాలకు దిగివచ్చిన ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో, విద్యార్థుల ఉద్యమాలకు సపోర్టుగా ఉన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఉద్యమాన్ని సవాలుగా తీసుకొని నేడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రతిపక్షాలు బిజెపి ప్రభుత్వంపై తిరగబడుతున్న సందర్భంలో మోడీ ప్రభుత్వం దిగివచ్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో నైతికంగా విద్యార్థుల ఉద్యమం గెలిచిందని, దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలకు మద్దతుగా ఏఐసీసీ, పిసిసి ఇచ్చిన పిలుపుమేరకు రాజీవ్ గాంధీ చౌక్ నుండి మహాత్మా గాంధీ చౌక్ వరకు శాంతియుతంగా క్యాండిల్ ర్యాలీ చేయడం జరిగిందన్నారు. ఈ నిరసన ర్యాలీ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున రాజేందర్, గడ్డం విలాస్ రెడ్డి, మడుపు మోహన్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, కర్ర రాజశేఖర్, పర్వత మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, నునావత్ భాస్కర్ నాయక్, సిహెచ్ బుచ్చిరెడ్డి, సరిల్ల ప్రసాద్, వరాల నర్సింగ్గం, కల్ల పెల్లి బాలరాజు, గుండాటి శ్రీనివాస్ రెడ్డి,వంగల విద్యాసాగర్, గడప అజయ్, ముస్తాక్, విక్రం, మూల రవీందర్ రెడ్డి, జల్లోజు శ్రీనివాస్, అబ్దుల్ రెహమాన్, కుంభాల రాజు కుమార్, ఇమ్రాన్, వసీం, కిమ్ పహాద్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం నాసిరకం పనులతో ప్రజలకు ప్రాణ భయం

**నిజాంపేట్ జూలై 25 జనం సాక్షి :**
రోడ్డు పనుల నాసిరకం పనులతో పాటు సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తో వర్షాకాలంలో మళ్లీ నాలాలో ఎవరు కొట్టుకుపోతారో అంటూ ప్రజలు బిక్కు బిక్కు మంటూ భయభ్రాంతులకు గురవుతున్నారని, ఏ ఒక్క నాలా సైతం నిర్మాణపు పనులు అస్తవ్యస్తంతో పాటు మ్యాన్యువల్స్ లేకుండా నిర్లక్ష్య పనులు కొనసాగిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతాలలో రోడ్ లను సిపిఐ నాయకులు పరిశీలించారు ముఖ్యంగా నిజాంపేట్ రాజీవ్ గృహ కల్ప నుంచి డబుల్ బెడ్ రూమ్ వెళ్లే దారిలో డ్రైనేజ్ పై మూత లేకపోవడం వల్ల అటుగా వెళ్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి వచ్చిన సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని పెట్టి రోడ్లు, డ్రైనేజ్ పైపు లైన్ నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులు చేయిస్తున్న చూస్తున్నారని, ప్రజలు ఓవైపు ఆవేదన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. గతంలో ఎన్ఆర్ఐ కాలనీలో ఇదే డ్రైనేజ్ కాలవలో పడి ఒక నాలుగు సంవత్సరాల బాలుడు మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే అయినా అధికారులు మొద్దు నిద్ర విడడం లేదు అని గుర్తు చేశారు. అలాగే ఇంద్రన్న కాలనీ లో కూడా డ్రైనేజ్ మూత ఓపెన్ అయి ఉంది. కనుక వర్ష కాలనీ దృష్టిలో పెట్టుకొని వెంటనే అన్ని డ్రైనేజ్ ల పై మూతలు వేయాలని, నిర్లక్ష్యంతో పట్టించుకోకుండ ఇలాంటి నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు సదానందం పై అధికారులు క్రిమినల్ కేసులు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, నర్సింగ్, రాజు, సురేష్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రజనీ ఫెర్టిలిటీలో వరల్డ్ ఐవీఎఫ్ డే

- ఉత్తర తెలంగాణలో తొలి అత్యాధునిక సెమన్ అనలైజర్ ప్రారంభం
- ప్రతి నెల తొలి శుక్రవారం 30 మంది దంపతులకు ఉచిత సెకండ్ ఒపీనియన్
- రూ.5 వేల విలువైన పరీక్షలు రూ.1,500కే ప్రత్యేక ఆఫర్
- సంతానలేమి నివారణలో ఆధునిక వైద్య సేవలే లక్ష్యమన్న నిపుణులు



**కరీంనగర్, జూలై 25 (జనంసాక్షి):** ఉత్తర తెలంగాణలో సంతానలేమి చికిత్సకు అత్యాధునిక వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో శనివారం వరల్డ్ ఐవీఎఫ్ డేను ఘనంగా నిర్వహించారు. రెనే వైద్య సంస్థల అధినేత ప్రొఫెసర్ డా. బంగారి స్వామి, సీనియర్ ఇన్ఫర్టిలిటీ స్పెషలిస్ట్ డా. బంగారి రజనీ ప్రియదర్శిని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక "సెమన్ అనలైజర్" పరికరాన్ని ప్రారంభించారు. ఇలాంటి పరికరాలు తెలంగాణలో రెండే ఉన్నాయని, ఉత్తర తెలంగాణలో తొలిసారిగా ఈ సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చామని వారు తెలిపారు. వైద్య రంగంలో నూతన సాంకేతికతను ప్రజలకు చేరవేయడంలో తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. డా. బంగారి రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ సంతానలేమి సమస్యతో బాధపడుతున్న అనేక మంది దంపతులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందినా సందేహాలు, అనుమానాలతో తమను సంప్రదిస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి సరైన వైద్య సలహా అందించేందుకు "హోప్ ప్రోగ్రామ్" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి నెల తొలి శుక్రవారం 30 మంది దంపతులకు కన్సల్టేషన్ ఫీజు లేకుండా ఉచితంగా సెకండ్ ఒపీనియన్ అందించి, వారు తెచ్చుకున్న వైద్య నివేదికలను పరిశీలించి సమగ్ర సలహాలు ఇస్తామని చెప్పారు. సంతాన సాఫల్యం కోసం తమ వైద్య బృందం అంకితభావంతో పనిచేస్తోందని, ఈ కార్యక్రమాన్ని అర్హులైన దంపతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరల్డ్ ఐవీఎఫ్ డే సందర్భంగా జూలై 25 నుంచి 31 వరకు ప్రత్యేక రాయితీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాధారణంగా సుమారు రూ.5 వేల విలువ చేసే 3డీ అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఏఎంహెచ్ పరీక్ష, సెమెన్ అనాలసిస్ పరీక్షలను కేవలం రూ.1,500కే అందిస్తున్నట్లు వెల్లడించారు. సంతానలేమి సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే విజయావకాశాలు మరింత మెరుగుపడతాయని వైద్యులు వివరించారు.

కార్యక్రమంలో స్త్రీల వైద్య నిపుణులు డా. సుమ చంద్రిక, డా. భవ్య రెడ్డి, ఎంబ్రియాలజిస్ట్ డా. రాజేందర్, జనరల్ ఫిజీషియన్లు డా. నిఖిల్ లక్ష్మణ్, డా. వినాయక్ గౌరిశెట్టి, సీనియర్ ఛాతీ వైద్య నిపుణులు డా. రవీంద్రాచారి, సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ డా. రాజేంద్ర ప్రసాద్, వైద్యులు డా. సుమ, డా. సాయిశ్రీ, డా. సంధ్య, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, బయోమెడికల్ ఇంజనీర్ రతన్ కొదాటి, నాగుల ప్రఫుల్, అడ్మిన్ సిబ్బంది స్నేహ బోయిని, రమ, నీరజతో పాటు ఆస్పత్రి సిబ్బంది, సుమారు 150 మంది పేషెంట్లు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ,నిబద్ధతతో ప్రజల మన్ననలను పొందేలా పని చేయాలి

- విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ మహేష్ బిగితే



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 25 (జనం సాక్షి);** క్రమశిక్షణ,నిబద్ధతతో ప్రజల మన్ననలను పొందేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది పని చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ అవరణలోని పరేడ్ మైదానంలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ ,సివిల్,హోమ్ గార్డ్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్ కి జిల్లా ఎస్పీ హాజరై గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్ ప్రదర్శనని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రతిరోజు కనీసం అరగంట నడక చేయడం, బయట ఆహారాన్ని వీలైనంత వరకు నివారించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఎస్పీ సూచించారు.వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి క్రమశిక్షణ, యూనిటీగా ఉండడం, ఫిజికల్ ఫిట్నెస్‌కి ఉపయోగపడుతుందన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందేలాగా పనిచేస్తూ పోలీస్ శాఖకి, జిల్లాకి మంచి పేరు తెచ్చేలాగా పని చేయాలని అన్నారు.విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని, సిబ్బందికి ఏదైనా సమస్య వుంటే ఎప్పుడైనా తనను కలుసుకొని తమ సమస్యను తెలియజేవచ్చాన్నారు.ఈ పరేడ్‌లో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు మధుకర్, సురేష్, రమేష్, ఆర్ఎస్ఐలు రాజు,శ్రవణ్ యాదవ్, దిలీప్, సాయి కిరణ్, ఆర్మ్డ్ సిబ్బంది, సివిల్ సిబ్బంది,హోమ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువు శిఖం భూమిపై కబ్జా ఆరోపణలు

- కొత్తగట్టు రామ్ చెరువు పరిరక్షణకు చర్యలు కోరిన ముదిరాజ్ సంఘం
- అక్రమ మట్టి పూడికతో నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటోందని ఆందోళన
- డీఈఈకి లిఖితపూర్వక ఫిర్యాదు
- కబ్జాలు తొలగించకపోతే ఆందోళనకు హెచ్చరిక



**శంకరపట్నం, జూలై 25 (జనంసాక్షి):** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని సర్వే నంబర్ 377 పరిధిలో ఉన్న రామ్ చెరువు శిఖం భూమిని కొందరు అక్రమంగా మట్టితో పూడ్చి కబ్జా చేస్తున్నారని ముదిరాజ్ సంఘం సభ్యులు ఆరోపించారు. ఈ అక్రమాల వల్ల చెరువు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతుండటంతో పాటు వర్షపు నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులు భూగర్భ జలాల పెరుగుదల, సాగునీటి అవసరాలు, మత్స్యకారుల జీవనాధారానికి కీలకమని పేర్కొన్నా రు. శిఖం భూమిని మట్టితో పూడ్చి సాగుభూమిగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి చర్యలు కొనసాగితే భవిష్యత్‌లో చెరువు ఆనవాళ్లు కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు మండల అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో జిల్లా నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) నవీన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రామ్ చెరువు శిఖం భూమిని వెంటనే సర్వే చేసి అక్రమ కబ్జాలను తొలగించాలని, చెరువు హద్దులను పరిరక్షిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం సభ్యులు అధికారులను కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమా లు చేపడతామని హెచ్చరించారు.

# జాతీయ ఎస్సీ కమిషన్ ద్వారా అధికారులకు నోటీసులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 25 (జనంసాక్షి) :** వేములవాడ భీమేశ్వర ఆలయం వద్ద దళిత బీజేపీ కౌన్సిలర్ ముత్యం నిర్వహిస్తున్న షాపు కూల్చివేత వ్యవహారం ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ లకు గురువారం నోటీసులు జారీ చేశారు.అయన షాపు కూల్చివేతకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు ఈ ఘటనపై తీసుకున్న చర్యలను 15 రోజుల్లోగా సమగ్ర నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బాధితుడు ముత్యం మాట్లాడుతు తన జీవనోపాధి కోసం భీమేశ్వర్ ఆలయం ప్రాంతంలో నిర్వహిస్తున్న షాపును ఆలయ సిబ్బంది కూల్చివేశారన్నారు.తాను దళితుడిననే కారణంతోనే కక్షపూరితంగా తన షాపును లక్ష్యంగా చేసుకుని కూల్చివేశారని అయన ఆరోపించారు.ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక పోలీసులు స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20న జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించడంతో ఫిర్యాదును పరిశీలించిన కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేస్తూ 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారన్నారు.

# బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఉప వైద్యాధికారి డా. ముస్కు జైపాల్ రెడ్డి

**మెట్ పల్లి, జూలై 25(జనం సాక్షి) :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెంకట్రావుపేట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డా. ముస్కు జైపాల్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు (హెల్త్ స్క్రీనింగ్) నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానం, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అలాగే, చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిన సరైన పద్ధతులను (హ్యాండ్ వాష్ టెక్నిక్స్) విద్యార్థినులకు ప్రదర్శించి, భోజనానికి ముందు మరుగుదొడ్డి వినియోగం అనంతరం తప్పనిసరిగా చేతులు కడుక్కోవడం వల్ల అనేక అంటువ్యాధులను నివారించవచ్చన్నారు ఈ తనిఖీలో భాగంగా మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డితో కలిసి పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి పాఠశాల యాజమాన్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించి విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యవంతమైన విద్యార్థులే దేశ భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందాన్నారు.

# సూపరింటెండెంట్ హైదరాబాద్‌లో ఉంటే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి?

- గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య
- వైద్యులు, మందులు, మౌలిక వసతుల కొరతపై ఆందోళన
- సూపరింటెండెంట్ స్థానికంగా ఉండాలని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్
- సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదని ప్రభుత్వానికి హెచ్చరిక




**గోదావరిఖని, జూలై 25 (జనంసాక్షి):**
గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఆయన, వివిధ వార్డులను పరిశీలించి ఆర్ఎంఓ ఇన్‌చార్జి కృపాబాయ్‌తో ఆస్పత్రిలోని మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భద్రత, పేషెంట్ కేర్ సిబ్బంది సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ హైదరాబాద్‌లో ఉంటే గోదావరిఖని ఆస్పత్రి సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. మూడు జిల్లాల నుంచి రోజూ సుమారు 1,500 మందికి పైగా రోగులు ఈ ఆస్పత్రికి వస్తున్నప్పటికీ, వారికి తగిన వసతులు లేవని అన్నారు. రోగుల సహాయకులకు కనీస బాత్‌రూమ్ సౌకర్యాలు కూడా లేవని, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని కోరారు.
సింగరేణి ప్రాంతంలో దుమ్ము, కాలుష్యం కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు అధికంగా ఉన్నప్పటికీ నెఫ్రాలజిస్టు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఆస్పత్రిలో ఎంఆర్ఐ సౌకర్యం కూడా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 250 మంది వైద్యులు ఉండాల్సిన చోట దాదాపు 100 మంది వైద్యుల కొరత ఉందని, ఉన్నతాధికారుల పోస్టుల్లో కూడా 13కు గాను ఐదు మాత్రమే భర్తీ అయ్యాయని తెలిపారు. అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.నర్సుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని, 350 మంది నర్సులకు ఒకే బాత్‌రూమ్ ఉండటం, ప్రతి అంతస్తులో ఒక చిన్న విశ్రాంతి గది మాత్రమే ఉండి అందులో ఒక్క బెడ్ మాత్రమే ఉండటం విచారకరమన్నారు. పనిచేయని లిఫ్ట్‌ల వల్ల రోగులను పై అంతస్తులకు తరలించడం కష్టంగా మారిందని, వాటిని వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. తాగునీటి ఫ్రిజ్ పనిచేయకపోవడం, ఏఎన్‌సీ స్కానింగ్ విభాగంలో మంచినీటి సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు.
పేషెంట్ కేర్, శానిటేషన్, భద్రతా సిబ్బందికి ప్రతి 15 రోజులకు డ్యూటీలు మార్చడం సరైన విధానం కాదని, వారానికోసారి డ్యూటీలు మార్చాలని సూచించారు. రాష్ట్రంలో అన్నీ బాగున్నాయని చెప్పడం సరిపోదని, పేద ప్రజలు ఆశ్రయించే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, మందులు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ. ముత్యం రావు, వేల్పుల కుమారస్వామి, ఎం. రామాచారి, సీనియర్ నాయకులు టి. రాజారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎన్. బిక్షపతి, ఎం. శ్రీనివాస్, జి. జ్యోతి, శైలజ, శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం

- అప్పుడు రైతులు, ఇప్పుడు విద్యార్థుల పోరాటాలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం
- హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్



**హుజురాబాద్, జులై 25 (జనంసాక్షి) :** నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంలో విద్యార్థులు మొదటి నుండి డిమాండ్ చేస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ కు కేంద్రం తలొగ్గిందని, నీట్ పరీక్ష లీకేజీ దగ్గరి నుండి జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. విద్యార్థుల పక్షాన పోరాటం చేసిన రాహుల్ గాంధీ వారి న్యాయమైన డిమాండ్ లను పరిష్కారం చేయాలని జంగు సైరన్ లేపారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటన చేశారు. మూడు ప్రధాన డిమాండ్ల తో ప్రధాని ఇంటి ముందు ధర్నా చేసిన రాహుల్ వాటిని అమలు చేయాల్సిందిగా పార్లమెంట్ సాక్షిగా రాజ్యసభ, లోక్ సభలో చర్చకు పట్టుబట్టారు. ఎట్టి పరిస్థితుల్లో కేంద్రం ఈ విషయంలో తలొగ్గేలా చేశారు. దేశంలో ఏ ప్రతిపక్ష నాయకుడు చేయని విధంగా ప్రధాని ఇంటి ముందు మెరుపు స్థాయిలో ధర్నా చేయడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దానికి ప్రధాని సోషల్ మీడియా వేదికగా లీకేజీల వ్యవహారంలో చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అప్పుడు రైతుల విషయంలో ఇదే విధానాన్ని కొనసాగించిన కేంద్రం రైతుల ఉద్యమానికి తలొగ్గి ప్రవేశ పెట్టిన చట్టాలను వెనక్కి తీసుకుంది. విద్యార్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి భేషజాలు లేవని విద్యార్థుల ప్రయోజనాలే మాకు ముఖ్యమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేస్తామని వొడితల ప్రణవ్ తెలిపారు.

## దేశంలో దొంగలు పడ్డట్లు
# సింగరేణిలో పడ్డారు

కూనంనేని సాంబశివరావు



**గోదావరిఖని, జులై 25 (జనంసాక్షి) :** దేశంలో దొంగలు పడ్డట్లు సింగరేణి లో ఆదాని, అంబానీల రూపంలో సింగరేణి లో పడ్డారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు అన్నారు. గోదావరిఖని జి.ఎం ఆఫీస్ గ్రౌండ్‌లో జరిగిన సింగరేణి కార్మికుల కవాతు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ సింగరేణి ఎనభై ఏండ్ల చరిత్ర కలిగిన సంఘం ఏఐటియుసి అని దీని లో కొనసాగడానికి కార్మిక వర్గం గర్వపడాలని అన్నారు.గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్లమెంటులో ప్రవేశ పెట్టిన ఎంఎండిఆర్ చట్టం వల్ల సింగరేణికి కొత్త గనులు రాకుండా పోయిందని దీనికి అనుకూలంగా పార్లమెంటులో ఆనాడు టిఆర్ఎస్ ఎంపి కవిత తదితరులు ఓటు వేసారని ఆయన ఆరోపించారు. అటువంటి సంఘానికి నేడు కార్మికుల గురించి,ఏఐటియుసి గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన ఘాటుగా విమర్శించారు.గోదావరిఖనిలో జరుగుతున్న కార్మికుల కవాతు ద్వారా కార్మిక వర్గ ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం వల్ల సింగరేణికి కొత్త గనులు రావడం లేదని ఆయన అన్నారు.కార్మికుల హక్కుల సాధన కోసం 31 డిమాండ్‌లతో సమ్మె నోటీసు ఇచ్చామని, దీనిపై ఈ నెల 28 న చర్చలు జరగనున్నాయని, ఒక వేళ చర్చలు విఫలమైన పక్షంలో ఆర్ఎల్‌సి నుండి ఫెయిల్యూర్ రిపోర్ట్ తీసుకొని ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా సమ్మె లోకి వెళ్తామని,ఈ సమ్మె ను విజయవంతం చేయడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ మాట్లాడగా నాయకులు వై.వి.రావు, వీరభద్రం, కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, గంధం సాంబశివరావు, మందల రాంచంద్రారెడ్డి, సిపిఐ నాయకులు గౌతం గోవర్ధన్, కే.కనకరాజ్, కార్పొరేటర్ సూర్య, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంఎ గౌస్, వర్కర్స్ యూనియన్ నాయకు లు విజయలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు కన్నం లక్ష్మి నారాయణ, క్రాంతికిరణ్‌పాల్గొన్నారు. ఈ కవాతు కార్యక్రమానికి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఆహ్వానం పలికారు.అంతకు ముందు అమరజీవి మాదిరెడ్డి భాస్కర్‌రావు విగ్రహంకు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించి, ప్రదర్శనగా జిఎం కాలనీ గ్రౌండ్‌కు వచ్చారు.కవాతులో ఆర్జీ.వన్,టూ,త్రీ బ్రాంచిల ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సభా కార్యక్రమానికి ముందు కళాకారులు ఎజ్జ రాజయ్య, చీకటి అంజన్న, వై.లెనిన్ కార్మిక గేయాలు ఆలపించారు.



*మే చివరి వారంలోగా లాభాలను అధికారికంగా ప్రకటించాలని ప్రతి ఆర్థిక సంవత్సరం కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి.ఈ డిమాండ్‌ను సింగరేణి యాజమాన్యం పెడచెవిన పెడుతుందనే అభిప్రాయం కార్మిక వర్గాల్లో ఉంది.జూన్‌లోనే లాభాల వాటాను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలనె డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. అలా చేస్తే లాభాలు తగ్గాయా? ఖర్చులు పెరిగాయా? అనే వివరాలను కార్మికులకు తెలుస్తుంది.'ఇళ్లల్లో పిల్లల ఫీజులు, పెళ్లిళ్లు జూన్‌లోనే ఉంటాయి.ఆ సమయానికి డబ్బు అందక ఇబ్బంది పడుతున్నారు.ప్రతి యేటా జాప్యం చేయడం సరికాదు అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.*

## లాభాల వాటా కోసం.. సింగరేణి
# కార్మికుల పడిగాపులు

- ప్రతిసారి ఇదేతంతూ..ఇదే జాప్యం
- ఆలస్యంపై కార్మికుల్లో అసహనం

**గోదావరిఖని, జులై 25 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ (సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్) యాజమాన్యం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటాను ఇప్పటివరకు ప్రకటించకపోవడంతో కార్మికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.ప్రతియేటా ఇదే విధంగా వ్యవహరిస్తున్న సింగరేణి యాజమాన్యంపై కార్మికులు గుర్రుగా ఉన్నారు.గత ఆర్థిక సంవత్సరం లాభాల ఆచూకీ లేకపోవడంతో 'ప్రతి ఏడాది ఇదే తంతు'అంటూ కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. సింగరేణిలో మార్చితో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది.సాధారణంగా మే నెలలోనే డైరెక్టర్ల బోర్డు సమావేశంలో వార్షిక లాభనష్టాలను ఆమోదించి ప్రకటిస్తారు.ఆ తర్వాత జాప్యం చేస్తూ..చేస్తూ..ఉత్పత్తి,ఉత్పాదకత ఆధారంగా కార్మికులకు 'లాభాల్లో వాటా' చెల్లిస్తున్నారు.
కానీ గత కొన్నేళ్లుగా టైంకు రావాల్సిన వాటా ఆలస్యమవుతోంది..
యాజమాన్య వర్గాల నుండి అధికారిక ప్రకటన ఇంత వరకు రాలేదు. అయితే అంతర్గతంగా చెబుతున్న కారణాలు ఎన్నో ఉన్నాయి.కోల్ ఇండియాతో పోలిస్తే ధర ఎక్కువ ఉండటంతో సింగరేణి బొగ్గు అమ్మకాలు తగ్గాయి.దీంతో లాభాలు ఎంత ఉన్నాయనే లెక్కలు తేలడంలో జాప్యం జరుగుతుందనేది ఒక కారణం కాగా,కార్మికుల వేతనాలు,సంక్షేమ పథకాలు, యంత్రాల నిర్వహణ ఖర్చు పెరగడం,వార్షిక ఆడిట్ పూర్తి కాకపోవడం వల్ల బోర్డు ఆమోదం ఆలస్యం అవుతుందనేది మరో కారణంగా చెబుతున్నారు.లాభాల వాటా అనేది కేవలం బోనస్ కాదు, కార్మికుల కష్టానికి గుర్తింపు అని సంఘాల వాదన.ప్రతి ఏటా ఇదే రీతిలో ఆలస్యం చేయడంపై కార్మికులు సోషల్ మీడియా, గ్రూపుల్లో తీవ్రంగా స్పందిస్తున్నారు.గుర్తింపు సంఘం 'లాభాల వాటా జాప్యం కొనసాగితే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం' అని హెచ్చరిస్తుంది.ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడంపై సింగరేణి దృష్టి పెట్టినా, కార్మికుల్లో విశ్వాసం నిలబెట్టుకోవాలంటే లాభాల ప్రకటన, వాటా పంపిణీలో పారదర్శకత, సమయపాలన తప్పనిసరి.జులై నెల మరో వారంలో ముగుస్తుంది. యాజమాన్యం త్వరలోనే ప్రకటన చేసి కార్మికుల అసంతృప్తిని తగ్గిస్తుందా? లేదా మరింత ఆలస్యం చేస్తుందా? అనేది వేచి చూడాలి.



# ఎస్ఐఆర్ పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలి

### నియోజకవర్గ ఇన్చార్జి అయేషా ఫాతిమా ఆమెర్

**బోధన్, జూలై 25 (జనంసాక్షి) :** ఎస్ఐఆర్ పూర్తయ్యేంతవరకు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్చార్జి ఆయేషా ఫాతిమా ఆమెర్ స్పష్టం చేశారు. శనివారం బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ స్వగృహంలో బోధన్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయినంతవరకు అప్రమత్తంగా ఉండాలని అర్హులైన ఏ ఒక్కరి ఓటు పోకుండా జాగ్రత్త పడాలన్నారు. అర్హులైన వారి ఓటర్లను కార్యకర్తలు దగ్గరుండి ఓటు నమోదు చేయాలని ఆమె స్పష్టం చేశారు. డిజిటల్ పూర్తి అయిన తర్వాత నోటీసులు ఇచ్చే దశ నుండి చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా టిఆర్ఎస్ ఇన్చార్జి వీజీ గౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్న విఠల్, జిల్లా కోఆర్డినేటర్ సుమిత్ర, బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, రూరల్, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట్ మండలాల అధ్యక్షులు సంజీవ్, నర్సన్న, శ్రీరామ్, భూమారెడ్డి, నర్సింగ్ రావు, కౌన్సిలర్లు ముషీర్ బాబా, ముబీన్, అజర్, లక్ష్మి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ వసతి గృహాల ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అధికారి



**మంథని, జూలై 25, (జనంసాక్షి):** జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్ శనివారం మంథని పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కాలేజీ బాయ్స్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలో ఉంటున్న విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, తాగునీరు, పరిశుభ్రత, వసతి సౌకర్యాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, బిల్లులతో సహా పలు రికార్డులను పరిశీలించారు. వసతి గృహాల్లో ఎలాంటి లోపాలు లేకుండా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సకాలంలో అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారులు తిరుపతి, రమేష్ లకు తగు సూచనలు చేశారు. నాణ్యమైన ఆహారం, క్రమం తప్పకుండా మెనూ పాటించాలని, విద్యార్థుల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని ఆదేశించారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం రాకుండా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రవీందర్ సూచించారు.

# కేంద్రమంత్రి రిజైన్ చేస్తే సరిపోదు..

- భవిష్యత్‌లో పేపర్ లీకేజీలు జరగకుండా సంస్కరణలు తేవాలి
- కంటితుడుపు చర్యలు కాదు.. విద్యార్థులకు నిజమైన న్యాయం జరగాలి..
- విద్యార్థులపై దమనకాండకు దిగిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి..
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత..



**ముషీరాబాద్, జులై 25 (జనం సాక్షి):** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ఎట్టకేలకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయటంపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పందించారు. విద్యార్థుల ప్రొటెస్ట్ కారణంగానే కేంద్రమంత్రి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేవలం కేంద్ర మంత్రి రిజైన్ చేస్తే సరిపోదని కవిత ఎక్స్ లో పోస్ట్ చేశారు. పేపర్ లీకేజీ సంక్షోభాలకు ఇది ఎంత మాత్రం పరిష్కారం కాదన్నారు. కేవలం బీజేపీకి జరిగిన డ్యామేజ్ కంట్రోల్ చేసుకునేందుకే కేంద్రమంత్రి తో రాజీనామా చేయించారని చెప్పారు. విద్యార్థులకు నిజంగా న్యాయం జరగాలంటే మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవస్థాగత సంస్కరణల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఖూజ తరహాలోనే చీూకు కూడా చట్టబద్ధమైన స్వతంత్రత ఇవ్వాలన్నారు. భవిష్యత్ లో పేపర్ లీకేజీలను అరికట్టేందుకు అత్యంత కఠినమైన చట్టాలను తీసుకురావాలని కవిత కోరారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలన్నారు. వీటన్నింటికి తోడు ఈనెల 20న విద్యార్థులపై పాశవికంగా పోలీసులు జరిపిన దమనకాండపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లాఠీఛార్జ్ కు కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. అప్పుడు మాత్రమే విద్యార్థులకు జరిగిన అన్యాయానికి న్యాయం జరుగుతుందని చెప్పారు. కేవలం కేంద్రమంత్రితో రాజీనామా చేయించి కంటితుడుపు చర్యలు చేపడతామంటే ఊరుకునేది లేదని కవిత హెచ్చరించారు.

# నాగన్న పాట ప్రజా ఉద్యమానికి దిక్సూచి

- ప్రముఖ సంపాదకులు కవి రచయిత సతీష్ చందర్
- నాగన్న స్ఫూర్తితో కమ్యూనిస్టులు ఐక్యం కావాలి : సినీ నటుడు ఆర్ నారాయణ మూర్తి





**ముషీరాబాద్ (జనంసాక్షి) :** నాగన్న పాట ప్రజా ఉద్యమానికి దిక్సూచి అని ప్రముఖ సంపాదకులు కవి రచయిత సతీష్ చందర్ అన్నారు. అరుణోదయ నాగన్న సంతాప సభ హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పి వేణు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సంతాప సభలో ప్రముఖ సంపాదకులు కవి రచయిత సతీష్ చందర్ మాట్లాడుతూ అరుణోదయ నాగన్న గొప్ప గాయకుడిగా తన స్వరం ద్వారా దేశంలోని పీడిత ప్రజల కష్టాలని గానం చేసిన అద్భుత గాయకుడు అన్నారు. బాల్యం నుండే కష్టాల కడలిలో ఈదుతూ, నాయకులు చెమట చుక్కలను గానం చేసిన నాగన్న నేటి తరం కళాకారులకు, గాయకులకు పూర్తి దాయకమైందన్నారు. నాగన్న గాయకుడి కంటే ముందు కమ్యూనిస్టుగా మారి తన జీవితాన్నే విప్లవానికి, ప్రధానంగా ప్రజా సాంస్కృతి ఉద్యమానికి అంకితం చేసిన చరిత్రలో నిలిచిపోతాడన్నారు. మేడం దేశమంతా మనువాద కాషాయ పాలన జరుగుతున్న సందర్భంలో నాగన్న లాంటి గాయకుడు లేకపోవడం తీవ్ర నష్టదాయకమైనదన్నాడు. నాగన్న స్ఫూర్తితో ప్రజా సాహిత్య ఉద్యమానికి నడుము నడుం బిగించాలన్నారు.

సినీ నటుడు ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ కష్టజీవిలా అభ్యున్నతని సంక్షేమాన్ని కోరుతూ అరుణోదయ నాగన్న తన జీవితాంతం కృషిచేసిన నాగన్న స్ఫూర్తిగా దేశంలోని కమ్యూనిస్టులంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందని కోరారు. ఈ సంతాప సభ సందర్భంగా నాగన్నపై రాసిన పాటల ఒక పాటల పుస్తకం, నాగన్నపల్లె వ్యాపారం కూడిన 350 పేజీల మరో పుస్తకాన్ని రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సంతాప సభలో ఏఐకేఎంఎస్ ఆల్ ఇండియా అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య, సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చలపతిరావు, సాదినేని వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ వినయ్ బాబు, లెల్లె సురేష్, పసునూరి రవీందర్, జిలకర శ్రీనివాస్, యోజన, యశ్ పల్, భూపతి వెంకటేశ్వర్లు, ఉదయగిరి, ఆవునూరి మధు, జి ఝాన్సీ, నాగరాజు, పరకాల అజయ్ కే.గోవర్ధన్, విమలక్క పల్లె నరసింహ కోటి పరకాల లక్ష్మి మాట్లాడారు.

## అలరించిన కళారూపాలు

అరుణోదయ హైదరాబాద్ నగర శాఖ నాగన్న పై అద్భుతమైన డిజిటల్ కళారూపాన్ని ప్రదర్శించారు. లెల్లె సురేష్ రచించిన ఈ కళా దృశ్యం పాట మానవ జీవితంలో వహించిన ప్రాముఖ్యతను వివరించింది. రాష్ట్ర అరుణోదయ బృందం నాగన్న జీవితంపై ఒగ్గు కథను ప్రదర్శించింది. సైదులు,వేణు, ఇడంపాక శ్రీశైలం, చెప్పిన ఈ ఒగ్గుకథ నాగన్న జీవితాన్ని గొప్పగా వివరించింది. అలాగే న్యూ డెమోక్రసీ ఛానల్ వారు వివిధ దృశ్యాలతో రూపొందించిన చిత్రాలలో డాక్యుమెంటరీ ని రూపొందించారు ఛానల్ ప్రతినిధులు ఉదయ్, ప్రిన్స్ లో దీని రూపొందించారు. ఈ సంతాప సభలో ఇంకా ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ప్రజాకవి జయరాజు ప్రకృతి వైద్యులు టి.వెంకన్న తదితరులు మాట్లాడారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఈ సభకు ముందు కళారూపాలతో బాగ్‌లింగంపల్లిలో ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బతుకుల రాజన్న మంచిర్యాల మల్లన్న,ఇడంపాక శ్రీశైలం, కోల స్వప్న, బొగ్గారపు వెంకన్న, సహాయ కార్యదర్శులు, ఎనగంటి చిరంజీవి, కచనపల్లి సైదులు, కోశాధికారి ఇట్టబోయిన రవి, కార్యవర్గ సభ్యులు సమ్మన్న కిషన్, కొండల్, గుర్రం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వసతుల్లేక యూనివర్సిటీలో సెమినార్ నిర్వహించలేకపోతున్నాం

- జాతీయ సెమినార్ నిర్వహణపై వర్సిటీ అధికారుల ప్రెస్‌మీట్
- విద్యార్థులు అభిప్రాయాలను ఖాతరు చేయని వీసీ, రిజిస్ట్రార్
- ఆందోళనకు సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాలు



**మహబూబ్ నగర్ ప్రతినిధి జూలై 25(జనం సాక్షి):** పాలమూరు యూనివర్సిటీ లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన జాతీయ సదస్సు ను అధికారులు తమ ఏకపక్ష నిర్ణయం తో రంగారెడ్డి జిల్లాకు తరలించడం తో విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. ఈ విషయమై వర్సిటీ అధికారులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి శ్రీనివాస్ మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించాలనుకున్న జాతీయ సదస్సును రంగారెడ్డి జిల్లా కన్హా శాంతివనంలో నిర్వహిస్తున్నామని అయన తెలిపారు. ఆగస్టు 7, 8 తేదీల్లో నిర్వహించే ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా ఉన్న వీసీ, ప్రొఫసర్స్ కేంద్ర విద్యాశాఖ మంత్రి. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతున్నారని, ఇలాంటి పెద్ద జాతీయ సదస్సు నిర్వహణ అవకాశం పాలమూరు యూనివర్సిటీకి రావడం చాలా గర్వకారణమన్నారు. ఈ సెమినార్ లో వివిధ కంపెనీల ఒప్పందాలు కుదుర్చుకునేందుకు అవకాశం ఉందని అన్నారు . ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు కమిటీల ను ఏర్పాటు చేశామని అయన వెల్లడించారు . విద్యార్థి సంఘాల ఆందోళనతో జరిగేదేమి లేదని , రాజకీయ ఒత్తిళ్లేమీ లేవని కార్యక్రమాన్ని అక్కడే నిర్వహించేందుకు మేము సిద్ధమయ్యామని వారు తెలిపారు. ఈ సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్ బాబు కన్వెనర్ మధుసూదన్ రెడ్డి, ప్రవీణ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 వరకు లక్ష ఇంకుడు గుంతలు పూర్తి చేయాలి

- లక్ష్యాన్ని సాధించిన అధికారులకి సీఎం చేతుల మీదుగా సన్మానం
- ఆగస్టు 7 నుంచి జిల్లాల్లో రివ్యూలు చేస్తా
- వీబీ జీరాంజీలో ఉన్న 318 పనులను గుర్తించి మొదలు పెట్టాలి
- తెలంగాణ జలసిరి పనుల్లో వేగం పెంచాలి
- మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూలై 25 (జనంసాక్షి) :** ఆగస్టు 15వ తేదీలోపు రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని అత్యుత్తమంగా సాధించిన అధికారులు, గ్రామ పంచాయతీలు, ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానిస్తామని తెలిపారు. ఇది కేవలం లక్ష్య సాధన కాదని, రాష్ట్ర భవిష్యత్ జల సంరక్షణకు బలమైన పునాది వేయడమేనని పేర్కొన్నారు. ఆగస్టు 7వ తేదీ నుంచి జిల్లాల వారీగా స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులను బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి సోమ, మంగళ, బుధవారాల్లో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి, వీబీ జీ రాంజీ పరిధిలో ఉన్న 318 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించి వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామసభలే అభివృద్ధి కార్యాచరణకు కేంద్ర బిందువుగా ఉండాలని అన్నారు. తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊటకుంటు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాల వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో పనుల అమలు, పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కోసం మిషన్ భగీరథ ఏఈ, పంచాయతీరాజ్ ఏఈ, ఎంపీడీఓ, ఏపీఓ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఈ కమిటీ ప్రతి పనిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. శనివారం సచివాలయం నుంచి స్పెషల్ సీఎస్ దానకిషోర్, కమీషన్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమీషనర్ శ్రీలక్ష్మీ లతో కలిసి మంత్రి సీతక్క జిల్లా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, సీఈవోలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీబీ జీ రాం జీ అమలు, తెలంగాణ జలసిరి పనులు, జీపీ ఎస్‌ఏపీ రూపకల్పనపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితు లను సమర్థవంతంగా ఎదుర్కొనేం దుకు వీబీ జీ రాం జీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో మరింత వేగవంతంగా అమలు చేయాలని, తెలంగాణ జలసిరి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణగా గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను శాస్త్రీయంగా రూపొందించాలని సూచించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడం అత్యంత ప్రాధాన్యమని అన్నారు.

# ధర్మేంద్ర రాజీనామా యువత విజయం

- మాజీ మంత్రి హరీష్‌రావు



**హైదరాబాద్,జులై 25 (జనంసాక్షి) :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో సీజీపీ తోపాటు విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తలొగ్గుతూ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజీపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పందించారు. తాజా సందర్భాన్ని దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయంగా హరీశ్ రావు అభివర్ణించారు.. సామాజిక దృక్పథంలో వస్తున్న మార్పు నిజంగానే కనిపిస్తోంది. విద్యార్థులందరికీ అభినందనలు.. అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ గొప్ప దేశంలోని విద్యార్థులు, యువత, 'జెన్-జెడ్' టీంకు అభినందనలు. ఈ విజయం మీదే. మీకు మా మద్దతును అందించినందుకు సంతోషంగా ఉంది.. అంటూ బీఆర్ఎస్ పార్టీ ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం

- బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**న్యూఢిల్లీ, జులై 25 (జనంసాక్షి) :** ప్రశ్నాపత్రం లీక్ కావడానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదుల విజయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ , ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కాక్రోచ్ సైన్యాన్ని చూసి దేశం గర్వపడుతున్నదని, విద్యార్థులు,యువత ఆగ్రహించి పోరుబాట పడితే,అది ఏ స్థాయిలో ఉంటుందో యావత్ ప్రపంచం మరోసారి చూసిందని పేర్కొన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా, బెదిరించినా, భయపెట్టినా, నిర్బంధాలు ప్రయోగించినా, లాఠీలెత్తినా, దేశద్రోహులు,సంఘ విద్రోహులు అని ముద్రవేసినా కూడా యువత వెనుకంజ వేయకుండా ఉద్యమించిందని అన్నారు. విద్యార్థుల పోరాటంలో న్యాయం ఉందని, ధర్మమైనదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. విద్యార్థుల ధర్మమైన ఆగ్రహావేశాలకు పార్లమెంట్ గేట్లు కూడా మూసేయాల్సిన పరిస్థితి తలెత్తిందంటే వారి బలమెంతో పాలకులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేస్తూ,దేశంలో ఇక ముందు ఎలాంటి పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీక్ కాకుండా, అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవలసిందిగా పాలకులకు హితవు పలికారు.

# ఎన్‌డీఏలో ఇద్దరు రాజీనామా

- గతంలోనే వైదొలగిన ఎంజె అక్బర్

**న్యూఢిల్లీ, జులై 25 (జనంసాక్షి) :** నీట్ పేపర్ లీకేజీపై కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థిలోకం నిరసనల ధాటికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. జంతర్ మంతర్ కేంద్రంగా దాదాపు నెల రోజుల పాటు అలుపెరగని పోరాటానికి.. యువతరం మొండిపట్టుదలకు ఎట్టకేలకు దిగొచ్చిన ప్రధాన్ శనివారం రిజైన్ చేశారు. గత ఎనిమిదేళ్లలో ఇలా పదవీకాలం మధ్యలోనే వైదొలిగిన ఏకైక కేంద్ర మంత్రి ప్రధానే కావడం విశేషం. 2018లో విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ అనూహ్యంగా రాజీనామా సమర్పించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థిలోకం శాంతించింది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాన్ స్వచ్ఛందంగా వైదొలగడంతో కాక్రోచ్ జనతా పార్టీ నేతలు ఉద్యమాన్ని విరమించారు. అయితే.. గత ఎనిమిదేళ్లలో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన ఏకైక వ్యక్తి ధర్మేంద్ర ప్రధాన్. అయన కంటే ముందు.. 2018లో అనూహ్య పరిణామాల మధ్య ఎంజే అక్బర్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి బాధ్యతల నుంచి వైదొలిగారు. నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో మంత్రిగా 2016లో బాధ్యతలు చేపట్టిన అక్బర్.. అంతకుముందు వార్త పత్రిక ఎడిటర్‌గా ఉన్న సమయంలో పలు మహిళలపై లైంగిక వేధింపులు పాల్పడ్డాడనే ఆరోపణలు వచ్చాయి. ఆయనకు వ్యతిరేకంగా మీటూ ఉద్యమం తీవ్రమవ్వడంతో అక్బర్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈసారి నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై విద్యార్థులు భగ్గుమనడంతో.. ప్రధాన్ రాజీనామా అనివార్యమైంది. అయితే.. 2017 లో రాజ్‌నాథ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ మాది యూపీఏ ప్రభుత్వం కాదు మంత్రులు రాజీనామా చేయడానికి అని నవ్వుతూ జవాబిచ్చాడు. కట్ చేస్తే తొమ్మిదేళ్లకు ఎన్డేఏ మంత్రివర్గంలోని ధర్మేంద్ర ప్రధాన్ అనూహ్య పరిణామాలతో వైదొలగాల్సి వచ్చింది.

# నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

- మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు
- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జూలై25 (జనంసాక్షి) :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగుపరుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలపై ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. పరీక్షల పవిత్రతను దెబ్బతీసిన వారిపై సత్వర చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్పందించారని మంత్రి చెప్పారు. నిందితుల అరెస్టులు, సకాలంలో మళ్లీ పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలుగుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ చర్యల వల్ల ప్రతిపక్షాల విమర్శలకు విలువే లేకుండా పోయింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, పేపర్లను అమ్మిన, కొనుగోలు చేసిన నేరస్తుల అరెస్టులు శరవేగంగా జరుగుతున్నాయి' అని ఆమె స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్టీఏకు చెందిన 47 మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించిందని ఆమె పేర్కొన్నారు.

# నా దీక్షనే అనుమానిస్తారా?



- కేంద్రంతో లాలూచీ పడతాననుకున్నారా
- విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన

**న్యూఢిల్లీ, జూలై25 (జనంసాక్షి) :** దాదాపు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇటీవల కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను విరమించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ నెరవేరకపోయినా తాను ఎందుకు నిరాహార దీక్ష విరమించాల్సి వచ్చిందో తాజాగా సోనమ్ వివరించారు. ప్రభుత్వంతో ఎలాంటి రహస్య ఒప్పందమూ చేసుకోలేదని, నిరసనకారుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై హింసాత్మక చర్యలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన తనకు కలిగిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. గతంలో లడఖ్‌లో జరిగిన పోలీసు చర్యల మాదిరిగా పరిస్థితి మారకూడదనే ఉద్దేశంతో ఉపవాసాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై లిఖితపూర్వక హామీ లభించిందని ఆయన తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రతీకార చర్యలు ఉండవని, వారి సమస్యలపై చర్చ కొనసాగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. దీక్ష విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. కాగా, జంతర్ మంతర్‌లో నిరసన చేపడుతున్న సీజేపీ నేతలు మాత్రం తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని వారు వెల్లడించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులు చేసిన నిరాహార దీక్షను కేంద్రమంత్రుల సమక్షంలో విరమించిన నేపథ్యంలో.. డీల్ కుదిరిందంటూ ఆయనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని ఆయన తీవ్రంగా ఖండించారు. 'నేను చేసిన దీక్ష ఎంత స్వచ్ఛమైందో నిరూపించుకునేందుకు సర్టిఫికెట్ కావాలా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే దీక్ష విరమించడంపైనా స్పందించారు. దీక్ష విరమించినప్పటి నుంచి చాలా మంది నాకు ఫోన్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు చూపిస్తూ.. మీపై పలు సందేహాలు వస్తున్నాయని చెప్తున్నారు. కేంద్రమంత్రుల సమక్షంలోనే ఎందుకు దీక్ష విరమించారు..? ఏం ఒప్పందం జరిగింది..? అని అడుగుతున్నారు. నేను నిరాహార దీక్ష ఎంత పవిత్రంగా చేశానో ఎవరి నుంచైనా సర్టిఫికెట్ తీసుకోవాలా..? ఇలా బేరాలు కుదుర్చుకోవాల్సి వస్తే.. ఎవరైనా 26 రోజులు ఆకలితో ఉంటారా..? దిల్లీ ఎండలో రోడ్డు పక్కన కూర్చునే బదులు.. ఏసీ గదిలో కూర్చొని డీల్ చేసుకోలేనా' అని తనపై వస్తోన్న విమర్శలకు వాంగ్‌చుక్ కౌంటర్ ఇచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది కచ్చితంగా ముఖ్యమైన విషయం. అయితే నిరసనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిరోధించడమే నాకు ప్రాధాన్య అంశంగా అనిపించింది. అందుకే కేంద్రంతో చర్చల సమయంలో రాజీనామా గురించి నేను డిమాండ్ చేయలేదు. రాజీనామాను వ్యక్తిగతంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అనుకోవడం లేదు. దీన్ని కేంద్రం పెద్ద విషయంగా భావించడం లేదు. రాజీనామా అంశాన్ని నిరాకరించడం వల్ల అపారనష్టాన్ని చవిచూస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారుతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370